

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

సంపుటి 08, సంచిక: 347 | మంగళవారం | 18-11-2025 | మహబూబ్‌నగర్ | Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00



నేటి సామ్రాజ్యవాదం కొత్తరూపాలు – మన పోరాటం 06

డెమోక్రాట్ల ఉచ్చులో చిక్కుకోవద్దు 02

20న బిహార్‌లో కొత్త ప్రభుత్వం 05


## కాంగ్రెస్ తరుపున బిసిలకు

# 42 % రిజర్వేషన్లు

### తొలుత పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తాం

- రూ.3వేల కోట్ల కేంద్ర నిధులు కోల్పోకుండా ఉండేందుకే నిర్ణయం
- కోర్టు కేసులు తెలిన తర్వాతే ఎంపిటిసి, జెడ్‌పిటిసి, మున్సిపల్ ఎన్నికలు



- ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ పేరుతో స్మృతి వనం
- పాఠ్యపుస్తకాల మొదటి పేజీల్లో జయజయహే తెలంగాణ గీతం ముద్రణ
- దత్తసాయికి డిగ్రీ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగం
- డిసెంబర్ 1నుంచి 9వరకు ప్రజాపాలన వారోత్సవాలు
- గిగ్‌వర్కర్లకు భద్రత, భరోసా కల్పిస్తూ బిల్లు
- ఎస్ఎల్‌బిసి ప్రాజెక్టుకు ఆర్‌డిఆర్ పేరు
- రాష్ట్ర మంత్రి వర్గం నిర్ణయం



ప్రజాపక్షం/హైదరాబాద్

స్థానిక సంస్థల ఎన్నికలపై తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. బిసి రిజర్వేషన్ల అమలు విషయంలో కోర్టులో న్యాయ పోరాటం చేస్తూనే స్థానిక సంస్థలకు కేంద్ర నుంచి రావాల్సిన రూ.3 వేల కోట్ల నిధులను కోల్పోకుండా వెంటనే గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఇటీవల మరణించిన ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ పేరుతో స్మృతి వనం ఏర్పాటు చేయాలని, ఆయన రచించిన తెలంగాణ రాష్ట్ర గీతం 'జయజయహే తెలంగాణ' గీతాన్ని ప్రతి పాఠ్య పుస్తకంలోని మొదటి పేజీలో పొందుపర్చాలని, అందెశ్రీ కుమారుడు దత్తసాయికి డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగం ఇవ్వాలని మంత్రివర్గం నిర్ణయించింది. డిసెంబర్ 1 నుంచి 9 వరకు ప్రజాపాలన వారోత్సవాలు నిర్వహించాలని, ఆ తర్వాత గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని, నాలుగు లక్షల మంది గిగ్ వర్కర్లకు భద్రత, భరోసా కల్పిస్తూ గిగ్ వర్కర్ల బిల్లును మంత్రివర్గం ఆమోదించింది. అదే విధంగా ఎస్ఎల్‌బిసి ప్రాజెక్టుకు ఇటీవల మరణించిన మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి పేరును పెట్టాలని తరువాయి 2లో

## షేక్ హసీనాకు

# ఉరిశిక్ష

### బంగ్లాదేశ్ ప్రత్యేక ట్రిబ్యునల్ సంచలన తీర్పు

నాటి హోం మంత్రి కమల్‌కూ అదే శిక్ష

ప్రజాస్వామ్యబద్ధమైన తీర్పు కాదు : హసీనా



**ఢాకా:** పదవీచ్యుతురాలైన బంగ్లాదేశ్ ప్రధానమంత్రి, అవామీ లీగ్ నాయకురాలు షేక్ హసీనా (78)కు ఆ దేశ ప్రత్యేక కోర్టు ఉరిశిక్ష విధించింది. కోర్టుకు హాజరు కాకపోయినప్పటికీ అంతర్జాతీయ ట్రిబ్యునల్ కోర్టు (ఐసిటి) నిందితురాలి వాదనలు వినకుండా ఏకపక్షంగా తీర్పు ప్రకటించింది. విద్యార్థుల ఆందోళన అణచివేత, హింస వెనుక హసీనాను కీలక సూత్రధారిగా ధర్మాసనం తీర్పులో పేర్కొంది. బంగ్లాదేశ్‌లో మరో మూడు నెలల్లో సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఆదరాబాదరాగా ఈ తీర్పు వెలువడింది. ఎన్నికల్లో పోటీ చేయకుండా హసీనా పార్టీ అవా మీ లీగ్‌పై నిషేధం విధించారు. గత ఏడాది జులైనెలలో దేశంలో తలెత్తిన ప్రభుత్వ వ్యతిరేక తిరుగుబాటును మారణాయుధాలతో కఠినంగా అణచివేయాలని ఉత్తర్వులు జారీ చేసినట్లు రుజువు కావడంతో న్యాయస్థానం ఆమెను దోషిగా తేల్చింది. ఈ కేసులో ఆమెతోపాటు సహనిందితుడుగా ఉన్న నాటి హోంమంత్రి అసదుజ్జాన్ ఖాన్ కమల్‌కు కూడా ప్రత్యేక కోర్టు ఉరిశిక్ష విధించింది. నాటి పోలీస్ డైరెక్టర్ జనరల్ ఛౌదురి అబ్దుల్లా మా మన్‌కు ఐదేళ్ళు శిక్ష పడింది. మొత్తం ఐదు కారణాలను చూపిస్తూ ఈ శిక్షలు ప్రకటించారు. ప్రజాస్వామ్య పద్ధతులలో ప్రదర్శకులను అరెస్టు చేసి చట్టప్రకారం న్యాయస్థానం ముందు ఉంచి శిక్షలు విధించడంలో హసీనా ప్రభుత్వం విఫలమైందని, మానవత్వం మరచి ప్రవర్తించిందని ధర్మాసనం మొదటి కారణంగా చూపించింది. నిరాయుధులైన ప్రదర్శకులను అణచివేసేందుకు మారణాయుధాలు, డ్రోన్లు, హెలికాప్టర్లు తరువాయి 2లో

## మక్కా యాత్రలో మహావిషాదం

# 45 మంది బస్సు అగ్ని కీలల్లో భస్మీపటలం

- మృతులంతా హైదరాబాదీలే
- ఒకే ఒక మృత్యుంజయుడు

### మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన 18 మంది విద్యానగర్ వాసులు

- ఘటన పట్ల ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి
- మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5.లక్షలు పరిహారం చెల్లించాలని కేబినెట్ నిర్ణయం



ప్రజాపక్షం/హైదరాబాద్

సౌదీ అరేబియాలో మక్కా–మదీనా మార్గంలో సోమవారం జరిగిన ఘోర ప్రమాదం హైదరాబాద్‌ను శోకసంద్రంలో ముంచింది. ఉమ్రాకు వెళ్ళిన యాత్రికులను మదీనాకు తీసుకెళ్తున్న బస్సు ఒక డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొనడంతో మంటలు వ్యాపించి 45 మంది సజీవదహనం అయ్యారు. మృతులందరు హైదరాబాద్ వాసులు కావడంతో పాతబస్తీ ఒక్కసారిగా ఉలిక్కిపడింది. బస్సు ఢీకొన్న కొన్ని క్షణాలలోనే భారీగా పొగ, అగ్నిజ్వాలలు చెలరేగడంతో ప్రయాణికులలో చాలా మంది బయటకు రాలేకపోయారు. ప్రమాదంలో ఒకే ఒక్క వ్యక్తి మాత్రమే ప్రాణాలతో బయటపడినట్లు సౌదీ స్థానిక అధికారులు తెలిపారు. హైదరాబాద్‌లోని ఆసీఫ్‌నగర్, జిర్రా, టప్పాచబుత్రా, కార్వాన్, దత్తాత్రేయ కాలనీ, ఫలక్‌నుమా, నవాబ్‌సాబ్‌కుంట, తీగలకుంట, నల్లకుంట, విద్యానగర్‌కు మొత్తం చెందిన 45 మంది ఉమ్రా యాత్రకు ఈ నెల 9న శంషాబాద్ విమానాశ్రయం నుంచి వెళ్ళారు. వీరిలో 28 మంది మహిళలు, 17 మంది పురుషులు ఉన్నారు. మరుసటి రోజు వీరంతా సౌదీకి చేరుకున్నారు. మొదటగా వీరంతా 10వ తేదీన మక్కాకు చేరుకుని ఏడు రోజులు అక్కడే ప్రార్థనలు ముగించుకున్నారు. అక్కడి నుంచి మదీనా (ప్రొఫెట్ మహ్మద్ సమాధి) సుమారు 1100 కిలో మీటర్లు ఉంటుంది. ఇక్కడ కూడా ఏడు రోజులు ప్రార్థనలు జరిపేందుకు సోమవారం వారంతా (46 మంది) ఒక ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో బయలుదేరారు. మదీనాకు 25 కిలోమీటర్ల దూరంలో వీరి బస్సును ఆయిల్ ట్యాంకర్ తరువాయి 2లో



- దేశ రాజకీయ చరిత్రలో సిపిఐ ప్రత్యేక స్థానం
- సాయుధ పోరాటం పలు ఉద్యమాలకు నాంది
- ప్రచారజాతాలో సిపిఐ జాతీయకార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి

## అమరుల రక్తతర్పణంతో

# అనేక విజయాలు

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్/డిండి

శతాబ్ది కాలంలో ఎన్నో పోరాటాలు, త్యాగాలు, ఎంతో మంది అమరుల రక్తతర్పణంతో ఎన్నో విజయాలు సాధించి భారత దేశ రాజకీయచరిత్రలో సిపిఐ తనకంటూ ఒక ప్రత్యేక స్థానం సంపాదించుకున్నదని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి గద్దె దించడానికి జరిగిన మహోత్తర తెలంగాణ సాయుధ పోరాటంలో నాలుగున్నర వేల మంది ప్రాణ త్యాగాలతో మూడు వేల గ్రామాల విముక్తి, పది లక్షల ఎకరాల భూమిని పంచిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీదేనని వారు గుర్తు చేశారు. ఆనాటి సాయుధ పోరాటమే పలు ఉద్యమాలకు నెలువై అనేకమంది వీరులకు జన్మనిచ్చిందని, ఆ స్ఫూర్తితోనే నేటికి పోరాట గడ్డగా భాసిల్లుతున్నదన్నారు. సిపిఐ శతాబ్ది ఉత్సవాలు ముగింపును పురస్కరించుకుని గద్వాలలో ప్రారంభమైన బస్సు ప్రచార జాతా సోమవారం నాగర్ కర్నూల్‌కు తరువాయి 12లో

# 50 % కోటా దాటొద్దు

- పరిమితి దాటకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించండి
- మహారాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు కీలక సూచన
- కోటా పరిమితులు ఉల్లంఘిస్తే ఎన్నికలు నిలిపివేయాల్సి ఉంటుందని హెచ్చరిక




**న్యూఢిల్లీ :** స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల పరిమితికి సంబంధించి సుప్రీంకోర్టు సోమవారం కీలక ఆదేశాలు జారీ చేసింది. వచ్చే నెలలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు 50 శాతం పరిమితికి మించకుండా చూడాలని మహారాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. ఒకవేళ రిజర్వేషన్ కోటా పరిమితులను ఉల్లంఘిస్తే ఎన్నికలను నిలిపివేయాల్సి వస్తుందని హెచ్చరించింది. 2022లో జెకె బాంథియా కమిషన్ తన నివేదికలో ఇతర వెనుకబడిన తరగతుల (ఒబిసి)కు 27 శాతం రిజర్వేషన్లు కల్పించాలని సిఫార్సు చేసింది. దానికంటే ముందున్న పరిస్థితి ప్రకారం మాత్రమే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చిలతో కూడిన సుప్రీం ధర్మాసనం పేర్కొంది. అయితే మహారాష్ట్ర సర్కార్ తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అభ్యర్థన మేరకు తదుపరి విచారణను నవంబర్ 19కి వాయిదా వేసింది. అయితే ఎన్నికల్లో రిజర్వేషన్ల పరిమితి 50 శాతానికి మించకూడదని స్పష్టం చేసింది. 'ఇప్పటికే ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైందని, కోర్టు తన ఆర్డర్‌ను నిలిపివేయాలన్నదే పిటిషన్ సారాంశమైతే, మేము ఎన్నికలను నిలిపివేస్తాం. ఈ సర్వోన్నత న్యాయస్థానం అధికారాలను మీరు పరీక్షించవద్దు. రాజ్యాంగ ధర్మాసనం నిర్దేశించిన 50 శాతం రిజర్వేషన్ పరిమితిని మేము ఎప్పుడూ పెంచాలని అనుకోలేదు. ఈ ధర్మాసనంలో కూర్చున్న మేము అలా చేయలేము కూడా. బాంథియా కమిషన్ నివేదిక ఇప్పటికీ సబ్‌జ్యూడిస్ పరిధిలో ఉంది. అందుకే అంతకు ముందు ఉన్న పరిస్థితి ప్రకారం ఎన్నికలు తరువాయి 12లో



## స్పీకర్‌కు నాలుగు వారాలు గడువు

- ఎమ్మెల్యేల అనర్హత విషయంలో జాప్యంపై 'సుప్రీం' ఆగ్రహం
- కోర్టు ధిక్కార చర్య కింద నోటీసు జారీ

**న్యూఢిల్లీ :** తెలంగాణ రాష్ట్రంలో ఎమ్మెల్యేల అనర్హత సంబంధిత పిటిషన్‌పై సోమవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. పదిమంది భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లను నిర్ణయించడానికి అనర్హతపై నిర్ణయం తీసుకోవాలన్న తన ఆదేశాలను పాటించకుండా జాప్యం చేయడంపై సుప్రీంకోర్టు తెలంగాణ శాసనసభ స్పీకర్‌పై మండిపడింది. కోర్టు ధిక్కార నోటీసు జారీ చేసింది. జులై 31న ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం 10మంది తరువాయి 12లో

## చిలీ అధ్యక్ష ఎన్నికల్లో కమ్యూనిస్టు అభ్యర్థి జారా ఆధిక్యం

డిసెంబరు 14న తుది విడత పోలింగ్




**శాంటియాగో:** దక్షిణ అమెరికా దేశం చిలీలో అధ్యక్ష పదవికి జరిగిన మొదటి విడత పోలింగ్ ప్రక్రియలో 80 శాతం ఓట్ల లెక్కింపు పూర్తయ్యేసరికి అధికార కమ్యూనిస్టు పార్టీ కూటమి అభ్యర్థి జీన్నెత్ జారా (51) ఆధిక్యం సంపాదించారు. డిసెంబరు 14వ తేదీన జరిగే తుది విడత ఎన్నికల్లో దేశాధ్యక్ష పదవి చేపట్టేది ఎవరో తేలిపోతుంది. అధికారం పొందాలంటే ఏ అభ్యర్థికైనా 50 శాతం ఓట్లు రావాలి. కానీ ఏ అభ్యర్థికీ ఆ మేరకు ఓట్లు రాకపోవడంతో రన్నాఫ్ పోలింగ్ అనివార్యంగా మారింది. నవంబరు 16వ తేదీన జరిగిన పోలింగ్ ప్రక్రియలో మొత్తం ఎనిమిది మంది అభ్యర్థులు అధ్యక్ష పదవికి పోటీ పడ్డారు. వామపక్ష కూటమి అభ్యర్థి జారాకు ట్రంప్ అనుచరుడుగా చెప్పుకుంటున్న పచ్చిమితవాది జోస్ ఆంటోనియో కాస్ (59) కు మధ్య హోరాహోరీ పోరాటం జరుగుతోంది. మొదటి విడత తరువాయి 2లో

# పేదల ఇళ్లపై బుల్డోజర్లు

- ఖమ్మం జిల్లా అశ్వారావుపేటలో 250 గుడిసెలు నేలమట్టం పేదల ఆర్తనాదాలు, ఆందోళనలతో ఉద్రిక్త వాతావరణం
- సిపిఐ నాయకుల ముందస్తు అరెస్టు



ప్రజాపక్షం/అశ్వారావుపేట

బడుగులపై మరోసారి అధికార యంత్రాంగం తమ ప్రతాపాన్ని చూపింది. వందల ఎకరాలు కబ్జాకు గురవుతున్న పట్టించుకోని అధికార యంత్రాంగం నిరుపేదలు తలదాచుకునేందుకు ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక నివాసాలపై ఐదు జెసిబిలతో తరువాయి 2లో




## మహిళా టెకీ నుంచి రూ.32 కోట్లు కొట్టేసిన కేటుగాళ్లు

డిజిటల్ అరెస్ట్ పేరుతో బెదిరింపులు

బెంగళూరులోని ఇందిరానగర్‌లో వెలుగు చూసిన ఘటన

**ముంబయి:** రోజురోజుకు సైబర్ నేరగాళ్ల రెచ్చిపోతున్నారు. సామాన్యులనే కాకుండా, విద్యావంతులను, టెక్ నిపుణులను కూడా మోసం చేస్తున్నారు. బెంగళూరుకు చెందిన ఓ సీనియర్ మహిళా ఐటి ఉద్యోగిని డిజిటల్ అరెస్ట్ చేస్తామని బెదిరించి ఏకంగా రూ.32 కోట్లు కొట్టేసి న ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. డిజిటల్ అరెస్టు పేరుతో జరిగిన సైబర్ మోసాల్లో ఇదే అతి పెద్దదని పోలీసులు చెబుతున్నారు. బెంగళూరులోని ఇందిరానగర్‌లో ఉమారాణి (57 ఏళ్లు) తరువాయి 12లో



## 'ఐబొమ్మ' ప్లాట్‌ఫామ్‌తో బెట్టింగ్ యాప్స్ ప్రమోట్


- రూ.కోట్లు కొల్లగొట్టిన నిర్వాహకుడు ఇమ్మడి రవి

03

## క్రమంగా 'నరేగా'కు మంగళం

05

- ఒక్క నెలలోనే 27లక్షల మంది పేర్ల తొలగింపు




## కేరళలో బిఎల్ఒ ఆత్మహత్య

## అందరికీ ఇళ్లు, ఆహారం, విద్య



# ప్రపంచం
WORLD NEWS

## జపాన్‌లో బద్దలైన అగ్నిపర్వతం

### విమానాలు రద్దు



**టోక్యో:** జపాన్‌లో సకురాజిమా అగ్నిపర్వత్వం బద్ద లైంది. దీంతో లావా, బూడిద 4,400 మీటర్ల ఎత్తున ఆకాశంలోకి ఎగసిపడుతున్నది. ఆ ప్రాంతం అంతా బూడిద కారుమబ్బుల్లా కమ్ముకుంది. గడచిన 48 గంటలుగా ఈ అగ్నిపర్వతం అనేకసార్లు బద్దలై భారీ ఎత్తున టన్నులకొద్దీ బూడిదను బయటకు వెదజల్లుతోంది. దీంతో విమానాల రాకపోకలు రద్దయ్యాయి. ఈ అగ్నిపర్వత విస్ఫోటనంవల్ల ఎవరైనా గాయపడ్డారా,మర ణించారా అనే విషయం ఇంకా తెలియరా లేదు. జపాన్ క్రూషూ దీవిలో ఉన్న ఈ అగ్ని పర్వతాన్ని స్ట్రాటో వాల్కనోగా పిలుస్తారు.

## ఢాకా యూనివర్సిటీలో స్వీట్లు పంచుకున్న విద్యార్థులు

**ఢాకా:** హసీనాకు ఉరిశిక్ష తీర్పు ప్రకటించిన తర్వాత ఢాకా యూనివర్సిటీలో విద్యార్థులు స్వీట్లు పంచుకున్నారు. ఉత్సాహభరిత వాతావర ణం సృష్టించారు. జులై ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన విద్యార్థులకు మేలు జరిగిందని సర్వత్రా వ్యాఖ్యలు వినిపించాయి. ఢాకా యూనివర్సిటీలో కోర్టు తీర్పు వినడం, చూడటం కోసం లైవ్ టెలీ కాస్ట్ నిమిత్తం పెద్ద పెద్ద టీవీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం 11 గంటల నుండే వందలమంది విద్యార్థులు ఈ స్క్రీన్ల వద్ద కొలువుతీ రారు. తీర్పు వెలువడిన వెంటనే కేరింతలు కొట్టారు. ఇదిలా ఉండగా, దేశ న్యాయ చరిత్రలో మైలురాయి వంటి తీర్పు అని బంగ్లాదేశ్ అటార్నీ జనరల్ మహ్మద్ అసదుజ్జామన్ అన్నా రు. దేశ ప్రజలు, ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, చట్టపా లన, అమరవీరుల పట్ల ఉన్న బాధ్యతలను నెరవే ర్చడంలో భాగంగా ఈ తీర్పు వెలువడిందన్నారు. గత ఏడాది జులై ఉద్యమంలో మరణించిన కుటుంబాలకు, గాయపడినవారికి నష్టపరిహారం చెల్లించాలని కూడా కోర్టు తీర్పు చెప్పిందన్నారు. అవామీలీగ్ పార్టీపై నిషేధంలో కోర్టు జోక్యం చేసు కోలేదన్నారు. అదేవిధంగా బంగ్లాదేశ్ చట్ట విభాగం సలహాదారు ఆసిఫ్ నస్రుల్లా స్పంది స్తూ మాజీ హోంమంత్రి అసదుజ్జామన్ ఖాన్ కమల్ చేసిన తప్పులకు తగిన శిక్ష పడిందని అన్నారు. ఆయనకు విధించిన ఉరిశిక్షను సమర్థించారు.

**హసీనాను దేశానికి రప్పించండి: జమాతే ఇస్లామీ డిమాండ్**

షేక్ హసీనాను దేశానికి రప్పించాలని బంగ్లాదేశ్ జమాత్–ఎ–ఇస్లామీ ప్రధాన కార్యదర్శి మియా గోలమ్ పోర్వార్ డిమాండ్ చేశారు. హసీనాకు కోర్టు శిక్ష విధించిన తర్వాత ఆయన మీడియాతో మాట్లాడుతూ తీర్పును గట్టిగా సమర్థించారు. వెం టనే హసీనాను తమ దేశానికి పంపాలని భార త్‌ను ఆయన నేరుగా డిమాండ్ చేశారు. భారత్ ఒక మంచి పొరుగుదేశంగా ఉండాలనుకుంటే, ఒక మంచి మిత్రదేశంగా బంగ్లాదేశ్‌కు ఉండాలను కుంటే, వెంటనే హసీనాను తమ దేశానికి పంపిం చడమే భారత ప్రభుత్వ ప్రథమ, ప్రధాన బాధ్యత, కర్తవ్యమని ఆయన అన్నారు. అదేవిధంగా ట్రైబ్యు నల్ ధర్మాసనం ఇచ్చిన తీర్పుకు తిరుగులేదని అన్నారు. ఈ తీర్పు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడుకున్నదని, ఇక ఈ తీర్పును, విచారణను ఎవ్వరూ ప్రశ్నించడానికి వీలులేనిదన్నారు. కోర్టు తీర్పును హసీనా తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ తీర్పు రాజకీయ దురుద్దేశంతో కూడుకున్నదని ఆమె వ్యాఖ్యానించడంతో పోర్వార్ పైవిధంగా స్పందించారు.



**ఫాసిజానికి హెచ్చరిక: బిఎన్‌పి**

బంగ్లాదేశ్‌లో భవిష్యత్‌లో ఫాసిజం తలెత్తకుండా ఇది కొత్త తరం నాయకులకు ఒక హెచ్చరిక అని బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ (బిఎన్‌పి) ప్రధాన కార్య దర్శి మీర్జా ఫక్రుల్ ఇస్లాం అలంఘీర్, స్థాయీ సంఘం సభ్యుడు సలాహుద్దీన్ అహ్మద్ వ్యాఖ్యా నించారు. ఈ తీర్పు కేవలం హసీనాకు మాత్రమే సంబంధించినది కాదనీ, ఈ దేశం గడ్డమీద జరిగే అన్ని రకాల ఫాసిజానికి, నియంతృత్వానికీ వ్యతి రేకంగా చెప్పిన తీర్పు అనీ మీర్జా ఫక్రుల్ అలం ఘీర్ అన్నారు. అవామీలీగ్ నేత, మాజీ ప్రధాన మంత్రి షేక్ హసీనాకు ప్రత్యేక ట్రైబ్యునల్ ఉరిశిక్ష విధిస్తూ ఇచ్చిన తీర్పుపై ఆయన సోమవారం అలంఘీర్ మాట్లాడుతూ, దేశ చరిత్రలో ఈ తీర్పు ఒక మైలురాయి ఘట్టమని అన్నారు. స్వచ్ఛమైన, న్యాయబద్ధమైన తీర్పుకు, భవిష్యత్ నాయకులకు ఒక హెచ్చరికగా హసీనాకేసు తీర్పు ఒక గుణపా ఠంగా మారిందని అన్నారు. దేశంలో ఫాసిజం పాలన చెల్లదని, ఏకవ్యక్తి ఇష్టానుసార రాజ్యం సాగదని, ఇక ఎవ్వరూ ఫాసిస్టు పాలకుడుగా మారకూడదని చెప్పడానికి ఈ తీర్పు గుణపాఠమ న్నారు. ఇంతకంటే కఠినమైన శిక్షలను చట్టం విధించలేదన్నారు.

## డెమోక్రాట్ల ఉచ్చులో చిక్కుకోవద్దు

### ఎప్‌స్టీన్ ఫైల్స్‌కు మద్దతుగా ఓటేయాలని ట్రంప్ పిలుపు

**వాషింగ్టన్:** జెఫ్రీ ఎప్‌స్టీన్ ఫైల్స్‌ను విడుదల చేసేందుకు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మద్దతు తెలియజేశారు. ఎప్‌స్టీన్ పత్రాలపై ట్రంప్ మాట మార్చారు. ఎప్‌స్టీన్ వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణ జరపాలన్న డిమాండ్ రోజు రోజుకూ దేశంలో పెరుగుతున్న తరు ణంలో ట్రంప్ తన మాట మార్చారు. కాంగ్రె స్‌లో ఈ పత్రాలను విడుదల చేసేందుకు అను కూలంగా ఓటు వేయాలని తన సొంత రిపబ్లిక న్‌పార్టీ నాయకులకు, ప్రజా ప్రతినిధులకు పిలుపు ఇచ్చారు. డెమోక్రాట్లు పన్నిన ఉచ్చులో చిక్కుకోకుండా జాగ్రత్తగా ఉండాలని కోరారు. పార్టీని, ప్రభుత్వాన్ని భ్రష్టు పట్టించడంకోసం రిపబ్లికన్లపై డెమోక్రాట్లు ఉచ్చు బిగించారని, ఈ ఉచ్చులో మనం చిక్కుకోకూడదని హెచ్చరిక చేశారు. ''ఇది మన సమస్య కాదు, డెమోక్రాట్ల సమస్య, డెమోక్రాట్లు సృష్టించిన సమస్య, జెఫ్రీ ఎప్‌స్టీన్ ఒక డెమోక్రాట్, ఇది వారి సమస్యేగానీ మన సమస్య కాదు, అందువల్ల జెఫ్రీ ఎప్‌స్టీన్‌కు సంబంధించిన పత్రాలన్నీ బహిరంగంగా ప్రజల చేతికి వచ్చేందుకు, అవన్నీ విడుదలయ్యేందుకు వీలుగా చట్టసభలో అనుకూలంగా ఓటు వేయా లని రిపబ్లికన్లకు పిలుపు ఇచ్చారు. ఎప్‌స్టీన్ పత్రా లతో తమకు సంబంధం లేదని, తన పాత్ర లేదని ఆయన అన్నారు. తన పాత్ర ఉందన డాన్ని ఆయన తిరస్కరించారు. హౌస్ ఓవర్‌సైట్



కమిటీతో తమకు సంబంధం లేదని, అనుకూ లంగా ఓటు వేయాలని రిపబ్లికన్లను కోరారు. గడచిన పది నెలలుగా మన సాధించిన విజయా లను ప్రచారం చేసుకోవడానికే మనం ప్రాధా న్యత నిద్దాం, ఆ విజయాలను ప్రజల్లో ప్రచారం చేసుకోవడానికే మనం ప్రాముఖ్యతనిద్దాం, డెమోక్రాట్ల ఉచ్చులో చిక్కుకోవద్దు అన్నారు. ఎప్‌స్టీన్ వ్యవహారం పూర్తిగా ట్రంప్‌కు తెలుసు నని, అతగాడితో ట్రంప్‌కు సన్నిహిత సంబం ధాలు ఉన్నాయని, అతడితో తీయించుకున్న ఫోటోలు ఉన్నాయని పత్రాలు చెబుతున్నప్పటికీ ట్రంప్ ఈ విషయాన్ని వ్యతిరేకిస్తున్నారు. రాబోయే 30 సంవత్సరాలలో ఈ అగ్నిపర్వతం భారీ ఎత్తున బద్దలై తీవ్ర విధ్వంసం సృష్టిస్తుం దని 2016లోనే బ్రిస్టోల్ యూనివర్సిటీ అధ్య యన బృందం ఈ ప్రాంతాన్ని పరిశీలించి ఒక నివేదిక సమర్పించింది. ఈ సకురోజిమా అగ్ని పర్వతంలో అతిపెద్దదైన కిటా–డమా శిఖ రాగ్రం సముద్రమట్టానికి 3,66 అడుగుల ఎత్తులో ఉంది.

## అమెరికా సైనిక స్థావరాలకు ఈక్వెడార్ ప్రజల తిరస్కృతి

**క్వీటో:** అమెరికా సైనిక స్థావరాలను ఏర్పాటు చేసేం దుకు ఈక్వెడార్ ప్రజలు తిరస్కరించారు. విదేశీ స్థావ రాలు ఏర్పాటు చేసే విషయంపై జరిగిన రిఫరెండంలో ప్రజలు గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని వ్యతిరే కంగా ఓటు వేశారు. దీంతో ఈక్వెడార్ ప్రతిపక్ష శిబి రంలో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. ఈక్వెడార్ ప్రజలు తిరస్కరించడంతో తూర్పు పసిఫిక్ ప్రాంతంలో తన ఉనికిని విస్తరించుకోవాలని అమెరికా చేస్తున్న ప్రయత్నాలు విఫలమయ్యాయి. అమెరికా ప్రభుత్వం తీవ్ర నిరాశకు గురైం ది. అమెరికాకు పూర్తి మద్దతు తెలి యజేసే ఈక్వెడార్ అధ్యక్షుడు డేనియల్ నోబోయాకు ఈ రిఫరెండంలో ఓటమి పెద్ద శరాఘాతంగా మారింది. ఈక్వెడార్‌లో విదేశీ సైనిక స్థావరాలు ఏర్పాటు చేయ కుండా 2008లో రాజ్యాంగాన్ని సవరిస్తూ ఈక్వెడార్ చట్టసభ ఒక తీర్మానం చేసింది. ఐతే అధ్యక్షుడు నోబో యా ట్రంప్ అనుచరుడుగా ఈ సంప్రదాయాన్ని తిరగ రాసేందుకు విశ్వప్రయత్నం చేశారు. రిఫరెండంకోసం జరిగిన ప్రచారంలో రాజ్యాంగాన్ని మారుస్తామని ప్రక టించారు. దేశాధ్యక్షుడి అభిప్రాయాలతో విభేదించిన ప్రజలు ఆయనకు వ్యతిరేకంగా రిఫరెండంలో ఓటు వేశారు. ప్రతిపక్షాలకు మంచి విజయం లభించినట్ల యింది. దేశంలో వ్యవస్థీకృత నేరాలను అరికట్టేందుకు, హింసను అరికట్టేందుకు, ప్రపంచంలో మాదక ద్రవ్యా ల బెడదకు ఆజ్యం పోస్తున్న దేశంలో ఎదురవుతున్న వ్యతిరేక శక్తులను అరికట్టేందుకు తన ప్రతిపాదన ఎం తో ఉప యోగపడుతుందని ప్రజల్లో ఆయన ప్రచార ం చేశారు.

## బిసిలకు 42 % రిజర్వేషన్లు

(మొదటి పేజీ తరువాయి)

మంతివర్గం తీర్మానించింది. తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధ్యక్షతన సోమవారం సాయంత్రం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచి వాలయంలో జరిగింది. మంత్రివర్గం సమావేశం నార్ణయా లను అనంతరం మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మ ణ్, ప్రభుత్వ సలహాదారులు మహ్మద్ షబ్బీర్ అలీ, జి.వివేక్ వెంకట్‌స్వామి మీడియాకు వెల్లడించారు. సౌదీ అరేబియాలో బస్సు ప్రమాదంలో మరణించిన బాధిత కుటుంబాలకు రూ.5 లక్షలు పరిహారం అందించాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. అదే విధంగా మంత్రి అజారుద్దీన్, ఎంఐఎం ఎంఎల్‌ఎ, మైనారిటీ విభాగానికి చెందిన ఒక అధికారితో కూడిన ప్రభుత్వ ప్రతినిధి బృందాన్ని వెంటనే సౌదీకి పంపించాలని నిర్ణయించింది. చనిపోయిన వారి మృతదేహాలను మత సంప్రదాయం ప్రకారం అక్కడే అంత్యక్రియలు చేయాలని, బాధితకుటుంబ సభ్యులను ఒక్కో కుటుంబానికి ఇద్దరిని తీసుకెళ్లేందుకు ఏర్పాట్లు చేయాలని మంతివర్గంలో నిర్ణ యించారు.

మంత్రి మంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ బిసిలకు 42 శాతం రిజరే వషన్లను కల్పించి స్థానిక సంస్థలకు వెళ్లాలని అసెంబ్లీలో బిల్లును ఆమోదించినప్పటికీ రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్న దని, అయినప్పటికీ ప్రభుత్వం చిత్తశుద్ధితో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను కలిపంచాలని శతవిధాలుగా ప్రయత్నిం చినా కేంద్రం సహకారం లేకపోవడంతో , బిల్లులు రాష్ట్రపతి వద్దనే ఉన్నదని, కోర్టులలో వ్యతిరేకంగా నిర్ణయం వచ్చింద న్నారు. ఈ విషయంలో న్యాయస్థానంలో పోరాటం చేస్తూనే, 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.3 వేల కోట్లు కొల్పోయే ప్రమాదం ఉన్నదని, ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ పరంగా 42 శాతం రిజర్వేషన్లు సీట్లు కేటాయిస్తూ, ముందుగా గ్రామ పంచయతీ ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించామని, ఆ తర్వాత కోర్టులో ఒక నిర్ణయం వచ్చిన తర్వాత ఒక నిర్ణయం తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నదని వివరించారు.

డిసెంబర్ 9 నాటికి ఇందిరమ్మ ప్రభుత్వం రెండేళ్లు పూర్త వుతుందని, సంక్షేమ కార్యక్రమాలతో పాటుఅభివృద్ధి, హైద రాబాద్ కోర్ ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి, ఇండస్ట్రీ పాలసీ, సమ్మిట్ అన్నింటినీ ఫోర్త్ సిటీలో డిసెంబర్ 8, 9న గ్లోబల్ సమ్మిట్ ఏర్పాటు చేయాలని , దీనికి సంబంధించిన ఏర్పాట్లు యుద్ధప్రాతిపాదికన చేపట్టాలని, డిసెంబర్ 9న విజన్ డాక్యుమెంట్‌ను ప్రారంభించాలని నిర్ణయం తీసుకు న్నామన్నారు. ఒఆర్‌ఆర్ లోపల ఇండస్ట్రీలు ఉండ కూడదనే నియమనిబంధనలు ప్రకారం వాటిని రిప్లేస్ చేయాలని, ఈ స్థలాల్లో మినీ యూత్ జోన్లుగా ఏర్పాటు చేసి, రోడ్డు వేడల్పు ప్రకారం రాష్ట ప్రభుత్వానికి ఫీజు లను వసూలు చేయాలని నిర్ణయించామన్నారు. మంత్రి వివేక్ మాట్లాడుతూ గిగ్ వర్కర్లకు న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తా మన్నారు. గిగ్ వర్కర్ల చట్టం వారికి న్యాయం చేయడంలో ప్రారంభం దశ మాత్రమేనని, ఇందులో ఏది మంచిది అనే అంశాలను పరిశీలించి అవసరమైతే మార్పులు చేస్తామ న్నారు.

**ప్రభుత్వానికి టిజిపిడబ్ల్యుయు కృతజ్ఞతలు**

గిగ్ వర్కర్స్ బిల్లుకు తెలంగాణ మంత్రివర్గం ఆమోదం తెలిపినందుకు తెలంగాణ గిగ్, ప్లాట్ ఫామ్ వర్కర్స్ యూని యన్ (టిజిపిడబ్ల్యుయు) మంత్రివర్గం చారిత్రాత్మక, ప్రగతి శీల నిర్ణయం తీసుకున్నందుకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి, కార్మిక శాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామికి యూనియన్ అభినందనలు తెలియజేసింది. ఈ నిర్ణయం ద్వారా తెలంగాణ ప్రభుత్వం లక్షలాది గిగ్, ప్లాట్ ఫామ్ కార్మికుల సామాజిక భద్రత, గౌరవం, రక్షణ పట్ల ఉన్న అంకి తభావాన్ని మరొకసారి చాటిచెప్పిందని టిజిపిడబ్ల్యుయు వ్యవ స్థాపక అధ్యక్షులు షేక్ సలావుద్దీన్ ఒక ప్రకటనలో తెలి పారు. మన నగరాలు సజావుగా నడవడానికి ప్రతిరోజూ శ్రమిస్తున్న కార్మికుల భవిష్యత్తును మరింత న్యాయబద్ధమైన దిగా, సమగ్రంగా, భద్రంగా మార్చే దిశగా ఇది కీలక అడుగు అని ఆయన పేర్కొన్నారు.

టిజిపిడబ్ల్యుయు ఈ మార్గదర్శక నిర్ణయాన్ని హర్షిస్తు న్నదని, గిగ్, ప్లాట్ ఫామ్ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టే అమలు చర్యల్లో యూనియన్ సంపూర్ణంగా సహకరిస్తుందని ఆయన తెలిపారు.

## జారా ఆధిక్యం (మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల్లో జారాకు 26.85 శాతం ఓట్లు లభించగా, జాక్‌గా పిలిచే మితవాది ఆంటోనియో కాస్‌కు 23.92 శాతం ఓట్లు లభించాయి. జారాకు మొత్తం 3,475,206 ఓట్లు లభించగా, జాక్‌కు 3,096,653 ఓట్లు లభించాయి. ఇక మధ్యేవాద మితవాదపార్టీ నాయకుడు, ఆర్థికవేత్త ఫ్రాంకో పరిసి అందరినీ ఆశ్చర్యపరుస్తూ మొదటి విడత పోలింగ్‌లో మూడోస్థానంలో నిలిచారు. మాజీ యూట్యూబ్ ప్రొవొకేటర్ రాడికల్, లిబరల్ అభ్యర్థి జోహన్నెస్ కైజర్ నాలుగో స్థానం సంపాదించారు. ఎంతమంది పోటీ చేసినప్పటికి ఎక్కువ ఓట్లు సంపా దించిన మొదటి ఇద్దరు అభ్యర్థుల మధ్య తుది విడత ఎన్నికల పోరాటం జరు గుతుంది. ఈ మేరకు జారాకు, జాక్‌కు మధ్య నువ్వా? నేనా? అనే రీతిలో డిసెంబరు 14న రన్నాఫ్ ఎన్నికలో ప్రజలు తీర్పు ఇవ్వనున్నారు. మూడు మితవాద పార్టీలకు చెందిన అభ్యర్థులు రన్నాఫ్ ఎన్నికల నుండి వైదొలడంతో తుది విడత ఈ ఓట్లన్నీ ఎవరికి వస్తాయన్న ఉత్కంఠ భరిత, ఉద్విగ్న వాతావ రణం ఇప్పుడు కొనసాగుతున్నది.

## బుల్డోజర్లు (మొదటి పేజీ తరువాయి)

దాడి చేసి నేలమట్టం చేశారు. ఆ ఉన్న కొద్ది సామానును బయట వేసుకునేం దు కు కూడా అవకాశం ఇవ్వలేదు. కాళ్లా వేళ్లా ప్రాధేయపడిన కనికరించ లేదు. 200 మంది పోలీసులు ఒక యుద్ధ వాతావరణాన్ని తలపించే రీతిలో బడుగుల నివాసాలను కూల్చిన ఘటన సోమవారం తెల్లవారు జామున అశ్వారావుపేటలో జరిగింది. పేదల ఆర్తనాదాలు, ఆందోళనలతో ఉద్రిక్త వాతావ రణం ఏర్పడిం ది. చంటి పిల్లలు, వృద్ధులు చలికి గజగజ వణికిపోయారు.



అశ్వారావుపేటలోని 1228 సర్వే నెంబర్‌లో దాదాపు 250 మంది పేదలు గుడిసెలు వేసు కుని మూడేళ్లుగా జీవిస్తున్నారు. వీటిని కూల్చేందుకు అర్థరాత్రి సమయంలో ఇండ్లలో నిద్రి స్తున్న సిపిఐ నాయకులను అరెస్టు చేసి దమ్మపేట పోలీస్ స్టేషన్‌కు తరలించి ఆ తర్వాత జెసిబిలతో పేదల నివాసాలను నేలమట్టం చేశారు. కాళ్లా వేళ్లా పడ్డ కనికరించ లేదు. కొంతమంది పేదలు అధిక వడ్డీలకు తెచ్చి రేకులు వేసుకుని జీవిస్తున్నారు. ఉన్న గూడు కాస్త కూలిపోవడంతో వారి వేదన వర్ణణాతీతంగా ఉంది. తమకు ప్రభుత్వం వెంటనే ప్రత్యామ్నాయం చూపాలని పేదలు వేడుకుంటున్నారు.

**ప్రత్యామ్నాయం చూపే వరకు కదిలేది లేదు : పాషా**

సిపిఐ ఆధ్వర్యంలో అశ్వారావుపేటలో ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసు కుని జీవిస్తున్న వారి జీవితాలను అధికార యంత్రాంగం ఛిద్రం చేసిందని ప్రత్యామ్నాయం చూపే వరకు ఆ స్థలం నుంచి కదిలేది లేదని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా తేల్చి చెప్పారు. సోమవారం ధ్వంసమైన ఇండ్లను ఆయన పరిశీలించారు. పేదల గోడును విన్నారు. నిర్దాక్షి ణ్యంగా కూల్చివేయడాన్ని సాబీర్‌పాషా తీవ్రంగా ఖండించారు. ఈ కూల్చివే తకు జారే ఆదినారాయణ బాధ్యత వహించాలని సాబీర్‌పాషా తెలిపారు. ప్రజాప్రతినిధి అయి ఉండి పేదల పక్షాన ఆలోచన చేయకుండా పేదల గుడిసె లను కూల్చడం దుర్మార్గమన్నారు. అభివృద్ధికి కమ్యూనిస్టు పార్టీ అడ్డు కాదని కానీ యంగ్ ఇండియా స్కూల్‌కు కేటాయించిన భూమి 18 ఎకరాలు ఉందని పక్కనే ఓ భూస్వామి వందల ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించినా దానిని తీసుకోకుండా పేదలపై కక్ష కట్టారని పాషా తెలిపారు. మాఫియాను తల పించే రీతిలో వ్యవహరిస్తున్న స్థానిక తహసీల్దార్ రామకృష్ణ పై చర్యలు తీసుకో వాలని ఆయన డిమాండ్ చేశారు. పేదలు ఉండే స్థలమే యంగ్ ఇండియా స్కూల్‌కు అవసరమైతే పేదలకు ప్రత్యామ్నాయం చూపించి వారితో చర్చలు జరిపి భూమిని స్వాధీనం చేసుకుంటే మంచిదన్నారు. యంత్రాలను తీసుకు వచ్చి పారా మిలట రీ ద్వారా ధ్వంసం చేయడం దేనికి సంకేతమని ఆయన ప్రశ్నించారు. కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి పేదల విషయం తెలపడంతో పట్టాలు ఇచ్చేందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని కానీ ఇంతలోనే స్థానిక అధికార యంత్రాంగం ఈ దారుణానికి ఒడిగట్టిందన్నారు. ప్రత్యామ్నాయ స్థలం చూపేంత వరకు తమ పోరాటం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, నరాటి ప్రసాద్, సయ్యద్ సలీం, కె. వెంకటేశ్వరరావు, మండల నాయకులు గన్నిన రామకృష్ణ, వి.అర్జున రావు, విజయ్‌కాంత్ , తదితరులు పాల్గొన్నారు.

## భస్మీపటలం (మొదటి పేజీ తరువాయి)

ఢీ కొట్టింది. క్షణాల్లో మంటలు వ్యాపించి బస్సు మొత్తం దగ్ధమైంది. సహాయ చర్యలు ఆరంభించేలోపే ప్రయాణికులంతా దగ్ధమయ్యారు. ఈ ప్రమాదంలో హైదరాబాద్ ఆసిఫ్‌నగర్‌కు చెందిన షోయబ్ సఫీ అనే యువకుడు ఈ ప్రమాదం నుం చి క్షేమంగా బయటపడ్డాడు. ప్రస్తుతం అతను సౌదీలోని ఆసుప త్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇతని ప్రాణాలకు ఎలాంటి హానీ లేదని డాక్టర్లు ధృవీకరించారు. హైదరాబాద్ విద్యానగర్‌కు చెందిన రిటైర్డ్ రైల్వే అధికారి కుటుంబంలోని 18 మంది కూడా ఇదే ప్రమాదంలో దుర్మణం చెందారు.

**సహాయక చర్యల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు**

ప్రమాదానికి సంబంధించిన సమాచారం అందుకున్న వెంటనే భారత విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ సౌదీలోని భారత మిషన్‌లకు పూర్తి సహాయం అందించాలని ఆదేశించారు. కుటుంబాలకు అవసరమై న సమాచారం అందిం చేందుకు జెడ్డాలో 24/7 కంట్రోల్ రూమ్‌ను తెరిచి నట్లు భారత కాన్సులేట్ ప్రకటించింది. తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఈ ఘటనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, మృతుల వివరాలను తక్షణం సేకరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.

**హెల్ప్‌లైన్ నంబర్లు ఏర్పాటు !** ప్రమాదంలో మర ణించిన వారి కుటుంబాలకు సహాయం అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం రెండు హెల్ప్‌లైన్ నంబర్లను ఏర్పా టు చేసింది. +9179979 59754, +91 99129 19545 నంబర్ల ద్వారా బాధితులకు సంబంధించిన మరిన్ని వివరాలు తెలుసుకోవచ్చు.

**కుటుంబాల ఆర్తనాదం :** సౌదీ ప్రమాదంలో తెలం గాణవాసులు కూడా ఉన్నారని తెలిసిన వెంటనే హైదరా బాద్, రంగారెడ్డి, మేడ్చల్ ప్రాంతాల్లోని అనేక కుటుం బాలు తీవ్ర ఆందోళనకు గురయ్యాయి. తమ సన్నిహి తుల మృతదేహాలను స్వదేశానికి తీసుకురావాలని కుటుంబ సభ్యులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను వేడు కుంటున్నారు.



**నాలుగు ట్రావెల్స్ ద్వారా ...**

సౌదీ ఉమ్రా యాత్ర కోసం ఇక్కడి నుంచి నాలుగు ట్రావెల్స్ ఏజెన్సీల ద్వారా మొత్తం 45 మంది వెళ్లారు. వీరిలో మహిళలు 28 మంది ఉండగా పురుషులు 17 మంది ఉన్నారు. అల్‌మక్కా ట్రావెల్స్ నుంచి 15 మంది, బాబుల్ హర్మైన్ ట్రావెల్స్ నుంచి 21 మంది, హఫ్సా ట్రావెల్స్ నుంచి ఐదుగురు, మహమూద్ భాయిజాన్ ట్రావెల్స్ నుంచి నలుగురు వెళ్లారు.

**ఉమ్రా యాత్రకు వెళ్లిన వారి పేర్లు**

మహిళలు : హుమేరా నజ్నీన్, సబీహా సుల్తానా, నసీరుద్దీన్, ఉమైజా, మరియం ఫాతిమా, మెహ్రీష్, రిడా తజీన్, అక్తర్ బేగం, అనీస్ ఫాతిమా, అమీనా బేగం, సారా బేగ్యుమ్, షబానా బేగం, రిజ్వానా బేగం, ఫరానా సుల్తానా, తస్మియా తహ్రీన్, సనా, గౌసియా బేగం, జహీన్ బేగం, ఫర్హీన్ బేగం, షౌకత్, జకియా, పర్వీన్ బేగం, షెహ్నాజ్, రహమత్‌బిన్, రహీమ్ ఉన్నిసా, రేయీస్ బేగం, షాజెహాన్, సారా మహమూద్.

పురుషులు : ఇర్ఫాన్ అహ్మద్, హమదాన్, ఇజాన్, షేక్ జైన్ ఉద్దీన్, మహమ్మద్, ఉజైరుద్దీన్, సలీమ్, హుజైఫా జాఫర్, సలావుద్దీన్, మహమ్మద్ అలీ, అబ్దుల్ ఖాదీర్, మొహమ్మద్ షోయబ్, మహమ్మద్ మంజూర్, మస్తాన్, సోహైల్, మొహమ్మద్ మౌలానా, శిరహట్టి.

**నష్ట పరిహారం అందించాలని కేబినెట్ నిర్ణయం**

సౌదీ ఆరేబియాలో మక్కా నుంచి మదీనాకు ప్రయా ణిస్తున్న బస్సు ప్రమాదానికి గురైన దుర్ఘటనలో మరణిం చిన తెలంగాణాకు చెందిన బాధిత కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం అందించాలని తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. ముఖ్యమంత్రి ఎను ముల రేవంత్ రెడ్డి అధ్యక్షతన సోమవారం జరిగిన మంత్రివర్గ సమావేశం ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసింది. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సాను భూతిని తెలియజేసింది. మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ నేతృత్వంలో ఎంఐఎం ఎంఎల్‌ఎ, మైనారిటీ విభాగానికి చెందిన ఒక అధికారితో కూడిన ప్రభుత్వ ప్రతినిధి బృందాన్ని వెంటనే సౌదీ అరేబియాకు పంపించాలని మంత్రివర్గ సమావేశం నిర్ణయించింది. చనిపోయిన వారి కుటుంబ సభ్యుల నిర్ణయం మేరకు మృతదేహాలకు మత సంప్రదాయాల ప్రకారం అక్కడే అంత్యక్రి యలు చేయాలని, అందు కోసం బాధిత కుటుంబ సభ్యులను ఒక్కో కుటుంబం నుంచి ఇద్దరిని సౌదీ అరేబియా తీసుకెళ్లడానికి వీలుగా ఏర్పాట్లు చేయా లని నిర్ణయించారు.

**ప్రధాని మోదీ, సిఎం దిగ్భ్రాంతి**

'మదీనాలో జరిగిన ప్రమాదంలో హైదరాబాద్ వాసులు 45 మంది మరణించడం తనకు చాలా బాధ కలిగించింది. తమ ప్రియమైన వారిని కోల్పో యిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నాను. గాయపడిన వారంతా త్వరగా కోలుకోవాలి' అని ప్రధాని తన సంతాప సందే శంలో పేర్కొన్నారు. రియాద్‌లోని భారత రాయ బార కార్యాలయం, జెడ్డాలోని కాన్సులేట్ సాధ్యమై నంత సహాయం అందిస్తున్నాయని ప్రధాని తెలి పారు. భారత అధికారులు సౌదీ అరేబియా అధికారు లతో సహాయక చర్యల్లో ఉన్నారని వెల్లడించారు.

సౌదీ అరేబియాలో తెలంగాణ యాత్రికులతో ఉన్న బస్సు ఘోర ప్రమాదంపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మక్కా నుంచి మదీనా వెళ్తుం డగా ఈ ప్రమాదం జరిగిందని తెలిసిన వెంటనే స్పందిం చిన సిఎం పూర్తి వివరాలు తెలుసుకోవాలని సిఎస్, డిజి పిని అదేశించారు. తెలంగాణకు చెందిన వారు ఎంత మంది ఉన్నారని ఆరా తీశారు. కేంద్ర విదేశాంగ శాఖ, సౌదీ ఎంబసి అధికారులతో మాట్లాడాలని సూచించారు. వెంటనే తగిన సహాయక చర్యలకు రంగంలోకి దిగాలని అదేశించారు. సిఎం అదేశాలతో సిఎస్ రామకృష్ణారావు ఢిల్లీలో ఉన్న కోఆర్డినేషన్ సెక్రటరీ గౌరవ్ ఉప్పల్‌ను అప్ర మత్తం చేశారు. ప్రమాదంలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారు ఎంత మంది ఉన్నారనే వివరాలు సేక రించి వెంటనే అందించాలని అదేశించారు. సచివా లయం లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు.

## ఉరిశిక్ష (మొదటి పేజీ తరువాయి)

ఉపయోగించాలని హసీనా ఆదేశాలు ఇచ్చారని రెండో కారణంగా చూపించింది. జులైలో ప్రారంభమైన ఉద్య మంలో దాదాపు 1400 మంది మరణించారని, వీరిలో ఎక్కువమంది భద్రతా దళాల కాల్పుల్లోనే మరణించారని ఐక్యరాజ్యసమితి మానవహక్కుల సంఘం నివేదిక ఇంత కుముందే ప్రకటించింది.

మానత్వానికి వ్యతిరేకంగా అణచివేత, హత్యలు, చిత్రహింసలు వంటి నేరాలు సహా మొత్తం ఐదు ప్రధాన కారణాలను చూపిస్తూ త్రిసభ్య ధర్మాసనం సోమవారం సంచలన తీర్పు ఇచ్చింది. గత ఏడాది జులైనెలలో నిరా యుధులైన యువతరం తిరుగుబాటును కుట్రపూరి తంగా వ్యవహరించి మారణాయుధాలతో అణచివేశా రని, ప్రజల సమస్యలు అర్థం చేసుకోకుండా మానవత్వా నికి వ్యతిరేకంగా హత్యలకు పాల్పడ్డారని పేర్కొంది. తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు, పేలుడు ఘటనలు, హింసా కాండ కొనసాగుతున్న తరుణంలో భారీ భద్రత మధ్య ధర్మాసనం తీర్పును లైవ్ టెలికాస్ట్ చేశారు. నెలలపాటు విచారణ అనంతరం ప్రాసిక్యూషన్ ముందునుండీ కోరిన విధంగా తీర్పు వెలువడింది.

**భారత్–బంగ్లాదేశ్ దౌత్య సంబంధాలకు అగ్నిపరీక్ష !**

హసీనా కేసు తీర్పుతో భారత్–బంగ్లాదేశ్ సంబంధా లపై పలు వ్యాఖ్యలు వెలువడుతున్నాయి. ఈ రెండు దేశాలమధ్యా దౌత్య సంబంధాలు ఇక మరింత అగ్ని పరీ క్షకు గురవుతాయని అంతర్జాతీయ మీడియా వ్యాఖ్యా నాలు ప్రారంభించింది. ఈ తీర్పుతో భారత్‌కు సమ స్యలు మొదలవుతాయని, హసీనాను అప్పగించాలని మహ్మద్ యూనుస్ మోదీ ప్రభుత్వంపై మరింత ఒత్తిడి తీసుకురావడం ద్వారా ఈ అంశం బంగ్లాదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో ప్రచారాంశంగా మారుతుందని పేర్కొన్నాయి. ఐతే హసీనాను అప్పగించాలని భారత్‌పై బంగ్లాదేశ్ ఒత్తిడి తెచ్చేఅవకాశం ఉండదని బిబిసి వ్యాఖ్యానించింది. కానీ హసీనాను తరలించాలని బంగ్లాదేశ్ హై కమిషన్ ఇప్పటికే పలుసార్లు భారత్‌ను కోరింది. కేంద్రం ఎలాం టి సమాధానం చెప్పలేదు.

రెండు దేశాల మధ్య ఇప్పటికే దౌత్య సంబంధాలు తీవ్ర ఒడిదొడుకులు ఎదుర్కొంటున్నాయి. భారత్ వ్యాపా రానికి నష్టం కలుగుతోందన్న కారణంగా మోదీ ప్రభు త్వం భారత మౌలిక సదుపాయాలను బంగ్లాదేశ్ వ్యాపారు లకు సమకూర్చడం మానేసింది. దీంతో ఆ దేశానికి ఎగు మతుల నష్టం వాటిల్లింది. మహ్మద్ యూనుస్ ప్రభుత్వా నికి చైనా,పాకిస్థాన్‌లతో క్రమంగా గాఢానుబంధం పెరు గుతోంది. పాకిస్థాన్,బంగ్లాదేశ్ మధ్య విమాన రాకపో కలు ప్రారంభమయ్యాయి. వాణిజ్యానికి తమ ఓడరేవు లను ఉపయోగించుకోవాలని పాకిస్థాన్ బంపర్ ఆఫర్ ఇచ్చింది.

**ఉగ్రవాదుల కుట్ర ప్రపంచానికి తెలిసింది : హసీనా**

భారత్‌లో అజ్ఞాతవాసంలో ఉన్న షేక్ హసీనా బంగ్లాదేశ్ ప్రత్యేక ట్రైబ్యునల్ ఇచ్చిన తీర్పుపై స్పందిం చారు. ఈ తీర్పు ప్రజాస్వామ్యబద్ధమైనది కాదని, రాజ్యాంగబద్ధంగా ఎన్నిక కాని ఒక తాత్కాలిక ప్రభుత్వం దురుద్దేశంతో ఈ ప్రత్యేక ట్రైబ్యునల్‌ను ఏర్పాటు చేసిందని, ఈ తాత్కాలిక ప్రభుత్వానికీ, ట్రైబ్యు నల్‌కు ప్రజాతీర్పు లేదని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒక న్యాయబద్ధమైన ధర్మాసనం ఎదుట, తనపై నిందలు వేసినవారిని ఎదుర్కొనేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, కానీ విచారణ న్యాయబద్ధంగా జరగాలన్నారు. ఈ ట్రైబ్యునల్ న్యాయబద్ధంగా విచారణ చేయలేదని, ఇది మోసపూరితమైన ట్రైబ్యునల్ అనీ విమర్శించారు.

ధర్మాసనం తీర్పును,ప్రాసిక్యూషన్ చేసిన ఈ ఆరో పణలను తాను సంపూర్ణంగా తిరస్కరిస్తున్నానని పేర్కొ న్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన తన ప్రభు త్వాన్ని తొలగించేందుకు తాత్కాలిక ప్రభుత్వంలో ఉన్న ఉగ్రవాద శక్తుల హత్యాపూర్వకమైన దుర్మార్గపు ఉద్దే శాలు ఈ తీర్పుతో బహిర్గతమయ్యాయని విమర్శిం చారు. బంగ్లాదేశ్‌లో ఒక ప్రధాన రాజకీయశక్తిగా ఉన్న అవామీ లీగ్‌ను నామరూపాలు లేకుండా చేసేందుకు, ఎన్నికైన ప్రధానమంత్రిని పదవి నుండి తొలగించేందుకు వారు చేసిన కుట్రలు ఈ తీర్పుతో ప్రపంచానికి తెలిసి వచ్చాయన్నా రు.

రాజకీయ దురుద్దేశంతోనే ప్రత్యేక కోర్టు ఇలాంటి తీర్పు ప్రకటించిందని హసీనా విమర్శించారు. ధర్మా సనం తీర్పు పక్షపాత ధోరణితో కూడుకున్నదని విమ ర్శించారు. ''ఇది మోసపూరితమైన ధర్మాసనం, మోసం చేయడంకోసం ఈ ట్రైబ్యునల్ ఏర్పాటుచేశారు, రాజ కీయ దురుద్దేశంతోనే ఈ తీర్పు ప్రకటించారు'' అని హసీనా తన ప్రకటనలో ఉరిశిక్ష తీర్పును తిరస్కరిం చారు. తాను అజ్ఞాతంలో ఉన్న సమయంలో తను చెప్ప కుండా, తాను కోర్టు సమక్షంలో లేకుండా పక్షపాత ధోర ణితో న్యాయ విచారణ జరిపారని తప్పుపట్టారు. ఈ పరి ణామాలను ముందుగానే ఊహించిన హసీనా గతవా రంలో పిటిఐ వార్తాసంస్థకు ఇచ్చిన ఆన్‌లైన్ ఇంట ర్వ్యూలో, ''దేశంలో అందరిభాగస్వామ్యంతో ప్రజాస్వా మ్యాన్ని పునరుద్ధరించి న్యాయబద్ధమైన పరిపాలనకు అవకాశం కల్పిస్తే తాను దేశానికి తిరిగి వస్తానని, కోర్టు ఎదుట కూడా హజరవుతానని ప్రకటించారు. అదేవి ధంగా బిబిసికి కూడా తీర్పుకు ముందుగా బిబిసికి ఇచ్చిన ఇంటర్వ్యూలో హసీనా మాట్లాడుతూ, తాను లేకుండా జరిగిన ఈ విచారణ ప్రక్రియను ''కంగారూ కోర్టు''గా అభివర్ణించారు.

ఉద్యమకారులు అదుపు చేయడానికి సాధ్యంకానిరీ తిలో వేలాదిమంది ప్రధానమంత్రి నివాసంమీదకు దూసుకురావడంతో ఎటూపాలుపోని స్థితిలో గత ఏడాది ఆగస్టు ఐదో తేదీన ప్రత్యేక వాహనంలో గగనమార్గం ద్వారా షేక్ హసీనా భారత్‌కు వచ్చి తలదాచుకున్నారు. దీంతో 15 సంవత్సరాలపాటు బంగ్లాదేశ్‌లో నిరాఘా టంగా కొనసాగిన ఆమె పరిపాలనకు తెరపడింది.



# జనరల్
STATE & REGIONAL NEWS

## ఇంటర్నేషనల్ పారా స్విమ్మర్ అజీమ్‌ను అభినందించిన మంత్రి



ప్రజాపక్షం/హైదరాబాద్: ఇంటర్నేషనల్ పారా స్విమ్మర్ మొహమ్మద్ అజీమ్‌ను క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఘనంగా సన్మానించారు. నగరంలోని గచ్చిబౌలిలో జరుగుతున్న 25వ పారా నేషనల్ స్విమ్మింగ్ ఛాంపియన్ షిప్‌లో కేరళ రాష్ట్రానికి చెందిన అజీమ్ 3 స్వర్ణ పతకాలు సాధించాడు. ఈ సందర్భంగా రాష్ట్ర సచివాలయంలో మర్యాదపూర్వకంగా మంత్రి వాకిటి శ్రీహరిని కలిశారు. గోల్డ్ మెడల్స్ సాధించినందుకు అజీమ్‌ను ఆప్యాయంగా హత్తుకొని మరీ అభినందించారు. పుట్టుకతోనే అంగవైకల్యంతో రెండు చేతులు లేకున్నా, ఒక కాలు చిన్నదిగా ఉన్నా కూడా స్విమ్మింగ్‌లో ప్రతిభ కనబరచి మూడు గోల్డ్ మెడల్స్ సాధించడం అంత ఆశామాషీ విషయం కాదన్నారు.

# ఎర్రజెండాలన్నీ ఏకమైతేనే ప్రజాస్వామ్య లౌకిక వ్యవస్థ పరిరక్షణ



సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

ప్రజాపక్షం/కరీంనగర్/చిగురుమామిడి : అబద్దాల పునాదులపై ఏర్పడ్డ బిజెపి ప్రభుత్వం దేశంలోని సంపదనంతా కార్పోరేట్ పెట్టుబడిదారి వర్గాలకు దోచిపెడుతోందని, బిజెపి దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య, రాజ్యాంగ, లౌకిక వ్యవస్థ పరిరక్షణ కోసం ఎర్రజెండాలన్నీ ఏకమై పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ వందేళ్ల ఉత్సవాల సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయడం కోసం ఈ నెల 15న జోడే ఘాట్‌లో ప్రారంభమైన ప్రచార జాత సోమవారం కరీంనగర్‌కు చేరుకుంది. జాతాకు నాయకత్వం వహిస్తున్న చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాస్‌రావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్‌లతో పాటు జాతాలో వస్తున్న రాష్ట్ర నాయకులకు సిపిఐ కరీంనగర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో పద్మనగర్‌లో పూలమాలలు వేసి ఎర్ర కండువాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన పార్టీ జెండాను చాడ వెంకటరెడ్డి ఎగురవేశారు. పద్మనగర్ నుంచి రాంనగర్, మంకమ్మతోట, గీతాభవన్ చౌరస్తా వరకు సిపిఐ శ్రేణులు ర్యాలీ నిర్వహించారు. గీతాభవన్ చౌరస్తా వద్ద చాడ వెంకటరెడ్డి మాట్లాడారు. కార్మికులు, కర్షకులు, ప్రజల పక్షాన నిలబడుతూ పెట్టుబడిదారీ విధానానికి వర్గ దోపిడీకి వ్యతిరేకంగా సమాజంలో అంతరాలు లేని సమసమాజ స్థాపన కోసం ఆవిర్భవించిన పార్టీ సిపిఐ అన్నారు. దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలు సింగరేణి, టెలికాం, రైల్వే విమానయాన సంస్థలతో పాటు అనేక సంస్థలను ప్రైవేట్‌పరం చేసి ఆదానీ, అంబానీలాంటి వారికి కట్టబెడుతూ దేశ సంపదనంతా నిర్వీర్యం చేస్తున్నాడని ఆరోపించారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్‌లు మాట్లాడుతూ ఖమ్మంలో డిసెంబర్ 26న భారీ బహిరంగసభ నిర్వహిస్తున్నామని, దేశం నలుమూలల నుంచి లక్షలాదిమంది తరలి రానున్నారని, ఆ బహిరంగసభను విజయవంతం చేయడం కోసం రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో రాష్ట్ర జాతాలు పర్యటిస్తున్నాయని తెలిపారు. జాతాలో తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహా, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, రాష్ట్ర నాయకులు రెహ్మాన్, కన్నం లక్ష్మినారాయణలు ఉన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, అందె స్వామి, జిల్లా కార్యవర్గ కౌన్సిల్ సభ్యులు కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, కొయ్యడ సృజన్ కుమార్, బోయిని అశోక్, పిట్టల సమ్మయ్య, పైడిపల్లి రాజు, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, న్యాలపట్ల రాజు, బీర్ల పద్మ, కొట్టె అంజలి, ఉమ్మెంతల రవీందర్‌రెడ్డి, కంది రవీందర్‌రెడ్డి, బండ రాజిరెడ్డి, మచ్చ రమేష్, బామండ్లపెల్లి యుగేందర్, పిట్టల శ్రీనివాస్, బూడిద సదాశివ, నాయకులు కాశెట్టి లక్ష్మణ్, అలిశెట్టి భారతి, కసిబోజుల సంతోష్‌చారి, చెంచల మురళి, గామినేని సత్యం, రాము, సత్యనారాయణ, మమత తదితరులున్నారు.

**ప్రజల సమస్యల పరిష్కారం కోసమే సిపిఐ పోరాటం**

చిగురుమామిడి మండల కేంద్రంలో బస్టాండ్ చౌరస్తా వద్ద మండల నాయకత్వం జాతకు స్వాగతం పలికింది. బస్టాండ్ చౌరస్తాలో ఉన్న డా.బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి చాడ వెంకటరెడ్డి పూల మాల వేసి నివాళులర్పించారు. అంతకు ముందు తిమ్మాపూర్ మండలం ఇంద్రనగర్ గ్రామంలో బస్సు జాత చేరుకోగా మండల కార్యదర్శి బోయిని తిరుపతి ఆధ్వర్యంలో జాతకు ఘన స్వాగతం తెలిపారు. కళాకారుల ఆటపాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి సిపిఐ వందేళ్ల పోరాట పటిమను ప్రజలకు తెలిసేలా సిపిఐ జాతీయ, రాష్ట్ర నాయకులు వివరించారు. జాతాలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి సురేందర్ రెడ్డి, ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నర్సింహా, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ ఉన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అందె స్వామి, మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిని అశోక్, గూడెం లక్ష్మి, జిల్లా కౌన్సిల్ సభ్యులు అందె చిన్నస్వామి, చాడ శ్రీధర్‌రెడ్డి, బోయిని సర్దార్ వల్లభాయ్ పటేల్, మావురపు రాజు, కాంతాల శ్రీనివాస్ రెడ్డి, తేరాల సత్యనారాయణ, మండల సహాయ కార్యదర్శులు బూడిద సదాశివ, పైడిపల్లి వెంకటేష్‌తో పాటు మండల నాయకులు పాల్గొన్నారు.

# భవిష్యత్తు వామపక్షాలదే

సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ



ప్రజాపక్షం/సదాశివపేట/సంగారెడ్డి: భవిష్యత్తు వామపక్షాలదే అని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ అన్నారు. ఈ దేశంలో పెట్టుబడిదారి అలాగే మత తత్వ వాదులు ఎన్ని కుట్రలు చేసినా భవిష్యతు వామపక్షాలు అని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ తెలిపారు. సోమవారం రోజున సిపిఐ శతాబ్ది ఉత్సవాలు రాష్ట్రజాత సదాశివపేటకు రావడం జరిగింది. జాతకు నాయకత్వం వహిస్తున్న పశ్యపద్మ మాట్లాడుతూ భారతదేశంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పుట్టి వంద సంవత్సరాలు అవుతున్న తరుణంలో పార్టీ యొక్క మన కీర్తిని రాష్ట్ర వ్యాప్తంగా తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం అనే నినాదంతో సీపీఐ పార్టీ అనేక పోరాటాలు చేసి లక్షలాది మంది నిరుపేదలకు సాగు భూములు ఇళ్ల స్థలాలు ఇప్పించిన చరిత్ర సిపిఐది అలాంటి పేదల పార్టీ ఈ దేశంలో వంద సంవత్సరాలు పూర్తి చేసుకోవడం నిజంగా పేదల విజయం అన్నారు. రాబోవు కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. సిపిఐ శతాబ్ది ఉత్సవాలు రాష్ట్ర జాత సంగారెడ్డి, పటాన్‌చెరులో సోమవారం కొనసాగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాల్, ఎం.రహ్మాన్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.తాజుద్దీన్, ఎండి.షఫీ, పాండు జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎం.గంగమ్మ, ముస్తపా, శంకరప్పా, సాదిక్ అలీ, వెంకట్ గౌడ్, పులమ్మా, చంద్రయ్య, యశ్వంత్, అనుసూజ, బుజ్జమ్మ, లక్ష్మి, బిపాపా దేవిలు పాల్గొన్నారు.

**భరత్‌నగర్‌లో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్న నాయకులు**

రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న బస్సు యాత్రతో జహీరాబాద్ పట్టణ జాతీయ రహదారిపై ప్రదర్శన, ర్యాలీని నాయకులు నిర్వహించారు. ఈ ర్యాలీలో ముఖ్యఅతిథులుగా స్థానిక ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ జహీరాబాద్ ఇంచార్జీ ఎ.చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు. జహీరాబాద్ పట్టణ పరిధిలో భారత కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న బస్సు యాత్ర జహీరాబాద్‌లోకి సిపిఐ సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ జలాలుద్దీన్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జహీరాబాద్ పట్టణ పటేల్ గార్డెన్ ఫంక్షన్ హాల్ నుండి జాతీయ రహదారిపై బైక్ ర్యాలీ నిర్వహిస్తూ భరత్‌నగర్ వరకు నిర్వహించారు. భరత్ నగర్ 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా డప్పుసప్పుల్లతో పాటలు నిర్వహించారు. అనంతరం భరత్ నగర్‌లో సుమారు 25 కేజీల కేక్ కట్ చేసి భరతనగర్ వాసులతో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ సంబరాలు చేసుకున్నారు. భరత్ నగర్‌లో నిర్వహించిన కార్యక్రమానికి సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ మాట్లాడుతూ సిపిఐ వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్నది అంటే ఈ సంవత్సరాలలో ఎంతో మంది నాయకులు కార్యకర్తలు త్యాగాలు చేసి ఆ రోజులలో బ్రిటిష్ పరిపాలనకు వ్యతిరేకంగా కొట్లాడింది. కూడా సిపిఐ ఎక్కడ సమస్య ఉంటే అక్కడ నిరంతరం పోరాటం చేసి ప్రజలకు ఎల్లప్పుడు అండగా నిలబడే భారత దేశంలో ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని కొనియాడారు. జహీరాబాద్ ప్రాంతంలో కూడా గతంలో టీఆర్ఎస్ హయాంలో నిమ్స్ పేరుతో పేద ప్రజల భూములు లాక్కొని వాళ్లను మోసం చేసింది. టీఆర్ఎస్ ఏ రోజు కూడా భూ బాధ్యతల పక్షాన నిలబడి భూ పోరాటం చేసిన చరిత్ర కూడా సిపిఐదే అన్నారు. ఇక ముందు కూడా ప్రజలకు ఎలాంటి సమస్యలు వచ్చినా ఎర్రజెండా సిపిఐ నిలబడతదని పేర్కొన్నారు. డిసెంబర్ 26న జరిగే ఖమ్మంలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటి నరసింహ, సిపిఐ జాతీయ కౌన్సిల్ సభ్యులు ,తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జహీరాబాద్ శాసనసభ్యులు కొనేంటి మాణిక్ రావు, మాజీ మంత్రి ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ జహిరాబాద్ నియోజకవర్గ ఇంచార్జీ ఎ.చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ యువత మండల అధ్యక్షులు పట్టణ మాజీ టీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు సయ్యద్ మ్యూజియం భరత్‌నగర్ వాసులు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



# ‘ఐబొమ్మ’ ప్లాట్‌ఫామ్‌తో బెట్టింగ్ యాప్స్ ప్రమోట్

రూ.కోట్లు కొల్లగొట్టిన నిర్వాహకుడు ఇమ్మడి రవి

పోలీసులకు చిక్కకుండా వేరే దేశ పౌరసత్వం

వివరాలు వెల్లడించిన హైదరాబాద్ సిపి వి.సి.సజ్జనార్

ప్రజాపక్షం/హైదరాబాద్: ఐబొమ్మ, బప్పం ఫ్లాట్‌ఫామ్‌ల ద్వారా పైరసీ సినిమాలను ప్రేక్షకులకు అందించడంతో పాటు ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేస్తూ రూ.కోట్లు కొల్లగొడుతున్న ఐబొమ్మ, బప్పం ఫ్లాట్ ఫామ్ నిర్వాహకుడు ఇమ్మడి రవిని కటకటాల్లోకి పంపామని హైదరాబాద్ సిపి. విసి. సజ్జనార్ తెలిపారు. బంజారాహిల్స్‌లోని ఐసిసిసిలో సోమవారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కొత్త సినిమాలను థియేటర్‌లోకి వచ్చిన కొద్దిగంటల్లోనే పైరసీ చేస్తూ టాలీవుడ్ ఫిల్మ్ ఇండస్ట్రీతో పాటు కొలివుడ్, మాలివుడ్ ఇండస్ట్రీలకు రూ.వేల కోట్ల నష్టం కలిగజేస్తున్న నిందితుడు ఇమ్మడి రవిని సైబర్ క్రైమ్ పోలీసులు చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. నిందితుడిపై ఐటీ యాక్ట్, కాపీ రైట్ యాక్ట్ కింద మరో 4 కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. పోలీసుల నుంచి తప్పించుకోవడానికి ఒక వెబ్‌సైట్‌ను బ్లాక్ చేస్తే మరో కొత్త వెబ్‌సైట్‌ను తయారు చేసేవాడని, ఇలా మొత్తం 65 మిర్రర్ వెబ్‌సైట్లను నిర్వహించినట్లు సిపి వెల్లడించారు. 1972లో విడుదలైన గాడ్‌ఫాదర్ నుంచి ఇటీవల వచ్చిన ఒజి వరకు మొత్తం 21 వేల సినిమాలు అతడి హార్డ్‌డిస్క్‌లో గుర్తించమన్నారు. పైరసీ, బెట్టింగ్ ప్రమోషన్స్ ద్వారా సుమారు రూ.20 కోట్ల వరకు సంపాదించాడని, అందులో రూ.3 కోట్లు సీజ్ చేశామన్నారు. నిందితుడి వద్ద 50 లక్షల మంది సబ్‌స్క్రైబర్ల డేటా ఉందని, దీన్ని సైబర్ నేరగాళ్లు వాడుకునే అవకాశం ఉందని హెచ్చరించారు.

**ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్‌తో అమాయకులకు వల..**

పైరసీ వెబ్‌సైట్ల ద్వారా లక్షలాది మంది వినియోగదారులను 1విన్, 1ఎక్స్‌బెట్ వంటి అక్రమ బెట్టింగ్ ప్లాట్‌ఫామ్‌లకు మళ్లించాడని, దీని కారణంగా ఎంతో మంది అమాయకులు జీవితాలను నాశనం చేసుకున్నారని సిపి సజ్జనార్ పేర్కొన్నారు. ఈ బెట్టింగ్‌కు వ్యసనపరులై కొందరు ఆత్మహత్యలు కూడా చేసుకున్నారని విచారణ వ్యక్తం చేశారు. పైరసీ కేసుతో పాటు బెట్టింగ్ యాప్‌ల కోణాన్ని మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నామని సిపి తెలిపారు. గేమింగ్, బెట్టింగ్ యాప్‌ల ప్రకటనల ద్వారా కోట్ల రూపాయల ఆదాయం సంపాదించి, ఆ డబ్బుతో ఆధునిక డొమెయిన్లు, హోస్టింగ్ వ్యవస్థలు ఏర్పాటు చేసుకున్నాడని, నెదర్లాండ్స్, స్విట్జర్లాండ్ వంటి దేశాలలో ఫిజికల్ సర్వర్లను ఏర్పాటు చేసుకున్నట్లు గుర్తించామన్నారు. ఈ ఏర్పాట్ల వల్ల అతడి పైరసీ నెట్‌వర్క్‌ను గుర్తించడం, బ్లాక్ చేయడం ‘లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీస్’కు చాలా కష్టమైన పనిగా మారిందన్నారు. భారత చట్టాల(శిక్షలు) నుంచి తప్పించుకోవడానికి ఆయన భారత పౌరసత్వాన్ని వదిలి సెయింట్ కిట్స్‌ఎల్ అండ్ నెవిస్ అనే దేశ పౌరసత్వం పొందాడని తెలిపారు. నెదర్లాండ్స్, స్విట్జర్లాండ్, అమెరికా, థాయ్‌లాండ్, ఫ్రాన్స్, దుబాయ్ వంటి దేశాలకు తరచూ ప్రయాణించి బెట్టింగ్ అప్లికేషన్ ఆపరేటర్లతో కలిసి పనిచేశాడని, ప్రపంచవ్యాప్తంగా భారీ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకున్నట్లు గుర్తించమన్నారు. ఈ కేసుల్లో కోట్లాది రుపాయాలు మనీలాండరింగ్ జరిగినట్లు దర్యాప్తులో గుర్తించామని, డబ్బును విదేశాలకు అక్రమంగా తరలించినట్లు రుజువులు లభించడంతో ఈ వ్యవహారంపై ఈడీకి కూడా సమాచారం ఇస్తామని సిపి తెలిపారు.



అదనపు సిపి ఎం.శ్రీనివాసులు, డిసిపి దారా కవిత మార్గదర్శకత్వంలో సైబర్ క్రైమ్ యూనిట్ అధికారులు క్లిష్టమైన పైరసీ సైబర్ నెట్‌వర్క్‌ను పూర్తిగా నిర్వీర్యం చేశారని తెలిపారు. తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ యాంటిపైరసీ సెల్, హైదరాబాద్ సిటీ పోలీస్ పైరసీని అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాయని, అధికారిక ఒటిటి ప్లాట్‌ఫాంలలో మాత్రమే సినిమాను వీక్షించాలని, అనుమానాస్పద వెబ్‌సైట్లు గుర్తిస్తే వెంటనే 1930 లేదా cybercrime.gov.in కు నివేదించాలని సిపి. విసి.సజ్జనార్ ప్రజలను కోరారు. పాత్రికేయుల సమావేశానికి హాజరైన హిరోలు చిరంజీవి, నాగార్జున, ప్రొడ్యూసర్లు దిల్‌రాజు, సురేష్‌బాబు, దర్శకుడు రాజమౌళి మాట్లాడుతూ పైరసీని ప్రోత్సహించకూడదని విజ్ఞప్తి చేశారు. ఒక సినిమా నిర్మించడానికి లైట్ బాయ్ నుంచి మొదలు కొని వేల మంది కష్టపడాల్సి ఉంటుందని, ఒక్క వ్యక్తి మోసానికి ఇంతమంది బాధపడాల్సి వస్తుందన్నారు. సినిమా పైరసీతో పాటు బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్స్‌తో అమాయకుల జీవితాలను బలి చేస్తున్నాడని మండిపడ్డారు. పైరసీ చేయడానికి వీలు లేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చట్టాలు తీసుకురావాలని కోరారు.

## లెవెల్ క్రాసింగ్ వద్ద భద్రత ముఖ్యం

దక్షిణ మధ్య రైల్వే జిఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ

ప్రజాపక్షం/హైదరాబాద్: రైలు కార్యకలాపాల భద్రత నిర్వహణలో లెవెల్ క్రాసింగ్ వద్ద అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ అన్నారు. అన్ని లెవెల్ క్రాసింగ్ గేట్ల వద్ద భద్రతా ప్రోటోకాల్లను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో సోమవారం ఆయన భద్రత ట్రాఫిక్ సౌకర్యాల పనులపై అధికారులతో వివరణాత్మక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షాసమావేశంలో దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ శ్రీ సత్య ప్రకాష్, వివిధ శాఖలకు చెందిన ప్రధానాధిపతులతోపాటు మొత్తం సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్లు, గుంటూరు నాందేండ్ డివిజనల్ రైల్వే మేనేజర్లు (డి.ఆర్.ఎంలు) వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.


గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, మూసాపేట సర్కిల్-23 | GHMC

NIT No.38/GHMC/MPT/EE/2025-26 తేది:17.11.2025

పని పేరు: నాలుగు (04) సివిల్ పనుల కోసం బిడ్లను ఆహ్వానిస్తున్నారు. ఈ బిడ్‌లను సమర్పించడానికి బిడ్ల స్వీకరణ తేది:19.11.2025 ఉదయం 10.30 గంటలకు ప్రారంభమవుతుంది. బిడ్ల ఆఖరి తేదీ: 26.11.2025 ఉదయం 10.30 గంటలుగా నిర్ణయించారు. టెండర్‌కు సంబంధించిన అధికారి పేరు & చిరునామా: శ్రీ ఇ.యు. రమేష్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, జిహెచ్ఎంసి, మూసాపేట్ సర్కిల్ - 23, మరియు ఆయన సెల్ నెంబర్ 9949994029. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.tender.telangana.gov.in లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, జిహెచ్ఎంసి, మూసాపేట్ సర్కిల్-23

DIPR R.O. No. : 10837-PP/CL/ADVT/1/2025-26, Date: 17-11-2025

తెలంగాణ ప్రభుత్వం దేవాదాయ శాఖ
శ్రీ యల్లమ్మ అమ్మవారి దేవస్థానము
దర్వేశిపురం గ్రామం, కనగల్లు మండలం, నల్గొండ జిల్లా.
టెండరు కం బహిరంగవేలము

టెండర్ నోటీస్ నెం. 33/SYT/2025 తేది: 15/11/2025

ఇందు మూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా! సదరు దేవస్థానమునకు సంబంధించిన టెండరు కం బహిరంగవేలము వేలము ది:25.11.2025 మంగళవారం రోజున మ॥ 1:00 గంటలకు దేవాలయ ప్రాంగణమందు దేవాదాయ శాఖ అధికారుల సమక్షములో నిర్వహించబడును. పూర్తి చేసిన టెండరు టెండరు షెడ్యూలు తేది: 25.11.2025 మ॥ 12:00 గంటల వరకు దేవస్థానమందు ఏర్పాటు చేసిన టెండరు బాక్స్ నందు వేయవలెను. అదే రోజు మ॥ 01:00 గంటలకు టెండరుదారులసమక్షములో బహిరంగ వేలము నిర్వహించబడును.

| క్ర.సం. | వేలము వివరములు | కాలపరిమితి 1 సం॥ము | డిపాజిట్ డబ్బు | సీల్డు టెండర్ షెడ్యూల్ ధర |
|---|---|---|---|---|
| 1 | లడ్డు పులిహోర అమ్ముకొను హక్కు | తేది: 01.01.2026 నుండి 31.12.2026 వరకు | రూ.2,00,000/- | రూ. 1000/- |
| 2 | గాజులు అమ్ముకొను హక్కు | తేది: 01.01.2026 నుండి 31.12.2026 వరకు | రూ. 1,00,000/- | రూ. 1000/- |
| 3 | దేవస్థాన యొక్క ఫంక్షన్ హాల్ కిరాయికి ఇచ్చుకొను హక్కు | తేది: 01.01.2026 నుండి 31.12.2026 వరకు | రూ.50,000/- | రూ.500/- |
| 4 | బొమ్మలు మరియు కిరాణ సామాగ్రి అమ్ముకొను హక్కు (షాప్ నెం. 2 పాత పూల షాపు) | తేది: 01.01.2026 నుండి 31.12.2026 వరకు | రూ.50,000/- | రూ.500/- |
| 5 | దేవస్థానము వద్ద ఫొటోలు తీయుటకు | తేది: 01.01.2026 నుండి 31.12.2026 వరకు | రూ.20,000/- | రూ.500/- |

1. టెండర్ – కం– బహిరంగ వేలము పాటలో పాల్గొనువారు ముందుగా నిర్దేశించిన టెండర్ షెడ్యూల్ డిపాజిట్ చెల్లించి వేలము పాటలో పాల్గొనవలెను.
2. డిపాజిట్ డి.డి.లు మాత్రమే స్వీకరించబడును. డి.డి.లు Executive Officer Sri Yellamma Ammavari Devasthanam - Darveshpuram Village పేరుమీద తీయవలెను.

సదా శ్రీ అమ్మవారి సేవలో...

చీదేటి వెంకట్రెడ్డి, ఛైర్మన్ మరియు ధర్మకర్తల మండలి సెల్: 9441562155

సం/- అంబటి నాగిరెడ్డి, కార్యనిర్వహణాధికారి సెల్:9959198949

వివరాలకు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు 9000010884, 9949609848, 9441823191.

DIPR R.O. No. : 10788-PP/CL/ADVT/1/2025-26 Date: 17-11-2025

కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయం, వరంగల్

Roc. No. C2/654/2022 డ్రాఫ్ట్ నోటిఫికేషన్ తేది: 03.11.2025

కుడా(KUDA) మాస్టర్ ప్లాన్- 2041కి సంబంధించిన ఈ క్రింది డ్రాఫ్ట్ నోటిఫికేషన్, G.O.Ms.No.202, MA & UD (Plg.II) డిపార్ట్‌మెంట్, తేది.17.11.2024 నాడు జారీచేయబడిన దాని ద్వారా మరియు తెలంగాణ గెజిట్ No.329, తేది.18.11.2024 నాడు ప్రచురించబడిన దాని ద్వారా నోటిఫై చేయబడింది. దీనిలో సెక్షన్ (9) తెలంగాణ అర్బన్ ఏరియాస్ (డెవలప్‌మెంట్) యాక్ట్, 1975 ద్వారా ఇవ్వబడిన అధికారాలను ఉపయోగించి మార్పులు చేయాలని ప్రతిపాదించబడింది. సెక్షన్ 12(3) ప్రకారం ఇందుమూలంగా ప్రచురించబడింది.

ఈ డ్రాఫ్ట్‌ను ప్రచురించిన తేదీ నుండి నాలుగు వారాల కాలం ముగిసిన తర్వాత ముసాయిదాను పరిగణనలోకి తీసుకోబడుతుందని, మరియు ఈ పేర్కొన్న గడువు ముగియడానికి ముందు దీనికి సంబంధించి ఎవరైనా వ్యక్తుల నుండి అయినా ఏవైనా అభ్యంతరాలు లేదా సూచనలు అందితే వాటిని తెలంగాణ ప్రభుత్వం పరిశీలిస్తుందని, అభ్యంతరాలు, సూచనలను ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ, పురపాలక పరిపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖ, తెలంగాణ సెక్రటేరియట్, హైదరాబాద్ వారికి సమర్పించాలని దీని ద్వారా నోటీసు ఇవ్వబడింది.

డ్రాఫ్ట్ వేరియేషన్

“ABCDEFOHA” ద్వారా సరిహద్దులు కలిగి ఉన్న స్థలం, సర్వే నం. 468, 471 & 472 మరియు ఇంటి నం. 66-6-9(కొత్త) 6-08(పాత) & 66-6-10 (కొత్త) 6-09(పాత) స్తంభంపల్లి గ్రామం, ఖిలా వరంగల్ మండలం, వరంగల్ జిల్లాలో 16,797.34 చ.మీ. విస్తీర్ణంలో ఉంది. దీని సరిహద్దులు క్రింద షెడ్యూల్‌లో ఇవ్వబడ్డాయి. ఈ స్థలం ప్రస్తుతం కుడా(KUDA) మాస్టర్ ప్లాన్-2041లో పారిశ్రామిక ఉపయోగం కోసం కేటాయించబడింది. ఈ ప్లాన్ G.O.Ms.No.202, MA & UD (Plg.II) డిపార్ట్‌మెంట్, తేది.17.11.2024 ద్వారా నోటిఫై చేయబడింది మరియు తెలంగాణ గెజిట్ No.329, తేది.18.11.2024 నాడు ప్రచురించబడింది. ఇప్పుడు సవరించిన మాస్టర్ ప్లాన్.10/2024లో చూపిన విధంగా మిశ్రమ వినియోగ జోన్ (Mixed Use Zone)గా మార్చబడింది. ఈ ప్లాన్ కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, వరంగల్ కార్యాలయంలో అందుబాటులో ఉంది.

స్థలం యొక్క సరిహద్దులు


ఉత్తరం: హోల్‌సేల్ కమర్షియల్ కాంప్లెక్
దక్షిణం: ప్రస్తుత నర్సంపేట 100 అడుగుల రోడ్డు (మాస్టర్ ప్లాన్-2041 ప్రకారం 150 అడుగులకు విస్తరించాల్సి వుంటుంది).
తూర్పు: విజయబాబు భూమి
పడమర: హోల్‌సేల్ కమర్షియల్ కాంప్లెక్

సం/- వైస్ ఛైర్మన్

DIPR R.O. No. :10818-PP/CL/ADVT/1/2025-26 Date: 17-11-2025


## ఎసిబికి చిక్కిన డిప్యూటీ తహసీల్దార్

లంచం తీసుకున్న వారితో పాటు ఇచ్చిన వారినీ అదుపులోకి తీసుకున్న అధికారులు



ప్రజాపక్షం/ఖమ్మం/ఇల్లందు : లంచం తీసుకోవడం అధికారులకు పట్టుబడటం ఆయనకు అలవాటైపోయింది. రేషన్ దుకాణాల పేరుతో అందిన మేరకు దోచుకుంటున్న ఓ అవినీతి తిమింగలం మరోసారి అవినీతి నిరోధక శాఖాధికారులకు పట్టుబడింది. గతంలో పట్టుబడిన కేసు విచారణ జరుగుతుండగానే మరోసారి సారూ అవినీతి అధికారులకు చిక్కారు. వివరాల్లోకి వెళితే... ఇల్లందులో పౌర సరఫరాల శాఖలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న మహ్మది యాకూబ్ పాషాతో పాటు అతని వద్ద పని చేస్తున్న మరో ఉద్యోగి విజయ్ వీరికి లంచం ఇవ్వడానికి వచ్చిన రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షున్ని అవినీతి నిరోధక శాఖాధికారులు అదుపులోకి తీసుకున్నారు. వారం రోజుల క్రితం టేకితం మండలంలోని ఒక రేషన్ షాపును యాకూబ్ పాషా తనిఖీ చేశారు. ఉండాల్సిన దాని కంటే స్టాకు తక్కువగా ఉందని కేసు నమోదు చేశారు. ఈ విషయమై మహిళా డీలర్ ఎంత ప్రాధేయపడ్డ పాషా పట్టించుకోలేదు. చివరకు ఇల్లందు మండల రేషన్ డీలర్ల అసోసియేషన్ అధ్యక్షులు శబరీష్ ద్వారా యాకూబ్ పాషాను సంప్రదించగా రూ.30వేలు ఇస్తే ఎటువంటి కేసు లేకుండా తిరిగి రేషన్ దుకాణాన్ని నిర్వహించుకోవచ్చునని చెప్పడంతో శబరీష్ ద్వారా రూ.30వేలను రేషన్ డీలర్ పంపించారు. శబరీష్ స్థానిక జగదాంబ సెంటర్‌లో టెక్నికల్ అసిస్టెంట్ విజయ్‌కు నగదు అందిస్తుండగా ఏసిబి అధికారులు దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో పౌర సరఫరాల అధికారి యాకూబ్ పాషా, టెక్నికల్ అసిస్టెంట్ విజయ్‌తో పాటు లంచం ఇచ్చేందుకు వచ్చిన శబరీష్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు. యాకూబ్ పాషా గతంలో కొణిజర్లలో పని చేస్తున్నప్పుడు ఓ ఆర్ఎంపి వద్ద లంచం తీసుకుంటూ ఎసిబికి అధికారులకు చిక్కారు. ఇప్పటికి ఆ కేసు విచారణలోనే ఉంది. మరోసారి యాకూబ్ పాషా అధికారులకు పట్టుబడటం గమనార్హం. ఈ సందర్భంగా ఎసిబి డిఎస్‌పి రమేష్ మాట్లాడుతూ లంచం ఇచ్చినా తీసుకున్న నేరమేనన్నారు. ఎవరైనా లంచం అడిగితే వెంటనే తమను సంప్రదించాలని రమేష్ తెలిపారు. పేర్లు గోప్యంగా ఉంచుతామని ఆయన తెలిపారు.

## 25 శాతం పంటలకు ఇన్ని నిబంధనలా?

రైతులు ఇబ్బందుల్లో ఉన్నారు

నిబంధనలు.. పరిమితులు సడలించండి

కేంద్రాన్ని కోరిన వ్యవసాయ శాఖ మంత్రి

ప్రజాపక్షం/హైదరాబాద్: పత్తి రైతుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా జిన్నింగ్ మిల్లర్లతో మాట్లాడి, వారి సమస్యలు పరిష్కారమయ్యే దిశగా సిసిఐ అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. రైతుల సమస్యలను దృష్టిలో పెట్టుకుని, పత్తి కొనుగోళ్ళలో ఆటంకం ఏర్పడకుండా, వెంటనే కొనుగోళ్లను ఆరంభించాలని జిన్నింగ్ మిల్లుల అసోషియేషన్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డిని కోరారు. సిసిఐ అధికారులతో మరోసారి మంగళవారం సమావేశమై జిన్నింగ్ మిల్లుల సమస్యలను ప్రస్తావిస్తామని, సిఎం సూచనలతో సానుకూల నిర్ణయం వచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని సహాయ, సహకారాలు అందిస్తామని హామీనిచ్చారు. పత్తి కొనుగోళ్లపై, జిన్నింగ్ మిల్లుల సమస్యలపై కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కేంద్ర జౌళిశాఖ కార్యదర్శి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశంలో నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిన్నింగ్ మిల్లుల అసోషియేషన్ అధ్యక్షులు రవీందర్ రెడ్డి పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో నెలకొన్న పత్తి కొనుగోళ్లు, జిన్నింగ్ మిల్లుల సమస్యలను హైదరాబాద్‌లోని సచివాలయం ద్వారా మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు వివరించారు. అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ తేమ శాతం,ఎకరానికి విధించిన కొనుగోలు పరిమితులపై మరోసారి సమీక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

రైతులు రేయింబవలు కష్టపడి సాగు చేసిన పంటలు, వాతావరణ మార్పులు, అకాల వర్షాలు, తుఫాను లాంటి ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోతున్నప్పటికి, ప్రభుత్వాలపైన నమ్మకంతో రైతులు తాము పడించిన పంటను కొనుగోలు కేంద్రాలకుతీసుకొస్తే, అక్కడికి వచ్చాక కేంద్రం పెట్టిన నిబంధనలతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతకుముందు పెసర్లు, కందులు, పొద్దుతిరుగుడ వంటి పంటలపై 25 శాతం కొనుగోలుకు మాత్రమే పరిమితి విధించి, రైతుల పంటలో కేవలం 25 శాతం మాత్రమే కనీస మద్ధతు ధరకు అమ్ముకుని, మిగతా పంటను తక్కువ ధరకు అమ్ముకోవల్సిన పరిస్థితిని తీసుకొచ్చారని వివరించారు. 25 శాతం పరిమితిని ఎత్తివేయాలని రాష్ట్ర ప్రభుత్వం తరపున అనేక సార్లు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని తుమ్మల గుర్తు చేశారు. రైతులు ఆర్థికంగా నష్టపోకుడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వమే మద్ధతు ధరను చెల్లించి, గత రెండు సంవత్సరాల నుండి మిగిలిన పంటలను కొనుగోలు చేస్తుందన్నారు.

**25 శాతం పంటలకు ఇన్ని నిబంధనలా..**

అకాల వర్షాల కారణంగా సోయాబీన్ రంగు మారిందనే నెపంతో కొనుగోళ్లు జరపకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఈ విషయంలో నాఫెడ్, కేంద్రం నుండి ఎటువంటి స్పందన లేకపోవడం శోచనీయమని, 25 శాతం పంటలకు ఇన్ని నిబంధనలా అని మంత్రి తుమ్మల కేంద్రాన్ని ప్రశ్నించారు. రైతులు ఇప్పటికే చాలా రకాలుగా నష్టపోయారని, వారి పంటను సమయానికి కొనుగోలు చేసి, వారికి ఆర్థికదన్నుగా నిలబడాల్సిన అవసరం ఎంతైనా ఉందని మంత్రి తుమ్మల కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## రాష్ట్రంలో మరింత పెరగనున్న చలి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర వ్యాప్తంగా చలితీవ్రత పెరిగింది. చలితీవ్రత పెరగడంతో జనం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రాగల రెండు రోజులు రాష్ట్రంలో అక్కడక్కడ కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే నాలుగు నుంచి ఐదు డిగ్రీల వరకు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. సోమవారం ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ చలిగాలులు వీస్తాయని హెచ్చరించారు. మంగళవారం ఆసిఫాబాద్, ఆదిలాబాద్, నిర్మల్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో శీతలగాలులు వీచే అవకాశం ఉందన్నారు. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేశామన్నారు. ఆ తర్వాత రాష్ట్రంలో పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. గడిచిన 24 గంటల్లో పలుచోట్ల ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోయాయి. ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్‌లో అత్యల్పంగా 7.4 డిగ్రీ సెల్సియస్ కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. రాగల రెండు రోజులు చలి తీవ్రత మరింత పెరుగుతుందని వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు.

## మా పైసలు మాకివ్వండి : పెన్షనర్స్ జెఎసి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పదవి విరమణ పొందిన తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్లకు రావాల్సిన బెనిఫిట్స్‌ను వెంటనే విడుదల చేయాలనిపెన్షనర్ల జెఎసి డిమాండ్ చేసింది. ఏప్రిల్ 2024 నుంచి రిటైరైన వారికి రావాల్సిన బెనిఫిట్స్ రాక ఇప్పటివరకు వివిధ కారణాలతో 26 మంది మరణించారని, సుమారు 20 మంది అనారోగ్య సమస్యలతో ఆసుపత్రుల్లో చేరి ఫీజులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జెఎసి చైర్మన్ కె.లక్ష్మయ్య అధ్యక్షతన సోమవారం ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పెన్షనర్ ఫెడరేషన్ మాజీ సెక్రటరీ జి.పూర్ణచంద్రరావు ధర్నా శిబిరాన్ని ప్రారంభించి, ప్రస్తుత రాష్ట్ర, జాతీయ పెన్షనర్ల సమస్యలు ఎకరువు పెట్టి పెన్షనరీ బెనిఫిట్స్ ఆపి ఇబ్బందులపాలు చేయడం సరియైన పద్ధతి కాదని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమకు రావాల్సిన బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాకు ఎమ్మెల్సీ ప్రొ. కోదండరాం, మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డితో పాటు 33 జిల్లాల నుంచి పెన్షనర్స్ సంఘాల ప్రతినిధులు, పెన్షనర్స్ భారీగా హాజరయ్యారు.

## 'ల్యాబ్ టెక్నీషియన్ల' జాబితా విడుదల

మరో 7వేల పోస్టుల భర్తీ ప్రక్రియ : మంత్రి దామోదర



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ల్యాబ్ టెక్నీషియన్ (గ్రేడ్2) పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సోమవారం విడుదల చేశారు. ప్రభుత్వ హాస్పిటల్స్‌లలో మౌలిక వసతుల కల్పనకు అన్ని చర్యలూ తీసుకుంటున్నామని, తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 9 వేలకుపైగా పోస్టులను భర్తీ చేశామని, మరో 7 వేలకుపైగా పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతున్నదని వెల్లడించారు. మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూటమెంట్ బోర్డు ఎంపికైన జాబితాను హైదరాబాద్‌లోని సచివాలయంలో వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టియాన జెడ్ చొంగ్తూ తదితర అధికారులతో కలిసి మంత్రి దామోదర్ రాజనర్సింహా జాబితాను విడుదల చేశారు. అనంతరం, ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల వివరాలు, వారు సాధించిన మార్కుల వివరాలను బోర్డు వెబ్‌సైట్‌లో అధికారులు అప్‌లోడ్ చేశారు. ప్రభుత్వ హాస్పిటల్స్‌లోని 1284 ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల భర్తీకి గతేడాది చివరిలో మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్‌ను జారీ చేయగా, 24,045 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 23,323 మంది బోర్డు పరీక్షకు (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డాక్టర్లు, నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్ట్ వంటి ముఖ్యమైన పోస్టులతో పాటు, వైద్య సేవలు మెరుగుపర్చేందుకు అవసరమైన అన్నిరకాల పోస్టులనూ భర్తీ చేస్తున్నామన్నారు. డాక్టర్లు, సిబ్బంది రాకతో ప్రభుత్వ హాస్పిటళ్లకు వచ్చే పేషెంట్లకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని, వీలైనంత త్వరలో మిగిలిన పోస్టుల భర్తీ ప్రక్రియను కూడా పూర్తి చేస్తామని వెల్లడించారు.

## నేడు విజ్ఞాన్ భవన్‌లో '6వ జాతీయ జల అవార్డు'

రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకోనున్న సృజన

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్ర జలశక్తి శాఖ 2024 సంవత్సరానికిగాను ప్రకటించిన '6వ జాతీయ జల అవార్డులు' తెలంగాణ రాష్ట్రం మరో కీలక ఘనత సాధించింది. 'జల్ సంచయ్ జన్ భాగీదారీ' (జన భాగస్వామ్యంతో జల సంరక్షణ) విభాగంలో దేశ వ్యాప్తంగా మొదటి స్థానాన్ని తెలంగాణ దక్కించుకుని ఉత్తమ రాష్ట్రంగా ఎంపికైంది. ఈ కార్యక్రమం కింద రాష్ట్రంలో 5,20,362 పనులు పూర్తి చేయడం ద్వారా తెలంగాణకు ప్రథమ స్థానం లభించింది. ఛత్తీస్‌ఘడ్, రాజస్థాన్ వరుసగా రెండు, మూడో స్థానాలు సాధించాయి. ఈ అవార్డును న్యూఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా మంగళవారం ప్రదానం చేయనున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర స్థాయి అవార్డును పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ డాక్టర్ జి. సృజన స్వీకరించనున్నారు. అలాగే ఉత్తమ ర్యాంకులు సాధించిన జిల్లాల తరఫున జిల్లా కలెక్టర్లు, డిఆర్‌డిఒలు కూడా రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డులు అందుకోనున్నారు. ఈ ఏడాదిలో కేంద్రం మొత్తంగా రాష్ట్రాలు, జిల్లాలు, మున్సిపల్ సంస్థలు, ఎన్‌జిఒలు, అధికారులకు 100 అవార్డులను ప్రకటించింది. ఇందులో తెలంగాణ రాష్ట్రం సాధించిన ప్రథమ ర్యాంక్ రాష్ట్రం జల సంరక్షణలో సాధించిన విశిష్ట ప్రగతికి నిదర్శనంగా నిలిచింది. మరీ ముఖ్యంగా మంత్రి సీతక్క పర్యవేక్షణలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి జల సంరక్షణకు అధిక ప్రధాన్యతనిస్తోంది. వర్షం నీటిని ఒడిసి పట్టే చర్యలను చేపడుతోంది. దీంతో లక్షల సంఖ్యలో జల సంరక్షణ పనులు పూర్తయి భూ గర్భజలాల్లో పెరుగుదల కనిపిస్తోందని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

# కన్నీరు పెట్టిన హైదరాబాద్

సౌదీ అరేబియాలో ఘోర బస్సు ప్రమాదం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సౌదీ అరేబియాలో సోమవారం తెల్లవారుజామున జరిగిన ఘోర బస్సు ప్రమాదం హైదరాబాద్ నగరాన్ని ఒకేసారి ఉలిక్కిపడేలా చేసింది. పవిత్ర ఉమ్రా యాత్రకు వెళ్లిన హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు యాత్రికులు అక్కడ జరిగిన భయానక దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయారని సమాచారం అందిన క్షణం నుంచే నగరం అంతా విషాదంలో మునిగిపోయింది. ప్రమాదంలో మృతిచెందిన వారు కేవలం గణాంకాల్లో కనిపించే సంఖ్యలు మాత్రమే కాదు, వారు ఇక్కడ ప్రతి ఇంట్లో, ప్రతి వీధిలో, ప్రతి మనసులో ముద్ర వేసిన మన మనుషులే. ఎవరో ఒకరి తండ్రి, ఎవరో ఒకరి తల్లి, ఎవరో ఒకరి అక్క, అన్న, తమ్ముడు కుటుంబాలన్నీ ఒక్కసారిగా శూన్యమైపోయినట్టుగా మారిపోయింది.

### కుటుంబాలపై కమ్మిన పెను దుఃఖం..

హైదరాబాద్‌లోని అనేక ప్రాంతాల్లో ఈ ప్రమాదం వార్త గాలి వేగంతో పాకింది. ఇంటింటా ఫోన్‌లు మోగాయి, సోషల్ మీడియాలో ఆందోళన, సందేహం, కన్నీళ్లు కలిసి ప్రవాహంలా మారాయి. ఎవరి తల్లి జీవించి ఉందో? ఎవరి అన్న గాయపడ్డాడో? చివరిసారి మాట్లాడినప్పుడు ఏమన్నారో?— ప్రతి కుటుంబం ఒకే ప్రశ్నలతో తపించిపోయింది. ఎంబసీ హెల్ప్‌లైన్‌లు, ట్రావెల్ ఏజెన్సీల ఆఫీసులు, ప్రభుత్వ కంట్రోల్ రూంలు— అన్ని చోట్లా ప్రజల రద్దీ పెరిగింది. ఆశ, ఆందోళన, అనిశ్చితి కలిసిన మిశ్రమ భావాలు నగరాన్ని కుదిపేశాయి.

### ఒకే క్షణంలో ముగిసిన ఎన్నో కలలు..

ఉమ్రా యాత్ర— పవిత్రమైనదిగా భావించే ఈ ప్రయాణం అనేక కుటుంబాల కల. పుణ్యం కోసం, శాంతి కోసం, ప్రార్థన కోసం బయల్దేరిన ఆ పాదయాత్రికులు ఇలా చివరి ప్రయాణానికి బయల్దేరిపోతారని ఎవరూ ఊహించలేదు. ఒకే కుటుంబంలో పలువురు ప్రాణాలు కోల్పోయిన ఘోరం వార్త మరింత కఠినంగా తాకింది. మూడు తరాలు కలసి ప్రయాణించిన కుటుంబమే ఇప్పుడు చీలిపోయిన హృదయాల మిగులులా మారిపోయింది. ఇంత పెద్ద విషాదం మాటల్లో చెప్పలేనిది, కన్నీళ్లతో కూడా కొలవలేనిది.

### నగరం అంతా ఒకటైంది – మానవత్వం నిలిచిన రోజు

ఈ వార్త బయటకు వచ్చిన కొద్ది సేపటికే, నగరం అంతా ఒకటిగా మారిపోయింది. ఎవరి ఇంటి నుంచి ఏ వార్త వచ్చినా, పొరుగు వారు, బంధువులు, స్నేహితులు పరుగెత్తుకుంటూ వచ్చి తోడు నిలిచారు. అంబులెన్స్‌లా పరుగులు తీసిన మనసులు, పరస్పరం ధైర్యం చెప్పడానికి వచ్చిన చేతులు, బాధలో చిక్కుకున్న కుటుంబాలను ఆదరించడానికి ఏర్పడ్డ నిధి సేకరణలు— ప్రతి చోటా మానవత్వమే కనిపించింది. ప్రభుత్వం వెంటనే స్పందించి హెల్ప్‌లైన్‌లు ప్రారంభించగా, వలస భారతీయుల సంఘాలు కూడా అక్కడే ఆసుపత్రులు, మృతదేహాల గుర్తింపు, రవాణా వంటి విషయాల్లో సహాయానికి ముందుకొచ్చాయి.

### ఈ దుఃఖం మనందరిదే..

మృతులు హైదరాబాద్‌కు చెందినవారు కాబట్టి కాదు.. మనుషులైనందుకు ఈ విషాదం మనందరిదీ. ప్రతి మృతుడు ఒక కుటుంబానికే కాకుండా మొత్తం నగరానికే నష్టం. హైదరాబాద్ ఈరోజు ఉలిక్కిపడింది. కన్నీరు పెట్టింది.. కానీ అది మనిషితనం, పరస్పరం ఆపన్నహస్తం అందించడం మరచిపోలేదు. ఈ ప్రమాదం కేవలం ఒక ఘటన కాదు.ప్రతి మనసులో ఒక శూన్యం, ప్రతి ఇంట్లో ఒక మౌనం, ప్రతి గుండెల్లో ఒక దెబ్బ. సౌదీ అరేబియా లో ఆ బస్సు అగ్నికి ఆహుతైన వారు హైదరాబాద్‌లో వేలాది హృదయాల్లో శాశ్వతంగా వెలిగే జ్ఞాపకాలై నిలిచిపోయారు.

## సౌదీ బాధిత కుటుంబాలకు మహేశ్ కుమార్ ఓదార్పు

ఒకే కుటుంబానికి చెందిన 18 మంది దుర్మరణం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సౌదీ అరేబియాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 45 మంది మృతుల వివరాలు అందుతున్నాయి. చనిపోయిన వారిలో విద్యానగర్ నల్లకుంటకు చెందిన రైల్వే రిటైర్డ్ ఉద్యోగి నసీరుద్దీన్(65) కుటుంబంలోని 18 మంది దుర్మరణం పాలయ్యారు. వీరిలో నసీరుద్దీన్, ఆయన భార్య ముగ్గురు కుమార్తెలు, కుమారులు, కోడళ్లు వారి పిల్లలు అంతా కలిపి 18 మంది మృత్యువాత పడ్డారు. వీరిలో 10మంది పిల్లలు ఉన్నారు. విద్యానగర్‌లోని నసీరుద్దీన్ ఇంటికి టిపిసిసి చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్ వెళ్లి వారి బంధువులను ఓదార్చారు. ఒకే కుటుంబంలో 18 మంది మృతి చెందడం పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎంఐఎం ఎంఎల్‌సి రహ్మత్ బేగ్ నసీరుద్దీన్ కూడా మృతుల బంధువులను పరామర్శించారు.

### సౌదీకి మంత్రి అజారుద్దీన్ బృందం..

మంత్రి అజారుద్దీన్ సారథ్యంలో ప్రభుత్వ ప్రతినిధి బృందం సౌదీ వెళ్లనుంది. ఈ బృందంలో ఎంఐఎం ఎంఎల్‌ఎ, మైనారిటీ విభాగానికి చెందిన అధికారి ఉండనున్నారు. మృతదేహాలకు సౌదీలోనే అంత్యక్రియలు చేయించాలని నిర్ణయం తీసుకున్నారు. కుటుంబానికి ఇద్దరిని చొప్పున తీసుకెళ్లేందుకు ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అటు బీఆర్‌ఎస్ తరఫున ఆ పార్టీ నేతల బృందం కూడా సౌదీ వెళ్లాలని నిర్ణయించింది. ఇప్పటికే ఎంఐఎం ఎంపి అసదుద్దీన్ ఒవైసి రియాద్‌లో భారత ఎంబసీతో మాట్లాడినట్లు ఆయన తెలిపారు. ప్రమాద ఘటనపై మరిన్ని వివరాలు సేకరించాలని వారిని కోరినట్లు చెప్పారు. హైదరాబాద్‌కు చెందిన రెండు ట్రావెల్ ఏజెన్సీలతోనూ కాంటాక్ట్ అయినట్లు తెలిపారు.

## మక్కా ప్రమాదంపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దిగ్భ్రాంతి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సౌదీ అరేబియాలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంపై కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మక్కా నుంచి మదీనాకు వెళ్తున్న 46 మందిలో 45 మంది సజీవదహనం అయ్యారని, అందులో ఎక్కువ మంది హైదరాబాద్ నగరంలోని సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధికి చెందినవారని ఆయన తెలిపారు. ఢిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కిషన్ రెడ్డి మాట్లాడుతూ ప్రమాదం జరిగిన వెంటనే సౌదీలోని భారత రాయబారి సుహేల్ అజాజ్ ఖాన్‌తో మాట్లాడినట్లు చెప్పారు. రియాద్ ఎంబసీ, జెడ్డా కాన్సులేట్ అధికారులు పూర్తి స్థాయిలో ఘటనను పర్యవేక్షిస్తున్నారన్నారు. విదేశాంగ శాఖమంత్రి ఎస్. జైశంకర్ ఎప్పటికప్పుడు పరిస్థితిని పరిశీలిస్తున్నారని, ఆయన ఆదేశాల మేరకు కేంద్రం ఓ ఉన్నత స్థాయి బృందాన్ని అక్కడికి పంపుతున్నట్లు తెలిపారు. పోస్టుమార్టం ప్రక్రియ పూర్తవుతోందని, ఈ రాత్రికే మరణ ధృవపత్రాలు జారీ అయ్యే అవకాశముందన్నారు. మృతదేహాలు గుర్తించే ప్రక్రియ వేగంగా సాగుతోందన్నారు. బాధితుల కుటుంబాలతో మాట్లాడగా, అంత్యక్రియలను సౌదీలోనే నిర్వహించాలని కోరుతున్నారని వెల్లడించారు. బాధిత కుటుంబాలకు అవసరమైన అన్ని సహాయాలు అందించాలని ప్రధాని మోదీ ఆదేశించినట్లు తెలిపారు.



### దేశవ్యాప్తంగా ఉన్న పాలసీ ప్రకారమే పత్తి కొనుగోలు..

పత్తికొనుగోలు విషయంలో తెలంగాణలో అవగాహన లోపం వల్ల సమస్యలు తలెత్తాయని కిషన్ రెడ్డి అన్నారు. జిన్నింగ్ మిల్స్ సమ్మె నేపథ్యంలో ఆదివారం రాత్రి తెలంగాణ వ్యవసాయశాఖ మంత్రి రాజ్ భవన్‌లో తనను కలిసినట్లు తెలిపారు. సోమవారం టెక్స్‌టైల్ సెక్రటరీ, జాయింట్ సెక్రటరీలతో పాటు, తుమ్మల నాగేశ్వరరావు, జిన్నింగ్ మిల్స్ అసోసియేషన్‌తో ఆన్‌లైన్‌లో చర్చలు జరిపామన్నారు. రాష్ట్రంలో 200కుపైగా కొనుగోలు కేంద్రాలు పనిచేస్తున్నాయని, దేశవ్యాప్తంగా ఉన్న పాలసీ ప్రకారమే కొనుగోలు జరుగుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తే మరిన్ని జిన్నింగ్ మిల్స్ ఆమోదిస్తామన్నారు. మంగళవారం సిపిఐ చైర్మన్ సహా ఉన్నతాధికారులు తెలంగాణకు వెళ్లి సమస్యలను పరిష్కరిస్తారన్నారు. రైతులు మధ్య దళారులకు అమ్మకుండా, మార్చి వరకు కేంద్రం కొనుగోలు చేస్తుందని హామీ ఇచ్చారు. మోదీ ప్రభుత్వంలో ఇప్పటివరకు రూ.85 వేల కోట్ల విలువైన పత్తి తెలంగాణలో కొనుగోలు చేసిందన్నారు. తుమ్మల నాగేశ్వర్ రావు చర్చల తరువాత మిల్లర్లు సమ్మె విరమించేందుకు అంగీకరించినట్లు తెలిపారు.

### చట్టం ప్రకారం స్పీకర్ నిర్ణయం తీసుకోవాలి

సుప్రీంకోర్టు తెలంగాణలో ఎమ్మెల్యేల ఫిరాయింపులపై చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర ప్రజాస్వామ్యానికి అవమానకరమని కిషన్ రెడ్డి అన్నారు. ఏ గుర్తుపై గెలిచి, ఏ జెండాపై గెలిచారో వాటికి రాజీనామా చేసి పార్టీ మార్చాల్సి ఉంటుందన్నారు. గతంలో బిఆర్‌ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాల కాలంలో కూడా ఇదే పద్ధతి కొనసాగిందన్నారు. అభిప్రాయాలు మార్చుకుని పదవికి రాజీనామా చేయకుండా పాలక పార్టీల్లో చేరడం ప్రజల్లో అసహ్యం పెంచుతోందని విమర్శించారు. చట్టం ప్రకారం నిర్ణయాలు తీసుకోవాలని స్పీకర్‌కు ఆయన విజ్ఞప్తి చేశారు. సర్పంచ్, ఎంపిటిసి, జెడ్‌పిటిసి పదవీకాలం ముగిసిన తర్వాత స్పెషల్ ఆఫీసర్ల పాలన కొనసాగుతోందని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర నిధులు సకాలంలో రావాలంటే ఎన్నికలు జరగాల్సిందే అన్నారు. గతంలో సర్పంచ్‌లు చేసిన అభివృద్ధి పనులకు చెల్లింపులు కూడా ప్రభుత్వం చేయలేకపోతోందని విమర్శించారు.

## ఆర్థిక ఆస్తులను హక్కుదారులకు చేకూర్చడమే లక్ష్యం

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ డైరెక్టర్ చిన్మయ్ కుమార్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బ్యాంకులు, మ్యూచువల్ ఫండ్‌లు, ఇన్సూరెన్స్ సంస్థల్లో పది సంవత్సరాలుగా క్లెయిమ్ చేయకుండా నిల్వ ఉన్న అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు, ఇతర ఆర్థిక ఆస్తులను వారి హక్కుదారులకు తిరిగి చేకూర్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ డైరెక్టర్ చిన్మయ్ కుమార్ తెలిపారు. ఆర్‌టిసి కళా భవన్‌లో లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మీ డబ్బు మీ హక్కు' రాష్ట్రస్థాయి అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భారత ప్రభుత్వ ఆర్థిక శాఖలోని ఫైనాన్షియల్ సర్వీసెస్ డివిజన్ ఆదేశాల మేరకు 2025 అక్టోబర్ 1 నుంచి డిసెంబర్ 31 వరకు దేశవ్యాప్తంగా అన్‌క్లెయిమ్డ్ ఫైనాన్షియల్ ఆసెట్స్ పరిష్కారానికి ప్రత్యేక ప్రచారం ప్రారంభించిందన్నారు. ప్రజలకు తమ పేర్లపై లేదా వారి వారసుల పేర్లపై ఉండే క్లెయిమ్ చేయని బ్యాంక్ డిపాజిట్లు, మ్యూచువల్ ఫండ్‌లు, డివిడెండ్‌లు, బీమా ఆదాయాల వివరాలు తెలుసుకునేందుకు ఆర్‌బిఐ నిర్వహిస్తున్న ఉద్యమి పోర్టల్ ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా ఎస్‌బిఐ సిజిఎం ఎస్. రాధాకృష్ణన్ మాట్లాడుతూ క్లెయిమ్ చేయని డిపాజిట్లు, పెట్టుబడులు చట్టబద్ధమైన యజమానులకు తిరిగి ఇవ్వడం బ్యాంకుల బాధ్యత అని చెప్పారు. డిఐసిసి జిఎం పావన్ కుమార్ మాట్లాడుతూ ఈ క్యాంపెయిన్‌పై అవగాహన పెంచేందుకు కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ఫిర్యాదుల స్వీకరణ దినంలో జిల్లా అధికారులకు వివరాలు చేరవేయాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమం సందర్భంగా వివిధ బ్యాంకులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను అధికారులు సందర్శించారు. వచ్చిన వినియోగదారులకు తక్షణ సేవలు అందించారు. సరైన హక్కుదారులకు సెటిల్‌మెంట్ లెటర్లు కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో సతీష్ కుమార్ (జిఎం ఎస్‌బిఐ), గోపాల్ (సిజిఎం ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్), కామేశ్వరరావు (జిఎం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా), రితేష్ కుమార్ (జిఎం బ్యాంక్ ఆఫ్ బరోడా), జాన్ కె. మెనోజ్ (స్టేట్ హెడ్ శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్), ఎస్‌ఎల్‌బిసి అధికారులు, లీడ్ బ్యాంక్ మేనేజర్ పి. నరసింహమూర్తి, జిల్లా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ రమేశ్ బాబు పాల్గొన్నారు.

## యువత తమ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయాలి : మధుయాష్కీ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆదివాసి గిరిజన యువత ఉన్నత స్థానాలకు ఎదిగి తాము పుట్టి పెరిగిన ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయాలని టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్, మాజీ పార్లమెంట్ సభ్యులు మధుయాష్కి గౌడ్ అన్నారు. రాజ్ భవన్‌లో సోమవారం జరిగిన గిరిజన యువతతో ఇంట్రాక్షన్(వాలిడిక్టరీ) కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో కలిసి ఆయన పాల్గొన్నారు. మేరా యువ భారత్ ఆధ్వర్యంలో 17వ ట్రైబల్ యూత్ ఎక్స్చేంజ్ ప్రోగ్రాంలో భాగంగా వారం రోజుల పాటు నగరంలో జరిగిన గిరిజన యువత సమ్మేళనంలో వివిధ రాష్ట్రాలకు చెందిన చెందిన యువతీ, యువకులు పాల్గొని, కార్యక్రమంలో భాగంగా చివరిరోజు గవర్నర్ కార్యాలయాన్ని సందర్శించి వారం రోజుల పాటు వారి మధ్య జరిగిన చర్చలను గవర్నర్‌తో పంచుకున్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక పోటీలలో ప్రతిభ కనబరిచిన వారికి గవర్నర్, మధుయాష్కి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా మధుయాష్కి మాట్లాడుతూ.. స్వాతంత్రం వచ్చి 75 ఏళ్లు దాటినా ఇప్పటికీ గిరిజన ఆదివాసి ప్రాంతాలలో రోడ్లు, పాఠశాలలు, ఆసుపత్రులు, తాగునీరు లాంటి కనీస సదుపాయాలు లేకపోవడం బాధాకరమన్నారు. సామాజిక, ఆర్థిక అణిచివేత కారణంగా చాలామంది యువత నక్సలిజం వైపు వెళ్తున్నారని, ఆదివాసీ ప్రాంతాలు అభివృద్ధి జరిగినప్పుడే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. హైదరాబాద్ యూత్ ఆఫీసర్ కుశ్బు, రైల్వే బోర్డు మెంబర్ నిర్మలా దేవి తదితరులు పాల్గొన్నారు.

## బిహార్ అసెంబ్లీ ఎన్నికలు సస్పెండ్ చేయాలి

సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జీతో విచారణ జరపాలి

సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి-వర్గ సభ్యులు వి.యస్.బోస్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్నికల కమిషన్ ప్రకటించిన ఓట్ల శాతం కంటే అదనంగా ఓట్లు పోలైన వ్యవహారంపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో నిష్పక్షపాత విచారణ జరిపించాలని, వాస్తవాలు తెలిసే వరకు అవకతవకలతో బిహార్ రాష్ట్రంలో 9వ తేదీన జరిగిన పోలింగ్, 11వ తేదీన జరిగిన కౌంటింగ్‌తో సహా మొత్తం అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియను పూర్తిగా సస్పెండ్ చేయాలని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.యస్.బోస్ డిమాండ్ చేశారు. పోలింగ్ అవకతవకల కుట్రదారులను ప్రజల ముందు నిలబెట్టి దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు. 'భారతదేశంలో ప్రజాస్వామ్య ముసుగులో కొనసాగుస్తున్న ఎన్నికల ప్రకారం బిహార్ రాష్ట్రంలో ఈ నెల 9వ తేదీన ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలు అధికారుల లెక్కల ప్రకారం, వార్తా పత్రికలలో వచ్చిన సమాచారం ప్రకారం బిహార్‌లో పోలింగ్ అయిన ఓట్ల శాతం 66.91 మొత్తం ఓట్లు 7.42 కోట్లు, పోలైన మొత్తం ఓట్లు అసలు ఓట్ల కంటే అధికంగా 7.45 కోట్ల ఓట్లు పోలయ్యాయి. మొత్తం ఓట్ల కంటే 3 లక్షల ఓట్లు ఎక్కువగా పోలైనట్లు తెలుస్తుంది. పోలింగ్ శాతం ప్రకారం అసలు పోలింగ్ కావాల్సిన ఓట్లు 4.96 కోట్లు. ఎలక్షన్ కమిషన్ లెక్కల ప్రకారం పోలైన ఓట్లు 7.45 కోట్లు. దీని ప్రకారం 2.49 కోట్ల ఓట్లు అధికంగా పోలైనట్లు తెలుస్తుంది' అని ఆయన ఒక ప్రకటనలో వివరించారు. అదనంగా పోలింగ్ జరిగిన 2.49 కోట్ల ఓట్లను ఎవరు అనుమతించారు, వారు ఓటు వేసే అర్హత ఎలా సంపాదించారనేది బ్రహ్మరహస్యమని, ఈ రహస్యాన్ని బద్దలు కొట్టాలంటే న్యాయ విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. భారతదేశంలోని ప్రజా స్వామ్యాన్ని కాపాడి, ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు వాస్తవాలు తెలియాలని ఆయన కోరారు. ప్రజలను మభ్యపెడితే సమాజంలో అఘాయిత్యాలు, అల్లకల్లోలు ప్రబలే అవకాశం ఏర్పడుతుందని ఆయన హెచ్చరించారు.

## 25న 'ఎఐఎస్ఎఫ్ 25వ మహాసభ'



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉస్మానియా యూనివర్సిటీ ఒయు ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో ఎఐఎస్ఎఫ్ ఒయు కౌన్సిల్ ఆధ్వర్యంలో ఈ నెల 25న జరుగనున్న 'ఎఐఎస్ఎఫ్ 25వ మహాసభ'ను జయప్రదం చేయాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేశ్ పిలుపునిచ్చారు. 'ఎఐఎస్ఎఫ్ ఒయు 25వ మహాసభ' కరపత్రాన్ని ఒయులోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ ఒయు అధ్యక్షుడు,కార్యదర్శి లెనిన్, నెల్లి సత్య, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు చైతన్య యాదవ్, ఓయూ సహాయ కార్యదర్శి ఉప్పల ఉదయ్ కుమార్,ఎఐఎస్ఎఫ్ నాయకులు మధు, సుమన్, దొండి రామ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్యార నరేష్ మా ట్లాడుతూ ఒయులో అడ్మిషన్ పొందిన ప్రతి విద్యార్థికి ఎటువంటి కోర్స్ ఫీజు లేకుండా, ఉచిత హాస్టల్, నాణ్యమైన మెస్ సౌకర్యం కల్పించాలని,ఒయులో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని, విద్యార్థులకు అన్ని వసతులతో కూడిన మెరుగైన లైబ్రరీలు, క్లాస్ రూములను, హెల్త్ సెంటర్‌లో అన్ని సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. పిహెచ్‌డి విద్యార్థులకు ఒక లాప్‌టాప్, అన్ని పిజి ఎల్.ఎల్.బి, ఎల్‌ఎల్‌ఎం, ఇంజనీరింగ్, ఫార్మసీ, ఎడ్యుకేషన్, టెక్నాలజీ కోర్సుల విద్యార్థులకు నెలకు రూ. 10వేల ఫెలోషిప్‌ను ఇవ్వాలన్నారు. ఒయుకు రూ 100 కోట్ల ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలన్నారు. యూనివర్సిటీలో విద్యార్థి సంఘం ఎన్నికల నిర్వహించాలని, యూనివర్సిటీ భూములను పరిరక్షించాలని, యూనివర్సిటీలో పాలకమండలి ఏర్పాటు చేయాలని కోరారు. ఒయుకు రూ. వెయ్యి కోట్ల నిధులను కేటాయిస్తామని సిఎం ప్రకటించిన నేపథ్యంలో దీనికి సంబంధించి అంశాలపైన ప్రొఫెసర్లు, నాన్ టీచింగ్ స్టాఫ్, విద్యార్థులు, విద్యార్థి సంఘాలు, కార్మికులతో సలహాలు, సూచనలు, అభిప్రాయాలను తీసుకుని వారితో చర్చించి, సమగ్ర నివేదికలను సిద్ధం చేయాలన్నారు. డాక్టర్ కేశవ రావు నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ, ఒయు విసి కుమార్ మొలగారం విద్యార్థి సంఘాలతో చర్చించకపోవడం విసి ఏకచక్రాధిపత్యానికి నిదర్శనమని ఆయన మండిపడ్డారు.

## కామన్‌వెల్త్ ఆఫ్ లెర్నింగ్‌తో అంబేద్కర్ వర్సిటీ నేడు అవగాహన ఒప్పందం

**ప్రజాపక్షం/హైదారబాద్:** ఇంటిగ్రేటెడ్ డిజిటల్ ఎడ్యుకేషన్ అకాడమీని (ఐడియా) స్థాపించేందుకు కామనె వెల్త్ ఆఫ్ లెర్నింగ్ (సిఒఎల్)తో హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ (బిఆర్ఎఒయు) అవగాహన ఒప్పందం (ఎంఒయు)పైన సంతకం చేయనుంది. అవగాహన ఒప్పందంపైన ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సమక్షంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు బిఆర్ఎఒయు వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, కామన్‌వెల్త్ ఆఫ్ లెర్నింగ్ అధ్యక్షుడు, సిఇఒ ప్రొఫెసర్ పీటర్ స్కాట్ అధికారికంగా సంతకం చేయనున్నారు. ఈ ఒప్పందం ద్వారా అంబేద్కర్ విశ్వవిద్యాలయం ప్రముఖ డిజిటల్ విశ్వవిద్యాలయంగా ఎదిగేందుకు ముందడుగు వేస్తోంది. బోధన,అభ్యాసం, పరిశోధనలను మెరుగుపర్చేందుకు ఐడియా అత్యాధునిక డిజిటల్ హబ్‌గా పని చేస్తుందని, ప్రధాన చొరవలలో టెక్నాలజీఎనేబుల్ లర్నింగ్, కృతిమ మేథస్సులో మైక్రోక్రెడెన్షియల్స్ ద్వారా ఫ్యాకల్టీ అభివృద్ధి, ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ బ్లూప్రింట్‌ను రూపొందించడం, వర్చువల్ ల్యాబ్‌లకు మద్దతు, ప్రాంతీయ డిజిటల్‌లెర్నింగ్ కన్సార్టియం తదితరాలు ఏర్పాటు కానున్నట్టు విశ్వవిద్యాలయ వర్గాలు పేర్కొన్నాయి. కా గా ప్రొఫెసర్ పీటర్ స్కాట్ బుధవారం అంబేద్కర్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించి, రౌండ్ టేబ్ల్ సమావేశంలో కీలకోపన్యాసం చేయనున్నారు. ఓపెన్ డి స్టెన్స్ లెర్నింగ్‌లో ప్రపంచ వ్యాప్తంగా సాంకేతికత ఆధారిత విద్యను అభివృద్ధి చేయడంలో ప్రొఫెసర్ స్కాట్‌కు దశాబ్దాల పాటు సుదీర్ఘమైన అనుభవం ఉన్నది.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ‘ఫెమా’ కేసులో అనిల్ అంబానీ..

**న్యూఢిల్లీ :** రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్ అనిల్ అంబానీ సోమవారం విదేశీమారక ద్రవ్యనిర్వహణ చట్టం (ఫెమా) కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ముందు హాజరు కావడానికి రెండవసారి నిరాకరించారు. నవంబరు 14న మొదటిసారి సమన్లను దాటవేసినప్పుడు తాను చేసిన స్టేట్‌మెంట్‌ను వర్చువల్ అప్పియరెన్స్ వీడియో ద్వారా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ముందు సమర్పించడానికిసిద్ధంగా ఉన్నానని వ్యాపారవేత్త అనిల్‌అంబానీ చెప్పారు. కాగా, ఇడిఅనిల్‌అంబానీఆఫర్‌ను తిరస్కరించింది. సోమవారం ఆయనకు తాజాగా సమన్లు జారీచేసింది.అయితే ఇడి ఇప్పుడు మూడవ సమన్లు జారీ చేస్తుందో, లేదోఅనేవిషయమై స్పష్టత లేదు.మనీల్యాండరింగ్ నిరోధక చట్టం కింద ఉన్న క్రిమినల్‌ప్రక్రియలకువిరుద్ధంగావిదేశీమారకద్రవ్యనిర్వహణ చట్టం (ఫెమా) కింద చర్యలు సివిల్ స్వభావాన్ని కలిగి ఉంటాయి. ‘మిస్టర్ అనిల్ అంబానీ తనస్టేట్‌మెంట్‌రికార్డింగ్‌కోసంఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు అనుకూలమైనవి తేదీ,సమయంలోనైనవర్చువల్ /రికార్డుచేసిన వీడియో ద్వారా అం దుబాటులోకిఉండటానికిముందుకొచ్చారు’అనివ్యాపారవేత్త ప్రతినిధి తెలిపారు.

# క్రమంగా ‘నరేగా’కు మంగళం

### ఒక్క నెలలోనే 27 లక్షల మంది పేర్లు తొలగింపు

**న్యూఢిల్లీ :** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని (నరేగా) క్రమంగా ఎత్తివేసేందుకు కేంద్ర ప్రభుత్వ కుట్ర పన్నుతోంది. తక్కువ సంఖ్యలో సభ్యులను పథకంలో చేర్చుతూ అందుకు మూడింతలు ఇతరులను తొలగిస్తోంది. ఈ ఏడాది అక్టోబరు 10వ తేదీ నుంచి ఈనెల 14వ తేదీ వరకు డేటాబేస్ నుంచి దాదాపు 27 లక్షల పేర్లను తొలగించింది. సభ్యులు తప్పనిసరిగా ఇకెవైసి చేయించాలని కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి షరతు విధించింది. చేయని వారి పేర్లను తొలగిస్తోంది. కేవలం నెల రోజుల్లోనే 27 లక్షల మందిను తొలగించగా, కేవలం 10.5 లక్షల మందిని మాత్రమే కొత్తగా పథకంలో చేర్చింది. అనర్హులను తొలగించేందుకు ఇకెవైసిని తీసుకువచ్చినట్లు సమర్థించుకుంటుంది. ఉపాధిహామీ పథకం నుంచి పేర్ల తొలగింపులను అసాధారణమని కార్యకర్తలు, విద్యావేత్తల కన్సార్టియం లిబ్ టెక్, అని పేర్కొంది. గత ఆరు నెలల్లో తొలగింపులు దాదాపు 15 లక్షలకు చేరగా, కేవలం ఒక నెలలోనే 27 లక్షలకు పెరిగాయాని, ఇది అందకు ముందటి ఆరు నెలల మొత్తం కంటే దాదాపు రెట్టింపు అని తెలిపింది. లిబ్ టెక్ విశ్లేషణ ప్రకారం 2025–26 ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో, ఉపాధిహామీ పథకంలో నికరంగా 83.6 లక్షల మంది కార్మికులు ఉండగా, 98.8 లక్షల మంది కార్మికులు చేరారు. అయితే 15.2 లక్షల తొలగింపులు జరిగాయి. ఆ తర్వాత, నవంబర్ మధ్య నాటికి నికర చేరికలు 66.5 లక్షలకు తగ్గాయి. అంటే ఒకే నెలలో 17 లక్షల మంది కార్మికులు అదృశ్యమయ్యారు. ఈ లబ్ధిదారులలో 6 లక్షల మంది క్రియాశీల కార్మికులు లిబ్ టెక్ విశ్లేషించింది. అంటే వారు గత మూడు సంవత్సరాలలో కనీసం ఒక రోజు పనిచేశారు. అధిక ఇకెవైసి పూర్తి రేట్లు ఉన్న రాష్ట్రాలు తొలగింపుల ధోరణిలో ముందున్నాయని విశ్లేషణ వెల్లడించింది. 78.4% మంది కార్మికులు ఇకెవైసి పూర్తి చేసిన ఆంధ్రప్రదేశ్ 15.92 లక్షల తొలగింపులతో అగ్రస్థానంలో ఉంది. అధికంగా తొలగించిన ఇతర రాష్ట్రా ల్లో తమిళనాడులో 30,529 మందిని తొలగించారు. ఈ రాష్ట్రంలో ఇకెవైసి పూర్తి రేటు 67.6 శాతంగా ఉంది. ఛత్తీస్‌గఢ్‌లో 1.04 లక్షల మందిని తొలగించగా, ఇకెవైసి పూర్తి రేటు 66.6 శాతంగా ఉంది. కాగా, కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖలోని సీనియర్ అధికారులు ఇకెవైసి డ్రైవ్, తొలగింపుల మధ్య ఎటువంటి సంబంధం లేదని తోసిపుచ్చినట్లు ఓ వార్తాపత్రిక పేర్కొంది. ఏదైనా జాబ్ కార్డు తొలగింపు కోసం తాము ఒక ప్రామాణిక ఆపరేటింగ్ విధానం (ఎస్ఒపిలు) జారీ చేశామని, ఇందులో తొలగింపు కోసం ఖరారు చేసిన జాబ్ కార్డులను పబ్లిక్ డొమైన్‌లో ఉంచడం, లబ్ధిదారులు అప్పీల్ దాఖలు చేయడానికి సమయం ఇవ్వడం, గ్రామసభ నుండి తుది ఆమోదం పొందడం వంటివి ఉన్నాయనిమంత్రిత్వ శాఖలోని ఒక ఉన్నతాధికారి ఆ వార్తాపత్రికకు తెలిపారు.



### క్రమబద్ధమైన ప్రయత్నం : కాంగ్రెస్



ఉపాధిహామీ పథకంలో పేర్లను తొలగించడంతో ప్రభుత్వంపై కాంగ్రెస్ మండిపడింది. పథకానికి పేదలను దూరం చేసే చర్యే కాదని, పథకాన్ని అంతం చేయడానికి ‘క్రమబద్ధమైన ప్రయత్నం’ అని పేర్కొంది. పథకం కింద రోజుకు రూ. 400 కనీస వేతనం, ఆధార్ ఆధారిత చెల్లింపు వ్యవస్థ (ఎబిపిఎస్), నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ (ఎన్ఎంఎంఎస్), ఇకెవైసి తప్పనిసరి చేయడాన్ని వెంటనే నిలిపివేయాలన్న తమ డిమాండ్లను కాంగ్రెస్ పునరుద్ఘాటించింది. ‘భారతదేశంలోని గ్రామీణ పేదలకు వారి శాసనపరమైన ఉపాధి హక్కును నిరాకరించడానికి మరొక ప్రయత్నం. గత ఒక నెలలో అక్టోబర్ 10, నవంబర్ 14 మధ్య మోదీ ప్రభుత్వం నరేగా లబ్ధిదారుల డేటాబేస్ నుండి 27 లక్షల పేర్లను తొలగించింది. ఈ లబ్ధిదారులలో ఆరు లక్షల మంది క్రియాశీల కార్మికులు’ అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ ఎక్స్‌లో పేర్కొన్నారు. లబ్ధిదారులను సామూహికంగా తొలగించడం కార్మికుల కోసం ఇకెవైసి ప్రక్రియను ప్రవేశపెట్టడంతో సమానంగా ఉందని ఆయన అన్నారు. తాము పదే పదే లేవనెత్తినట్లుగా, ఇది ఒక వివిక్త చర్య కాదు, పారదర్శకత ముసుగులో తీసుకువచ్చిన ఆధార్ ఆధారిత డిజిటల్ ప్రక్రియలను ప్రవేశపెట్టడం ద్వారా నరేగా అంతం చేయడానికి ఒక క్రమబద్ధమైన ప్రయత్నం అని రమేష్ అన్నారు.

## 20న బిహార్‌లో కొత్త ప్రభుత్వం



**పాట్నా :** బిహార్‌లో కొత్త ప్రభుత్వం కొలవుదీరనుంది. ఈనెల 20వ తేదీన ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగే అవకాశముందని అధికార వర్గాలు తెలిపాయి. కార్యక్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు సహా ఎన్‌డిఎలోని పలువురు అగ్ర నాయకులు పాల్గొంటారని వారు తెలిపారు. అయితే ఈనెల 19వ తేదీన ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ తన రాజీనామాను గవర్నర్‌కు సమర్పించనున్నారు. కాగా, బిహార్ బిజెపి అధ్యక్షుడు దిలీప్ జైస్వాల్ సోమవారం ఉదయం విలేకరులతో మాట్లాడుతూ కొత్తగా ఎన్నికైన శాసనసభ్యులు తమ శాసనసభ పక్ష నాయకుడిని ఎన్నుకోవడానికి మంగళవారం సమావేశమవుతారని చెప్పారు. కొత్త ప్రభుత్వ ప్రమాణ స్వీకార కార్యక్రమం నవంబర్ 20 లేదా నవంబర్ 21న జరిగే అవకాశం ఉంది అని ఆయన అన్నారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి పాట్నాలోని గాంధీ మైదానంలో సన్నాహాలు జరుగుతున్నాయి. ప్రస్తుత ప్రభుత్వ చివరి మంత్రివర్గ సమావేశం సోమవారం జరిగింది. అసెంబ్లీ రద్దుకు సిఫార్సు చేయడానికి ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌కు అధికారం ఇచ్చినట్లు రాష్ట్ర మంత్రి ఒకరు తెలిపారు. సమావేశం ముగిసిన వెంటనే ముఖ్యమంత్రి గవర్నర్ ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్‌ను కలిసి మంత్రివర్గ నిర్ణయం గురించి ఆయనకు వివరించారు. సమావేశంలో 19న అసెంబ్లీ రద్దుకు సిఫార్సు చేయడానికి మంత్రి మండలి ఒక తీర్మానాన్ని ఆమోదించిందని జెడి(యు) సీనియర్ నాయకుడు, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి విజయ్ చౌదరి విలేకరులకు తెలిపారు. కేబినెట్ సమావేశం అనంతరం నితీశ్ కుమార్ డిప్యూటీ సిఎం సామ్రాట్ చౌదరి, ప్రధాన కార్యదర్శి ప్రత్యాయ అమృత్‌లతో కలిసి గవర్నర్‌ను కలిశారు. బిహాలో ఎన్‌డిఎ ఘన విజయం సాధించినందుకు సిఎంకు కృతజ్ఞతలు తెలుపుతూ మంత్రివర్గం మరో తీర్మానాన్ని ఆమోదించింది. ‘నితీష్ కుమార్ నాయకత్వంలో బిహార్‌లో కూటమి ఇప్పటివరకు సాధించిన అత్యుత్తమ ప్రదర్శన ఇది... రాష్ట్ర ప్రభుత్వ దార్శనిక విధానాల వల్ల ఇది సాధ్యమైంది’ అని విజయ్ చౌదరి అన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డిఎ 243 మంది సభ్యులున్న సభలో 200 కంటే ఎక్కువ సీట్లను గెలుచుకుంది. బిజెపి గరిష్టంగా 89 సీట్లను గెలుచుకోగా, జెడి(యు) 85 స్థానాల్లో విజయం సాధించింది.

## బిహార్‌లో నగదు బదిలీపై చర్చిస్తాం

### ఎన్నికలకు ముందు రాష్ట్ర ప్రభుత్వం నగదు బదిలీ చేయడం కొత్తగా ఉంది : శరద్ పవార్



**పుణె :** బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు ‘ముఖ్యమంత్రి రోజ్‌గారీ యోజన’ పథకం కింది ప్రతి మహిళ ఖాతాల్లోకి రూ. 10 వేలు నగదు బదిలీ చేయడం వల్ల మహిళా ఓటర్లు అధికార ఎన్‌డిఎకు ఓటు వేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్‌సిపి (ఎస్‌పి) అధ్యక్షుడు శరద్ పవార్ స్పందిస్తూ ఫలితాలపై ప్రతిపక్షనాయకులతో చర్చల సందర్భంగా మహిళలకు ప్రత్యక్ష నగదు బదిలీ అంశాన్ని లేవనెత్తుతానని అన్నారు. ప్రతిపక్ష మహాఘట్బంధన్ కూటమిని ఓడించి బిహార్ ఎన్నికల్లో అధికార ఎన్‌డిఎ ఘన విజయం సాధించిన నేపథ్యంలో పవార్ వ్యాఖ్యలు చేశారు. ‘పోల్ ఫలితం మా అంచనాలకు భిన్నంగా మారింది. అయితే, ప్రజల ఆదేశాన్ని అంగీకరించాలి. మహారాష్ట్ర, బిహార్‌లలో, లడ్కీ బహిన్, మహిళలకు రూ. 10,000 ప్రత్యక్ష ప్రయోజన బదిలీ వంటి పథకాలు ఎన్నికలకు ముందు ప్రవేశపెట్టడం అందరూ చూశారు. ఇలాంటివి ఇంతకు ముందు ఎప్పుడూ చూడలేదు’ అని పవార్ ఆదివారం సోలాపూర్‌లో విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. బిహార్‌లో మహిళలు వ్యాపారం ప్రారంభించడానికి ప్రతి కుటుంబంలోని ఒకరికి నగదు అందించే ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గర్ యోజన గురించి ఆయన ప్రస్తావించారు. ఈ పథకం కింద ఎన్నికలకు ముందు మహిళల బ్యాంకు ఖాతాలకు ఒక్కొక్కరికి రూ. 10,000 బదిలీ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో డబ్బు పంపిణీ జరుగుతుందని తాను విన్నానని, కానీ రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా రూ. 10,000 అందించడం కొత్త విషయం అని పవార్ అన్నారు. బిహార్ ఎన్నికల్లో ఎన్‌డిఎ విజయం వెనుక రూ. 10,000 డిపాజిట్ చేయడం కారణమైతే దానిపై తీవ్రంగా చర్చించాలన్నారు. డిసెంబర్ 1న పార్లమెంట్ సమావేశం ప్రారంభం కానుందని, ఈ సమయంలో కీలకమైన ప్రతిపక్ష నాయకులను ఒక చోట చేర్చి ఈ అంశంపై చర్చించి, ప్రతిస్పందనను రూపొందిస్తామన్నారు. బిహార్‌లో ఎన్నికల ప్రక్రియలో నిధుల పంపిణీని ఎన్నికల కమిషన్ ఎలా అనుమతించిందో అని పవార్ ఆశ్చర్యపోయారు.

## కేరళలో బిఎల్ఒ ఆత్మహత్య

### రాష్ట్రవ్యాప్తంగా బిఎల్ఒల విధుల బహిష్కరణ
### ఇసి, కలెక్టరేట్‌ల వద్ద నిరసన
### ‘సర్’పై తీవ్ర ప్రభావం



**తిరువనంతపురం :** కేంద్ర ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్) ఉద్యోగుల పాలిట మృత్యువుగా మారుతోంది. ఈ నెల 4 నుంచి డిసెంబరు 4వ తేదీ వరకు 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో సర్ కొనసాగనుంది. అయితే పని ఒత్తిడి కారణంగా కేరళలో ఓ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం బూత్‌స్థాయి అధికారులు (బిఎల్ఒలు) విధులను బహిష్కరించారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమంపై ప్రభావం పడింది. కన్నూర్ పయ్యన్నూర్‌లో బిఎల్ఒగా పనిచేస్తున్న 44 ఏళ్ల అనీష్ జార్జ్ ఆదివారం తన ఇంట్లో ఉరివేసుకుని కనిపించాడు. సర్ ప్రక్రియకు సంబంధించిన పని సంబంధిత ఒత్తిడి కారణంగా ఆయన ఈ తీవ్ర చర్య తీసుకున్నారని కుటుంబ సభ్యులు, నివాసితులు ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల యాక్షన్ కౌన్సిల్, ఉపాధ్యాయ సేవా సంస్థల జాయింట్ కమిటీతో సహా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు చెందిన వివిధ కార్మిక సంఘాలు తిరువనంతపురంలోని ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం, జిల్లా కలెక్టరేట్‌ల వద్ద నిరసనలు నిర్వహించాయి. అధికారులు బిఎల్ఒలపై అధిక ఒత్తిడిని కలిగించకుండా, సర్‌ను వాయిదా వేయడాన్ని పరిగణించాలని డిమాండ్ చేశారు. మరిన్ని ఆత్మహత్యలను నివారించడానికి సర్ విధానాలను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ కేరళ ఎన్‌జిఒ అసోసియేషన్ కూడా రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు నిర్వహించింది. కాగా, సోమవారం పోస్ట్‌మార్టం తర్వాత జార్జ్ మృతదేహాన్ని అతని బంధువులకు అప్పగించారు. జార్జ్ కుటుంబం సర్‌కు సంబంధించి తీవ్రమైన పని ఒత్తిడిలో ఉన్నారని పునరుద్ఘాటించారు. అతనికి ఆహారం, నిద్ర సరిగ్గా లేదని, సర్ ప్రక్రియలో భాగంగా కేటాయించిన పనిని పూర్తి చేయడానికి తీవ్ర ఒత్తిడిలో ఉన్నాడు అని జార్జ్ బావమరిది సైజు విలేకరులతో అన్నారు. జార్జ్‌ను సీనియర్ అధికారులు తరచుగా నవీకరణల కోసం సంప్రదిస్తున్నారని సైజు పేర్కొన్నారు.తీవ్రమైన పనిభారం చూసి, జార్జ్ తండ్రి ఉద్యోగం పోయినా చింతించవద్దని ధైర్యం చెప్పారన్నారు. ఇదిలా ఉండగా, జార్జ్ ఆత్మహత్యలో సిపిఐ(ఎం) కార్యకర్తల పాత్రను కూడా పరిశీలించాలని ప్రాథమిక దర్యాప్తులో తేలిందనిప్రతిపక్ష నాయకుడు విడి సతీశన్ అన్నారు. గణన కోసం కాంగ్రెస్ బూత్ లెవల్ ఏజెంట్ తనతో వచ్చిన తర్వాత జార్జ్‌ను బెదిరించారని తమకు తెలిసింది అని ఆయన ఆరోపించారు. బిజెపి, సిపిఐ(ఎం) రెండూ సాంప్రదాయ కాంగ్రెస్ ఓటర్లను జాబితా నుండి దూరంగా ఉంచడానికి ప్రయత్నిస్తున్నాయని కూడా ఆరోపించారు. బిఎల్ఒల భద్రతను నిర్ధారించి, సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని సతీశన్ రాష్ట్ర ప్రభుత్వం, భారతఎన్నికల కమిషన్ (ఇసిఐ)ను కోరారు. బిఎల్ఒలలో ఎక్కువ మంది మహిళలు ఉన్నారని, ఒక బూత్‌లోదాదాపు 700–1,200 మంది ఓటర్లు ఉండగా, తక్కువ వ్యవధిలో లక్ష్యాలను చేరుకోవడానికి బిఎల్ఒలు ప్రతి ఇంటికి అనేకసార్లు వెళ్లాల్సి ఉంటుంది అని ఆయన అన్నారు. గణన సమయంలో కాంగ్రెస్ బూత్ స్థాయి ఏజెంట్లతో పాటు వెళ్లినందుకు సిపిఐ(ఎం) కార్యకర్తలు తనను బెదిరించారని జార్జ్ చేసిన ఫోన్ సంభాషణలో వెల్లడైందని కేరళ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (కెపిసిసి) అధ్యక్షుడు సన్నీ జోసెఫ్ అన్నారు. నిరసన తెలుపుతున్న బిఎల్ఒలకు కాంగ్రెస్ పార్టీ పూర్తిగా మద్దతు ఇస్తుందని ఆయన అన్నారు. సర్ ప్రక్రియకు వ్యతిరేకంగా కాంగ్రెస్ సుప్రీంకోర్టును ఆశ్రయిస్తుందని జోసెఫ్ అన్నారు. సోషల్ ఇంపాక్ట్ రిజిస్టర్ (సర్) ప్రక్రియను వాయిదా వేయాలని కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించాలని ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ కూడా నిర్ణయించింది. కాగా, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్‌లో ఇలాంటి బిఎల్ఒ ఆత్మహత్యలు జరిగాయని, వారు తీవ్ర ఒత్తిడిలో ఉన్నారన్నారు. జార్జ్ కుటుంబ సభ్యుల మాట వినడానికి బదులుగా, సతీశన్ సిపిఐ(ఎం)ను నిందించడానికి ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు.

### ఢిల్లీ పేలుడు ఘటన నిందితుడికి
## 10 రోజుల ఎన్ఐఎ కస్టడీ



**న్యూఢిల్లీ** : దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో ఇటీవల జరిగిన భారీ పేలుడు కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. పేలుడుకు పాల్పడిన ఉమర్‌కు సహకరించిన నిందితుడు అమీర్ రషీద్ అలీని కట్టుదిట్టమైన భద్రత మధ్య పాటియాలా హౌస్ కోర్టు కాంప్లెక్స్‌లోని ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు ముందు సోమవారం నాడు హాజరుపరిచారు. అనంతరం 10 రోజుల ఎన్ఐఎ కస్టడీకి కోర్టు ఆదేశించింది. ఆ వెంటనే రషీద్‌ను ఎన్ఐఎ కార్యాలయానికి తరలించారు. అమీర్ రషీద్ అలీని కోర్టుకు హాజరుపరిచే సమయంలో మీడియాను అనుమతించలేదు. కోర్టు కాంప్లెక్స్ చుట్టూ ఢిల్లీ పోలీసులు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బంది మోహరించారు. అల్లర్ల వ్యతిరేక టీమ్‌నూ సిద్ధం చేశారు. నవంబర్ 10న జరిగిన ఢిల్లీ పేలుడు ఘటనలో 10 మంది మృతిచెందగా, 13మంది గాయపడ్డారు. ఐఇడి అమర్చి పేల్చిన ఐ20 కారు అమీర్ పేరుతో రిజిస్టర్ కావడంతో ఎన్ఐఎ అతన్ని అదుపులోకి తీసుకుంది. సూసైడ్ బాంబర్ ఉమర్ నబీతో కలిసి ఈ దాడికి అమీర్ రషీద్ కుట్రపన్నినట్టు ఎన్ఐఎ వెల్లడించింది. అమీర్ జమ్ముకశ్మీర్‌లోని పంపోర్‌కు చెందిన వ్యక్తి కాగా, ఉమర్ ఫరీదాబాద్‌లోని అల్ ఫలాహ్ యూనివర్శిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాడు. తదుపరి విచారణలో భాగంగా ఉమర్ ఉపయోగించిన మరో కారునూ ఎన్ఐఎ స్వాధీనం చేసుకుంది. ఇంతవరకూ గాయపడిన బాధితులతో సహా 73మంది సాక్ష్యులను ఎన్ఐఎ విచారించింది. మరోవైపు, ఫరీదాబాద్ టెర్రర్ మాడ్యూల్ కేసులో ప్రమేయం, మోసం, ఫోర్జరీకి పాల్పడిన ఆరోపణలపై అల్‌ఫలాహ్ యూనివర్శిటీ చైర్మన్‌కు ఢిల్లీ పోలీసులు రెండు సమన్లు జారీ చేశారు. యుజిసి, ఎన్ఎఎసి లేవనెత్తిన ఆందోళనలపై రెండు ఎఫ్ఐఆర్‌లనూ నమోదు చేశారు. యూనివర్శిటీ గుర్తింపు క్లెయిమ్స్‌పై జరిపిన సమీక్షలో పెద్దఎత్తున అవకతవకలు జరిగినట్టూ గుర్తించారు.

## క్రూడాయిల్‌పై ట్రంప్ జరిమానా రద్దవుతుందా?

### దగ్గరపడిన తొలిదశ ఒప్పందం!



**న్యూఢిల్లీ:** టారిఫ్‌ల సమస్య పరిష్కరించుకోవడానికి భారత్–అమెరికా కొనసాగిస్తున్న ద్వైపాక్షిక వాణిజ్య చర్చలు ఒప్పందానికి చేరువలో ఉన్నాయి. ఈ ఒప్పందం కుదిరితే ట్రంప్ పాలనాయంత్రాంగం భారత్ వస్తువులపై విధించిన 50 శాతం టారిఫ్‌ల సమస్య పరిష్కారానికి వీలు కలుగుతుంది. ముఖ్యంగా రష్యా ముడిచమురుపై విధించిన జరిమాన సమస్యకు ఒక పరిష్కారం వచ్చే అవకాశం ఉంది. దీంతోపాటే అమెరికా మార్కెట్‌ను అందిపుచ్చుకోవడానికి ఎదురవుతున్న అనేక సమస్యలు కూడా పరిష్కారం అవుతాయని న్యూఢిల్లీలో అధికారులు సోమవారం చెప్పారు. భారత్–అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్య చర్చల్లో అనేక ఆటంకాలు ఉన్నాయి. అనేక ప్యాకేజీలు ఉన్నాయి. వీటిల్లో అన్నింటికంటే ముఖ్యమైనదీ, మొదటిదీ ముడిచమురుపై విధించిన జరిమానా సమస్యే. ఐతే ఇప్పుడు చర్చలు ఒప్పందం చేసుకోవడానికి సమీపంగా వచ్చాయి. రెండు దేశాలు పరస్పర అంగీకారంతో ఒక తేదీని నిర్ణయించి ఈ ఒప్పందాన్ని ప్రకటిస్తాయి. రెండు దేశాలమధ్యా ఇప్పటివరకూ ఆరు విడతల వాణిజ్య సమావేశాలు పూర్తయ్యాయి. 2025వ సంవత్సరం ముగిసేనాటికి మొదటి విడత దశ ఒప్పందాన్ని ఖరారు చేసేందుకు రెండు దేశాలూ ప్రణాళికలను ప్రకటించాయి. కేంద్ర వాణిజ్య కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ భారత్ తరపు బృందానికి నాయకత్వం వహిస్తున్నారు. గతనెలలో ఈ బృందం వాషింగ్టన్‌లో అమెరికా వాణిజ్యశాఖాధికారులతో సంభాషణలు జరిపింది. మూడు రోజులు జరిగిన చర్చలు అక్టోబరు 17న ముగిశాయి. రెండు దేశాలమధ్యా వాణిజ్య సంబంధాలు తీవ్ర ఒత్తిడికి గురై సమస్యల్లో పడినందువల్ల ఒప్పందం చేసుకోవడంలో సంప్రదింపులే అత్యంత కీలకమైనవి. ప్రస్తుతం జరుగుతున్న ప్రతిపాదిత ద్వైపాక్షిక సంప్రదింపులు ఫలిస్తే 2030 నాటికి రెండు దేశాలమధ్యా వాణిజ్యం 500 బిలియన్ డాలర్లకు చేరుతుంది. ప్రస్తుతం ఈ వాణిజ్యం విలువ 191 బిలియన్ డాలర్లు మాత్రమే. ట్రంప్ యంత్రాంగం భారత్ ఎగుమతి చేసే వస్తువులపై 25 శాతం టారిఫ్ విధించింది. రష్యా నుండి ముడి చమురు దిగుమతి చేసుకుని ఉక్రేన్‌పై యుద్ధానికి ప్రోత్సహిస్తున్నందుకుగాను జరిమానాగా అమెరికా మార్కెట్లలో ప్రవేశించే భారత వస్తువులపై మరో 25 శాతం సుంకాలను విధించారు. ఈ చర్చల ద్వారా ఈ మొత్తం టారిఫ్‌ల భారాన్ని గణనీయంగా తగ్గించుకోవాలని మోదీ ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నది. ఐతే ఉక్రేన్‌లో జరుగుతున్న యుద్ధం కూడా ఈ చర్చలపై ప్రభావం చూపిస్తూ ఉండటంతో ఈ ప్రక్రియ మెల్లిగా కొనసాగుతూ ఎట్టకేలకు ఒప్పందానికి దగ్గరయ్యాయి. ఈ ఒప్పందం వల్ల భారత్‌పై అమెరికా విధించిన 25 శాతం జరిమానా సమస్య పరిష్కారం అవుతుందని అంచనావేస్తున్నట్లు అధికారులు చెప్పారు. ఈ జరిమానాను గనుక పరిష్కరించుకోలేకపోతే ఈ ఒప్పందానికి ఇక అర్థమే ఉండదని కూడా అధికారులు పేర్కొన్నారు. ఇక భారత ప్రభుత్వం నడిపించే చమురు కంపెనీలు 2026లో అమెరికా నుండి ఎల్‌పిజి వంటగ్యాస్‌ను దిగుమతి చేసుకునేందుకు ఒక ఏడాది ఒప్పందంపై సంతకాల సమస్యకు సంబంధించి కూడా ఇంకా సమయం పట్టేలా ఉంది. ‘‘అమెరికాతో వాణిజ్యాన్ని మొత్తం గా నిలబెట్టుకునే ఒప్పందాలతో ఈ అంశాలు ముడిపడి ఉంటాయి, దీనిపై కృషి చేయడానికి కొంత సమయం పడుతుంది, అమెరికాతో వాణిజ్యాన్నా సమతుల్యం చేసుకునే క్రమంలో ఇవన్నీ సర్దుబాటు కావాల్సి ఉంది’’ అని ఒక అధికారి చెప్పారు. అమెరికాకు, భారత్‌కు మధ్య ఉన్న వాణిజ్య మిగులును తగ్గించుకోవాలి. ముఖ్యంగా ట్రంప్ కోరుకున్న విధంగా అమెరికావల్ల భారత్ ఎక్కువగా లాభపడుతోంది. భారత్‌కు వాణిజ్య మిగులు ఉంది. కానీ భారత్‌తో వాణిజ్య చేయడం వల్ల అమెరికాకు ఆ మిగులు లేదు. ఎందుకంటే అమెరికా నుండి భారత్‌కు వచ్చే దిగుమతులు చాలా తక్కువగా ఉన్నాయి. ట్రంప్ మొదటినుండీ ఈ విషయాన్ని ప్రధానంగా ప్రపంచం ముందుంచారు. అమెరికాను భారతదేశం దోచుకుంటోందనీ, ప్రపంచంలో ఏ దేశమూ వసూలు చేయనంత భారీస్థాయిలో భారత్ తమనుండి సుంకాలు వసూలు చేస్తోందని ట్రంప్ విమర్శిస్తున్నారు. భారత్ ఎంత టారిఫ్ విధిస్తే మేం కూడా భారత్‌పై అంతే టారిఫ్ విధిస్తామనే విధానం ప్రకారం మన దేశంపై భారీగా సుంకాలు పెంచారు. ఐతే ఈ ద్వైపాక్షిక ఒప్పందం వల్ల బాగా లాభపడాలని ట్రంప్ భావిస్తున్నారు. భారతదేశంలో మార్కెట్లను అందిపుచ్చుకుని వాణిజ్య మిగులు పెంచుకోవాలని కోరుకుంటున్నారు. భారత్‌లో బాదం, పిస్తా, యాపిల్స్, ఇథనాల్, జన్యుపరంగా మార్పిడి చేసిన ఉత్పత్తుల మార్కెట్లను చేజిక్కించుకోవాలని ట్రంప్ ప్రయత్నం చేస్తున్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో వరుసగా నాలుగోసారి కూడా భారతదేశానికి అమెరికా అతిపెద్ద వాణిజ్య భాగస్వామి హోదాను దక్కించుకుంది. ఈ మేరకు గత ఆర్థిక సంవత్సరంలో 131.84 బిలియన్ డాలర్ల విలువైన ద్వైపాక్షిక వాణిజ్యం( 86.5 బిలియన్ డాలర్ల ఎగుమతులు) నమోదైంది. భారతదేశం 18 శాతం వస్తువులను ఎగుమతి చేయగా, 6.22 శాతం దిగుమతులు చేసుకుంది. ఐతే భారీగా పెరిగిన టారిఫ్‌ల వల్ల ఈ ఏడాది సెప్టెంబరునెలలో అమెరికాకు భారత్ నుండి 11.93 శాతం ఎగుమతులు క్షీణించాయి. వీటి విలువ 5.46 బిలియన్ డాలర్లుగా నమోదైంది. అదేసమయంలో సెప్టెంబరునెలలో అమెరికా నుండి దిగుమతులు 11.78 శాతం పెరిగాయి. వీటి విలువ 3.98 బిలియన్ డాలర్లుగా నమోదైంది. ఈ విధంగా టారిఫ్‌ల వల్ల భారతదేశంలో అమెరికా తన వ్యాపారం పెంచుకుంది.

## అందరికీ ఇళ్లు, ఆహారం, విద్య

### కేరళలో ఎల్‌డిఎఫ్ మేనిఫెస్టో విడుదల



**తిరువనంతపురం:** కేరళలోని అధికార ఎల్‌డిఎఫ్ సోమవారం స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసింది. ఎకెజి సెంటర్‌లోని ఉన్న సిపిఐ(ఎం) ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి ఎం.వి. గోవిందన్, లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డిఎఫ్) కన్వీనర్ టి.ఇపి.రామకృష్ణన్, సిపిఐ నేత సత్యన్ మోకేరి, ఆంటోనీ రాజు ఎమ్మెల్యే తదితర ప్రముఖ నాయకులు హాజరయ్యారు. పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించడం, అందరికీ గృహనిర్మాణం, ఆహారం, విద్య, వైద్యం వంటి హామీలను ఇచ్చింది. కేరళలో యువత అంచనాలకు అనుగుణంగా ఉపాధి అవకాశాలను సృష్టించడానికి వామపక్ష ప్రభుత్వం ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించి అమలు చేయనున్నట్లు మేనిఫెస్టోలో పేర్కొంది. మరికొన్ని రోజుల్లోనే రెండు దఫాలుగా స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నందున ఎల్‌డిఎఫ్ మేనిఫెస్టోలో అందరికీ సంక్షేమం, అభివృద్ధిని హామీ ఇచ్చింది. కెఐఐఎఫ్‌బి ద్వారా కేరళలో అపూర్వమైన మౌలిక సదుపాయాల అభివృద్ధి జరుగుతోందని, పాఠశాల విద్య విషయంలో మాదిరిగానే దేశంలో ఉన్నత విద్యా రంగాన్ని ముందంజలోనికి తీసుకురావడానికి సంస్కరణలు కూడా అమలు చేయబడుతున్నాయని మ్యానిఫెస్టో పేర్కొంది. ‘అధికార వికేంద్రీకరణ కొత్త అభివృద్ధి వ్యూహంలో అంతర్భాగం. దీని ద్వారా, పాలన, ప్రాంతీయ ఆర్థిక అభివృద్ధి, ప్రజా సంక్షేమంలో ఎక్కువ ప్రజా భాగస్వామ్యాన్ని నిర్ధారించడానికి లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ కట్టుబడి ఉంది’ అని పేర్కొంది. 64,000 కుటుంబాలను ఇప్పటికే తీవ్ర పేదరికం నుండి బయటకు తీసుకువచ్చామని, అదేవిధంగా, అర్హులైన లబ్ధిదారులను గుర్తించిన తర్వాత రాష్ట్రం నుండి పేదరికాన్ని పూర్తిగా నిర్మూలిస్తామని మేనిఫెస్టోలో వెల్లడించారు. అందరికీ గృహనిర్మాణం, ఆహారం, విద్య, వైద్యాన్ని నిర్ధారించడానికి చర్యలు తీసుకుంటామని హామీనిచ్చింది. వామపక్ష మేనిఫెస్టోలో కాంగ్రెస్, బిజెపిలకు వ్యతిరేకంగా తీవ్ర వ్యాఖ్యలు చేసింది. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చింది , దేశంలో మత ధ్రువణతను సృష్టించడం ద్వారా దానిని నిలుపుకోవడానికి ప్రయత్నిస్తోందని మేనిఫెస్టో ఆరోపించింది. కాంగ్రెస్ రాజీ లేకుండా దీనిని వ్యతిరేకించలేకపోయిందని ఆరోపించింది.

ప్రజాపక్షం
మంగళవారం, 18 నవంబరు

# ఐబొమ్మ ఆటకట్టింది

పైరసీ... కొత్తగా తెరపైకి వచ్చిన పాత సమస్య. దశాబ్దాల తరబడి కొనసాగుతున్న దుర్గత. చేతనైతే అరెస్టు చేయాలంటూ సవాళ్లు విసిరిన 'ఐబొమ్మ' నిర్వాహకుడు ఇమ్మడి రవి అరెస్టు కావడంతో పైరసీపై చర్చ మరోసారి తెరపైకి వచ్చింది. పైరసీ నిరోధక చట్టాలు, చేపడుతున్న చర్యలకు కొదవ లేదు. కానీ, వీడియో ప్లేయర్లు, 'సిడి'ల కాలం నుంచి అత్యాధునిక సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ వరకూ, సాంకేతిక పరిజ్ఞానంతోపాటు పైరసీ కూడా విస్తరిస్తూనే ఉంది. వేళ్లూనుకున్న ఈ దుర్మార్గానికి రవి అరెస్టు ఆరంభం కాదు.. అంతం అంతకంటే కాదు. అనధికారికంగా సినిమాలను కాపీచేసి, దొంగ మార్గాల్లో అందించే అక్రమార్కులకు సినిమా టికెట్లు ధర పెంచడమే కారణంగా చూపడం విచిత్రం. చిత్ర పరిశ్రమపై ఆధారపడి లక్షలాది మంది బతుకుతున్నారు. నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు నష్టపోతే, సినిమాలు తగ్గుతాయి. ఏంతోమంది ఉపాధి కోల్పోతారు. సమస్య ఈ కోణంలో కాకుండా, సినిమా టికెట్ల ధరలు ఎక్కువగా ఉన్నాయి కాబట్టే ఐబొమ్మ ద్వారా వాటిని ప్రజలకు అందిస్తున్న రవిని 'అభినవ రాబిన్‌హుడ్'గా కొన్ని సోషల్ ప్లాట్‌ఫామ్స్ కీర్తించడం దారుణం. ఒకే హార్డ్ డిస్క్‌లో సుమారు 21,000 సినిమాలను స్టోర్ చేయడం ప్రజలకు మేలు చేయడమా? కనీసం 20 కోట్ల రూపాయలు సంపాదించడం కూడా ప్రజా సేవనేనా? ఒకటి రెండు సైట్లను బ్లాక్ చేస్తే, మరొకటిగా 65కుపైగా డొమైన్లను నడిపించడంలోనూ సంక్షేమమే నిక్షిప్తమై ఉందా? పైరసీతోపాటు ఆన్‌లైన్ బెట్టింగ్ ప్లాట్‌ఫామ్స్‌ను ప్రమోట్ చేయడం కూడా ప్రజాహితమేనా? అత్యవసరంగా ఐది పరాకాష్ట సైబర్ క్రైమ్‌కు పాల్పడిన రవిపై కాపీరైట్, ఐటి యాక్ట్ కింద పెట్టిన కేసులు ఎంత వరకూ నిలబడతాయో చూడాలి. చట్టంలోని లొసుగులను ఉపయోగించుకొని అతను బయటపడితే, సినీ పరిశ్రమను కొల్లగొట్టే వందల మంది 'రవి'లు తయారౌతారు. ఐబొమ్మ నిర్వాహకుడి డొమైన్లకు కనీసం 50లక్షల మంది సబ్‌స్క్రైబర్లు ఉండడం పైరసీ ఏ స్థాయిలో వేళ్లూనుకుందో స్పష్టం చేస్తున్నది. కరేబియన్ దీవుల్లో ఉంటూ, విదేశీ వెబ్‌హోస్టింగ్స్ ద్వారా నేరాలకుపాల్పడుతున్న అతనికి ఎవరూ ఏమీ చేయలేరన్న ధీమా..అందుకే, భారీ మోసం.. ప్రజాహితం పేరుతో పైరసీ వ్యాపారం. వేలాదిమంది కష్టాన్ని, బతుకు పోరాటాన్ని దోచుకుంటున్న వైనం.

రవి అరెస్టు వ్యవస్థల్లోని లోపాలను కూడా బయటపెట్టింది. డిజిటల్ రైట్స్ మేనేజ్‌మెంట్ వ్యవస్థల్లోని లొసుగులు అతనికి ఉపయోగపడ్డాయి. వివిధ వ్యవస్థల్లో నరనరాన పాకిపోయిన అక్రమాల విశ్వరూపం బయటపడింది. కొద్ది మంది మోసకారులు చేస్తున్న ఇలాంటి పైరసీల కారణంగా ప్రపంచంలోనే అతిపెద్ద చిత్ర పరిశ్రమల్లో ఒకటైన టాలీవుడ్ అనేక నష్టాలు ఎదుర్కొంటున్నది. ఎంతోమంది యూజర్ల డేటా కొంతమంది నేరగాళ్ల చేతికి చేరడం సైబర్ భద్రతకు పొంచి ఉన్న ముప్పును సూచిస్తున్నది. పైరసీ సైట్లను ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లతో కలిపి ఆదాయాన్ని పెంచుకోవడం, వినియోగదారులను మోసం చేయడం ప్రమాద ఘంటికలను మోగిస్తున్నది. కొత్త సినిమాలు థియేటర్లు లేదా ఓటిటి ప్లాట్‌ఫామ్స్‌కు వచ్చే ముందే ఐబొమ్మ వంటి ప్లాట్‌ఫామ్స్‌లో వాటిని ఉంచడం పరిశ్రమ ఉనికికే ప్రశ్నిస్తున్నది. డిజిటల్ డిస్ట్రిబ్యూషన్, స్ట్రీమింగ్, క్లౌడ్ సర్వర్లు ఉన్న సేవల్లో, ఏకకాలంలో పెద్ద పరిమాణంలో సినిమాలను హ్యాక్ చేయడం, అప్‌లోడ్ చేయడం ఈ వ్యవస్థలో ఉన్న బీకర కోణాలను చూపెడుతున్నాయి. యుద్ధ ప్రాతిపదికన చర్యల అవసరాన్ని గుర్తుచేస్తున్నాయి. అయితే, ప్రపంచవ్యాప్తంగా అన్ని పైరసీ వెబ్‌సైట్లను వెంటనే బ్లాక్ చేయడం కష్టం. డొమైన్ మార్పులు, వివిధ దేశాల్లో హోస్టింగ్, విపి అన్ మార్గాలు ఈ సమస్యను మరింత క్లిష్టతరం చేస్తున్నాయి. మరోవైపు 'పైరసీ' సులభమైన మార్గంలో భారీ ఆదాయాన్ని అర్జించే వనరుగా మారుతున్నది. కొత్త సినిమాలను ఉచితంగా చూడవచ్చన్న జనాల పేరాశ పైరసీని పెంచిపోషిస్తున్నది. లాగిన్ యూజర్లు, యాడ్స్ ద్వారా, బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్ తదితర మార్గాల ద్వారా అక్రమార్జనలకు సహకరిస్తున్నది. తమ వ్యక్తిగత డేటా నేరగాళ్ల చేతికి వెళితే, రాబోయే భయానక సమస్యలపై అవగాహన పెరిగితే తప్ప, ఇలాంటి పైరసీ డొమైన్లకు తెర పడదు. ఇప్పుడు, ఐబొమ్మ వంటి పెద్ద నెట్‌వర్క్ నిర్వాహకుడి అరెస్టు ఇతర సైబర్ నేరాగాళ్లకు హెచ్చరిక. పైరసీని పెంచి పోషిస్తున్న వారికి జాగ్రత్తగా ఉండాలన్న సూచన. అంతర్జాతీయ సర్వర్లు, మిర్రర్ సైట్లను ఉపయోగించే ముఠాల ఆటకట్టించడానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రయత్నాలు అవసరం. బలమైన కేసులు పెట్టడం ద్వారా, పైరసీకి వ్యతిరేకంగా చట్టపరమైన చర్యలను కఠినతరం చేయవచ్చు. ఐబొమ్మ నిర్వాహకుడి అరెస్టు మీడియాలో సంచలనంగా మారిన నేపథ్యంలో, పైరసీ సినిమాలను చూడడం లేదా ప్రోత్సహించడం అటు పరిశ్రమకు, ఇటు వ్యక్తిగత గోప్యతకు ఎంత నష్టమో ప్రజలకు తెలియజేయాలి. అడు మారితేగాని, పైరసీ ఆగదు. రవి అరెస్టు మార్పుకు శ్రీకారం కావాలి. చిత్ర పరిశ్రమ నిలబడాలి. దానిపై ఆధారపడిన వేలాది కుటుంబాలకు మేలు జరగాలి. అత్యంత క్లిష్టమైన ఆపరేషన్స్‌తో ముడివడిన అతిపెద్ద పైరసీ నెట్‌వర్క్ సూత్రధారిని కటకటాల్లో పెట్టిన హైదరాబాద్ సైబర్‌సెల్ పోలీసులు అభినందనీయులు.

# నేటి సామ్రాజ్యవాదం కొత్తరూపాలు – మన పోరాటం


డి.రాజా
ప్రధాన కార్యదర్శి, సిపిఐ

నేటి సామ్రాజ్యవాదానికి సాంప్రదాయక అర్థంలో ఇంకెంతమాత్రమూ వలస ప్రాంతాలు అక్కర్లేదు. అది ఫైనాన్స్, డేటా, టెక్నాలజీ నెట్‌వర్క్‌ల ద్వారా పరిపాలిస్తుంది – అవి పెట్టుబడి కూడబెట్టటమనే తర్కానికి దేశాలను నిబద్ధం చేసే అగోచర సంకెళ్లు. ప్రచ్ఛన్నయుద్ధ అస్థికల నుండి ఆవిర్భవించిన ప్రపంచం ప్రపంచీకరణ, నయా ఉదారవాదం బ్యానర్‌కింద అనంతమైన సౌభాగ్యాన్ని తప్పుగా వాగ్దానం చేసింది. అందుకు బదులుగా మనకు లెనిన్ గుర్తించిన ప్రపంచం వెనువెంటనే గుర్తుకు వస్తుంది : అది ''గుత్తపెట్టుబడిదారులు, ద్రవ్యపెట్టుబడి ఆధిపత్యం వహించే ప్రపంచం; లాభార్జనే ఏకైక సూత్రంగా కలిగిన కొద్ది ప్రభుత్వాల మధ్య విభజించబడిన ప్రభుత్వం''. ఎదురులేకుండా మూడు దశాబ్దాలపాటు ఆధిపత్యం చెలాయించిన అమెరికా సంయుక్త రాష్ట్రాలు ఇప్పుడు ఆ ఆధిపత్యం క్షీణింపును వెనక్కు మళ్లించలేని స్థితిని ఎదుర్కొంటున్నది. అయితే అంతకుముందున్న ప్రతి ఒక్క సామ్రాజ్యంలాగే అది తన అధికారాన్ని హుందాగా వదులుకోవటానికి తిరస్కరిస్తున్నది. డాలర్, నాటో, ఐఎంఎఫ్ ద్వారా విధేయతను విధించిన ఏక ధృవ ప్రపంచం దానిలోని వైరుధ్యాలతో కూలిపోతున్నది. దాని స్థానంలో బహుళ ధృవ కూర్పు ఆవిర్భవిస్తున్నది. బ్రిక్స్ బ్లాక్ అతి స్పష్టంగా దానికి ప్రాతినిధ్యం వహిస్తున్నది – అమెరికన్ పెత్తనంతో అలిసిపోయిన ప్రపంచంనుండి చారిత్రక అవసరంగా ఉద్భవించింది బ్రిక్స్.

అమెరికా సామ్రాజ్యవాదం బరితెగింపు ప్రతి చోట – అది విధించే ఆంక్షల్లో, వాణిజ్య యుద్ధాల్లో, సైనిక దిగ్బంధనాల్లో కనిపిస్తున్నది. డోనాల్డ్ ట్రంప్ సుంకాలను ఆయుధాలుగా మార్చటం ''స్వేచ్ఛా వాణిజ్యం'' ఒక ఎత్తుగడ తప్ప ఎన్నడూ ఒక సూత్రం కాదని వెల్లడిస్తున్నది. అమెరికా – ఒకప్పుడు గన్‌బోట్లను ప్రయోగించినట్లుగా ఇప్పుడు ఆర్థిక బలాత్కారాన్ని ఉపయోగిస్తున్నది. వాషింగ్టన్ ఇప్పటికీ బెదిరించగలదు, కాని ఎంతమాత్రం ఆదేశించలేదు. బ్రిక్స్ గ్రూపులో వృద్ధి చెందుతున్న సఖ్యత (పశ్చిమాసియా, ఆఫ్రికన్ రాజ్యాలను చేర్చుకుంటూ ఇప్పుడది విస్తరించబడింది) ఏకధృవ ప్రపంచకాలం ముగిసిందని సంకేతిస్తున్నది. ప్రపంచం రాజ్యాల బహుళ సమతౌల్యం దిశగా ప్రయాణిస్తున్నది. ఈ పరివర్తన గందరగోళంగా ఉన్నప్పటికీ అందులో విప్లవాత్మక శక్తి సామర్థ్యాలున్నాయి.

''తన ఉత్పత్తి సాధనాలను నిరంతరం విప్లవీకరించకుండా బూర్జువావర్గం మనజాలదు'' అని మార్క్స్ ఒకప్పుడు అన్నారు. ఇది సాంకేతిక విజ్ఞానరంగంలో కన్నా మరెక్కడా సత్యం కాజాలదు. కృత్రిమ మేధ(ఎఐ), ఆటోమేషన్, బయోటెక్నాలజీ, డిజిటల్ నెట్‌వర్క్‌లు పుష్కలత శకాన్ని వాగ్దానం చేస్తున్నాయి – అయినా అవి అసమానతను మరింత పెంచుతున్నాయి, సామాజికంగా ఛిన్నాభిన్నం చేస్తున్నాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ కింద టెక్నాలజీ మానవ అవసరాలను నెరవేర్చదు, లాభార్జనకు ఉపకరిస్తుంది. సాంకేతికవిజ్ఞాన శక్తి కొద్దిపాటి అమెరికా కంపెనీల్లో కేంద్రీకృతం కావటం (ఉదాః గూగుల్, యాపిల్, అమెజాన్, మెటా, మైక్రోసాఫ్ట్) లెనిన్ కాలం నాటి ద్రవ్య గుత్తసంస్థలను ప్రతిబింబిస్తున్నది. ఈ కంపెనీలు డిజిటల్ యుగంలో కొత్త ఈస్ట్ ఇండియా కంపెనీలు అవుతున్నాయి. అవి సుగంధ ద్రవ్యాలు లేదా పత్తి రాబట్టుకోవు, 21వ శతాబ్దం ముడిపదార్థమైన డేటాను బిలియన్‌లాది ప్రపంచవ్యాప్త వినియోగదారులనుంచి రాబట్టుకుంటాయి. ప్రపంచ మానవాళి సమష్టిగా ఈ డిజిటల్ శ్రమ ద్వారా ఉత్పత్తి చేసిన సంపద సిలికాన్ వ్యాలీలో కేంద్రీకరించిన కొద్దిపాటి సంపన్నుల వద్దకు ప్రవహిస్తుంది.

వైచిత్రి కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది : టెక్నాలజీ అభివృద్ధి చెందే కొలది మెజారిటీ శ్రమజీవుల ఉపాధి సందిగ్ధమవుతున్నది. పనిగంటలు తగ్గించటం లేదా జీవన ప్రమాణాల పెంపుదలకు బదులు డిజిటల్ పెట్టుబడిదారీ వ్యవస్థ నిఘా విస్తరిస్తున్నది, తొలగింపును ఆటోమేట్ చేస్తున్నది, సామాజిక భద్రతలను హరిస్తున్నది. గిగ్ వర్కర్స్ ఆహారం డెలివరీ చేస్తారు, సాఫ్ట్‌వేర్ కోడింగ్ చేస్తారు, ఆన్‌లైన్ సమాచారాన్ని అమరిక పరుస్తారు, అయినా వారు మనకు కనిపించరు, ఎప్పుడైనా ఉద్యోగం నుంచి తొలగించబడతారు. మార్క్స్ చెప్పినట్లు, ఈ ''శ్రామిక రిజర్వు ఆర్మీ'' యాప్ ఆర్థిక వ్యవస్థలో కొత్త జీవితం కనుగొంటారు – తక్కువ వేతనాలకు పనిచేసే కార్మికులు అపారంగా బటన్ నొక్కగానే దోపిడీకి శాశ్వతంగా లభ్యమవుతారు. బూర్జువా ఆర్థిక వేత్తలు ''డిజిటల్ ఎకానమీ'' అని పిలుస్తున్న దాని అసలు ముఖం ఇదీ. అది ప్రజలకోసం విప్లవం కాదు, వారికి వ్యతిరేకమైనది.

గ్లోబల్ సౌత్‌లో (వెనుకబడిన దేశాలని అర్థం) ముఖ్యంగా దక్షిణాసియాలో ఈ సాంకేతిక విజ్ఞాన వ్యవస్థ పరాధీనతను పునరుత్పత్తి చేస్తుంది. ''డిజిటల్ పరివర్తన'' అని ఈ ప్రాంతానికి చేసే వాగ్దానానికి అర్థం టెక్నాలాజికల్ మౌలిక సదుపాయాల ద్వారా సామ్రాజ్యవాద నియంత్రణ విస్తరణ. పశ్చిమదేశాలు, బహుళజాతి గుత్త పెట్టుబడిదారులు ఇప్పుడు ఎక్కువగా ప్రమాణాలను, సొంత ప్లాట్‌ఫారంలను ఆదేశిస్తున్నారు. డేటా ప్రయాణాన్ని నియంత్రిస్తున్నారు. దిగుమతి చేసుకున్న హార్డ్‌వేర్‌పై, వారికి యాజమాన్య హక్కులున్న సాఫ్ట్‌వేర్‌పై, విదేశీ పెట్టుబడిపై ఆధారపడటం లేబర్ లోకల్ అయినప్పటికీ, మిగులు విలువ గ్లోబల్ అవుతుంది. ఈ అర్థంలో, డిజిటలైజేషన్ శ్రమ యొక్క వలసవాద విభజనను రద్దు చేయలేదు, మరింతగా పెంపు చేసింది.

ఈ వైరుధ్యానికి భారత్ పాఠ్యగ్రంథ నమూనా అందిస్తున్నది. తమది ఐటి పవర్‌హౌస్ అని, స్టార్టప్‌ల భూమి అని, సాఫ్ట్‌వేర్ జైంట్స్ అని దేశం గొప్పలు చెప్పుకుంటున్నది. ఈ మెరుపు కింద వాస్తవికత దాగి ఉంది. లెనిన్ ఉన్న ఫళాన గుర్తించినట్లు అది నిజమైన ఆవిష్కరణకన్నా చౌక, బలహీనమైన శ్రమపై ఆధారపడిన పెట్టుబడిదారీ నిర్మాణ స్వరూపం. ''నవభారత్''కు ప్రతీకగా వేడుక చేసుకుంటున్న స్టార్ట్ అప్ పర్యావరణ పశ్చిమ కార్పొరేషన్‌లకు పొరుగు సేవలందించే తక్కువ వేతనాలకు లభ్యమయ్యే ఇంజినీర్లు, డేటా వర్కర్స్‌లపై దాదాపు పూర్తిగా ఆధారపడినట్టిది. భారత టెక్నాలజీ సంస్థలు జాతీయ పరివర్తనకు ఇంజిన్‌లుగా కాకుండా ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థకు బ్యాక్–ఆఫీసులుగా ఉపకరిస్తున్నాయి. వాటి లాభాల్లో ఎక్కువ భాగం భారతదేశ సొంత సమస్యలైన ప్రజారోగ్యం, గ్రామీణ మౌలిక వసతులు లేదా పర్యావరణ సంబంధ సంక్షోభం వగైరాలను పరిష్కరించే స్వదేశీ టెక్నాలజీని అభివృద్ధి చేయటం ద్వారా గాక, శ్రామికులను అందించటం ద్వారా ఆర్జిస్తున్నాయి.

ఫలితం పురోభివృద్ధిని అపహాస్యం చేస్తున్నది : భారతదేశం ప్రపంచంలోనే అత్యంత నిపుణులైన ప్రోగ్రామర్లు కొందరిని ఉత్పత్తి చేస్తున్నది. కాని దాని గ్రామాలు త్రాగునీటి కొరత ఎదుర్కొంటున్నాయి, నగరాలు కాలుష్యం కింద కూలుతున్నాయి. ''డిజిటల్ ఇండియా'' నినాదం ఒక లోతైన సత్యాన్ని దాచిపెడుతున్నది. టెక్నాలజీ విముక్తి శక్తిగా పనిచేసే బదులు, ప్రస్తుతమున్న అసమానతలను మరింత పెంచటానికి ఉపయోగించబడుతున్నది. సాధికారీకరణను వాగ్దానం చేస్తున్న ప్లాట్‌ఫాంలు సంశయాత్మకతను పాదుకొల్పాయి; ఆటోమేషన్ ఉద్యోగాలకు ముప్పు తెస్తున్నది, చదువు వాటిని భర్తీ చేయలేనంత వేగంగా తొలగిస్తున్నది. కార్పొరేట్ గుత్త పెట్టుబడి సంస్థలు ఆధిపత్యం వహిస్తున్న పాలకవర్గం ప్రపంచ ఫైనాన్స్‌తో చేతులు కలిపింది. అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడిదారులు టెక్నాలజీ విజయాలతో ఉత్సవాలు చేస్తున్నారు. అయితే దానివల్ల లాభపడిందెవరన్న ప్రశ్నను తొక్కిపెడుతున్నారు. మార్క్స్ ఇలా అన్నారు.. ''ఉత్పత్తి శక్తులు కొద్దిమంది ఆస్తిగా ఉన్నంతకాలం ఆ శక్తుల అభివృద్ధి మానవాళి అభివృద్ధి కాబోదు''.

వెనుకబాటుతనానికి చికిత్సగా 1991లో భారతదేశంలో ప్రవేశించిన నయా ఉదారవాదం సౌభాగ్యం ఉత్పత్తి చేయకపోగా విభజన తెచ్చింది. హిందుత్వతో దాని వివాహం కార్పొరేట్ లాభాపేక్షతో మత ఛాందసాన్ని కలగలిపిన ఒక సంకర వ్యవస్థను సృష్టించింది. మోదీ ప్రభుత్వ ఆత్మనిర్భర్ భారత్ వాగాడంబరం విదేశీ పెట్టుబడిపై విపరీతంగా ఆధారపడటాన్ని దాచిపెడుతున్నది, లఘుపరిశ్రమలను అంతరింపజేస్తున్నది. లేబర్‌కోడ్‌లు, ప్రభుత్వ ఆస్తుల ప్రైవేటీకరణ, వ్యవసాయాన్ని కార్పొరేట్‌లు స్వాధీనం చేసుకోవటం–ఇవన్నీ ఒకే తర్కం నుంచి వస్తున్నాయి. అదేమంటే, భారతదేశాన్ని దాని ప్రజలకు కాకుండా పెట్టుబడికి సురక్షితం చేయటం, ఎంతో ప్రశంసించబడిన ''మేక్ ఇన్ ఇండియా'' ప్రచారం కూడా చౌక శ్రమను, బలహీనమైన పర్యావరణ చట్టాలను అనువుగా వాడుకోవడానికి బహుళజాతి కార్పొరేషన్‌లకు ఆహ్వానంగా మారింది. అందువల్ల భారతదేశంలో సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటాన్ని ప్రపంచ పెట్టుబడికి స్థానిక ఏజెంటుగా పనిచేస్తున్న దేశీయ బూర్జువా వర్గానికి వ్యతిరేకంగా పోరాటంనుంచి వేరుచేయలేము. బ్రిక్స్‌లో, ఇతర బహుళధృవ వేదికల్లో భారత్ పాల్గొనటం వ్యూహాత్మక స్వయంప్రతిపత్తికి (స్ట్రాటజిక్ అటానమీ) నూతన అవకాశాలు ఆవిష్కరిస్తున్నది. అయితే సోషలిజం లేని స్వయంప్రతిపత్తి పరాధీనతను ఒక యజమాని నుంచి మరొక యజమానికి మార్చడం మాత్రమే చేస్తుంది. కార్మికవర్గం అంటే ఏమిటో రైతాంగం, స్వాతంత్ర్యం నిర్వచించాలి. అది కేవలం ప్రపంచ శిఖరాగ్రసభల్లో సీటు కాకూడదు, జాతీయ వనరులు, టెక్నాలజీ, శ్రమపై ఆజమాయిషీగా ఉండాలి. ఉత్పత్తి భావనను అనగా ప్రైవేటు లాభంకోసంగాక స్థానిక అవసరం ప్రకారం జరిగే ఉత్పత్తి అనే భావనను వామపక్షం తిరిగి సొంతం చేసుకోవాలి.

ప్రపంచవ్యాప్తంగా, బహుళధృవ ప్రపంచం వృద్ధి చెందటం ఆటోమేటిక్‌గా దోపిడీని అంతం చేయదు. ప్రపంచ ప్రగతిశీల శక్తులు సోషలిస్టు ప్రత్యామ్నాయం చుట్టూ ఐక్యం కాగలిగితే అది దాన్ని అనుభవంలోకి తెచ్చేందుకు అవసరమైన పరిస్థితులు సృష్టిస్తుంది. లెనిన్ హెచ్చరిక ప్రవక్త బోధలా ఉంది: ''పీడకులకు సహాయపడేటటువంటి పీడిత దేశాల బూర్జువా వర్గంలేనిదే సామ్రాజ్యవాదం నిర్జీవమవుతుంది.'' ఈనాడు పోరాట రేఖలు తూర్పు–పశ్చిమం మధ్య కాదు; పెట్టుబడి–శ్రమ మధ్య, టెక్నాలజీపై గుత్తాధిపత్యం కలిగిన వారికీ – ఎవరి శ్రమ అయితే దాని మనుగడను నిలబెడుతుందో వారికీ మధ్యన.

ఈ చారిత్రక అధిక స్రావాన్ని చైతన్యయుతమైన పోరాటంగా పరివర్తన గావించటం కమ్యూనిస్టు ఉద్యమ కర్తవ్యం. సామ్రాజ్యవాదం నూతన రూపాలను – డిజిటల్, ఫైనాన్షియల్, పర్యావరణం మనం బట్టబయలు చేయాలి, సరిహద్దులకు అతీతంగా కార్మికుల మధ్య సంఘీభావం నిర్మించాలి. కీలకమైన టెక్నాలజీలపై ప్రభుత్వ స్వామ్యం (ఓనర్‌షిప్) కోసం, డేటాపై ప్రజాస్వామిక నియంత్రణ కోసం, ఆవిష్కరణల సామాజీకరణ కోసం మనం పోరాటం చేయాలి. ఆటోమేషన్, కృత్రిమ మేధ వాగ్దానం పెట్టుబడి యొక్క లాభం కన్నా మానవ అవసరాలకు టెక్నాలజీ ఉపయోగపడే సోషలిజం కింద మాత్రమే నెరవేరుతుంది. ''ప్రతి ఒక్కరి స్వేచ్ఛాయుత అభివృద్ధి అందరి స్వేచ్ఛాయుత అభివృద్ధికి షరతు'' అన్న మార్క్స్ ప్రకటన నినాదంగా కాకుండా కార్యక్రమం కావాలి. అమెరికా ఆధిపత్య సంజవెలుగు మానవాళికి కొత్త ఉషోదయాన్ని ఆవిష్కరిస్తున్నది. అయితే ఉషోదయమే పగటి వెలుగు కాదు. బహుళ ధృవ ప్రపంచం పోటీపడుతున్నపెట్టుబడిదారీ వ్యవస్థలకు రణరంగమైనా అవుతుంది లేదా నూతన అంతర్జాతీయ వ్యవస్థకు జన్మస్థానమైనా అవుతుంది. రెండవ దాన్ని సాధించటానికి కార్మిక వర్గం నాయకత్వం వహించాలి. మార్క్స్, ఏంగెల్స్‌లు 1848లో నిర్ధారించినట్లు, మనం జయించటానికి ఒక ప్రపంచమే ఉంది. నేడు ఆ ప్రపంచంలో టెక్నాలజీని తీర్చిదిద్దే హక్కు, దాని ఫలాలను సమానంగా పంచుకునే హక్కు, సామ్రాజ్యవాదం తన పాత, కొత్త రూపాలన్నిటి లో మానవాళిపై విధించటం కొనసాగిస్తున్న దోపిడీని అంతం చేసే హక్కు చేరి ఉన్నాయి.

## ఆరోగ్యశాఖకు అధిక నిధులు కేటాయించాలి

లేఖ

సరసమైన ధరలకు మంచి ఆరోగ్య సంరక్షణ, సౌకర్యవంతమైన జీవితం పొందడం సమాజంలోని ప్రతి పౌరుని హక్కు. ఈ హక్కు పొందాలంటే నగరాలు, గ్రామీణ ప్రాంతాలు, మారుమూల ప్రాంతాలలో తగినంత సంఖ్యలో ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాలు ఉండాలి. తగినంత సంఖ్యలో వైద్యులు, నర్సులు, ఇతర ఆరోగ్య కార్యకర్తలు, అవసరమైన వైద్య పరికరాలు, సౌకర్యాలు, మందులు ఉండాలి. ఆరోగ్య సంరక్షణ ప్రదాతలైన వైద్యులు, నర్సులు, పారామెడికల్ కార్మికుల కు సురక్షితమైన జీవనోపాధి, సురక్షితమైన పని పరిస్థితులు, గౌరవప్రదమైన జీవన వేతనం, పెన్షన్ మొదలైనవి కలిగి ఉండాలి. అయితే వాస్తవం చాలా భిన్నంగా ఉంది. వైద్య సదుపాయాల హామీ ఇస్తున్న అత్యాధునిక ప్రైవేట్ ఆసుపత్రులలో సామాన్య ప్రజలకు అందుబాటులో లేని ఫీజులు ఉన్నాయి, ప్రభుత్వ ఆసుపత్రులలో అంతులేని క్యూలు, కిక్కిరిసిన వార్డులు, తగినంతగా లేని పడకలు, మందుల కొరత ఉండి దయనీయ పరిస్థితులు ఉన్నాయి. అక్కడి వైద్యులు, నర్సులు ఆరోగ్య కార్యకర్తలు ప్రమాదకరమైన పని పరిస్థితులలో పనిచేస్తున్నారు. ఆశా, అంగన్‌వాడీ, వంటి వివిధ ప్రభుత్వ పథకాల కింద పనిచేసే ఆరోగ్య కార్యకర్తలు దేశంలోని మారుమూల ప్రాంతాల ప్రజలకు ఆరోగ్య సంరక్షణ సేవలను అందిస్తున్నారు. అయినప్పటికీ వారిని కార్మికులుగా గుర్తించుటలేదు. కొన్ని రాష్ట్ర ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో, నర్సులు 10 సం.కు పైగా కాంట్రాక్టు పద్ధతిలో నెలకు కేవలం రూ. 15,000; 18,000 జీతంతో పనిచేస్తున్నారు.. వారిలో చాలా మంది ఒకేసారి 100 కంటే ఎక్కువమంది రోగులను చూసుకోవాల్సి వస్తుంది, వారికి పెన్షన్ లేదు, బీమా సౌకర్యం లేదు. రోగులు ఎక్కువ గంటలు వేచి ఉండటం, పేలవమైన ఆరోగ్య సంరక్షణ సేవలతో, కోపంతో నిరాశకు గురవుతూ వారి బాధితులైన వైద్యులు, నర్సులపై ఆవేశం వెళ్ళగక్కుతున్నారు. ప్రభుత్వం ప్రజారోగ్యశాఖకు అధిక నిధులు కేటాయించడంవలన వైద్య సిబ్బంది జీతభత్యాలతో పాటు ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించవచ్చు.

ఆళవందార్ వేణు మాధవ్

## సమాజ అభ్యుదయ కవి 'ఆవంత్స'



ఆవంత్స సోమసుందర్ అభ్యుదయ కవి, విమర్శకుడుగా పేరు పొందారు. తెలంగాణ సాయుధ పోరాటాన్ని కోస్తా ప్రాంతం నుండి సమర్థించి కవిత్వం వెలువరించిన నిష్పక్షపాత వ్యక్తిత్వం ఆయనది. ''ఖబడ్దార్ హే నిజాం పాదుషా – ఒక వీరుడు మరణిస్తే వేలకొలది ప్రభవింతురు'' అని గర్జించిన సాహసి. ఆయన జీవితమే కవిత్వం అని నమ్మి, జీవితాన్నే కవిత్వానికి అంకితం చేసిన వ్యక్తి. కవిగా, కథకుడిగా, నవలా రచయితగా, నాటక కర్తగా, అనువాదకుడిగా భిన్న రూపాలతో సాహితీ సేవ చేసారు.

2004లో ఈయన రచించిన అక్షర నాదం అనే కవితా సంపుటిలోని కొన్ని పద చిత్రాలను గమనించినట్లయితే ఈయన ప్రతిభ, ఈయన ఏ విధంగా రెండు తరాలకు వారధిగా ఉన్నారనే విషయం సుస్పష్టమౌతుంది.

*గ్లోబలైజేషన్ తో ఈ భూమి రజస్వలై*
*నవవరాన్వేషణలో మిటకరిస్తుంది......*
*హ్యూమన్ జెనిటిక్ ఇంజనీరింగ్ తో*
*అవతరించిన క్లోనింగ్ కోడె దూడ*
*'అంబా' అని అరవడం*
*గ్రాంధికమని నిషేధిస్తుంది. .........* (నేటిని ఏటికి విడిచి అనే కవిత నుంచి )

'వజ్రాయుధం' నుండి 'ఆమ్రపర్ణి' వరకూ సుమారు ఆరున్నర దశాబ్దాల పాటు సోమసుందర్ చేసిన కవితాయానంలో సమాజ సంకుల సమరమే అన్ని కోణాల్లోనూ ప్రతిబింబిస్తుంది. ఈ కవి మానవుని విస్మరించి, ఆకాశంలో విహరించిన సందర్భాలు కనపడవు.

సోమసుందర్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అన్నవరం సమీపంలో ఉన్న శంఖవరం అనే గ్రామంలో కాళ్ళూరి సూర్యప్రకాశరావు, వెంకాయమ్మ దంపతులకు 1924, నవంబరు18న ఎనిమిదవ సంతానంగా జన్మించారు. ఆయన ప్రాథమిక విద్యాభ్యాసం అంతా పిఠాపురంలోనే జరిగింది.

1943లో పెద్దాపురం ఎమ్. ఆర్.కళాశాలలో చేరి, ఉన్నత విద్యనభ్యసించారు. సోమసుందర్ క్విట్ ఇండియా ఉద్యమంలో చురుకుగా పాల్గొని, 1942లో విద్యార్థులను కూడదీసి బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సమ్మె చేశానని చెప్పేవారు.

సోమసుందర్ స్వాతంత్ర్య పోరాటంలో విద్యార్థి నాయకుడిగా, కమ్యూనిస్టు పార్టీ సభ్యునిగా 1954 వరకూ కార్యక్రమాలలో క్రియాశీలక పాత్ర పోషించారు. రాజకీయాలు, సాహిత్య వ్యాసంగం ఏకకాలంలో నిర్వహించటం సాధ్యం కాదని భావించి రాజకీయాలకు స్వస్తి పలికాడు. సోమసుందర్ నాలుగో ఫారం చదువుతున్న రోజుల్లో పద్య ప్రక్రియపై ఆసక్తి కలిగి, ఛందస్సును క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. 1943 వరకూ కూడా భావకవిత్వం ఈయనకు తారసపడలేదు. తరువాత తనదైన వచనా శైలిని అలవరచుకున్నారు. సోమసుందర్ కవిత్వంలో కమ్యూనిస్టు భావజాలం అంతర్లీనంగా జాలువారింది. ఆయన 2016, ఆగస్టు 12వ తేదీన కాకినాడలో మరణించారు.

(నవంబర్ 18 సోమసుందర్ జయంతి)

ఎం. రాం ప్రదీప్

## యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్– నిశ్శబ్ద విపత్తులో ప్రపంచం

అతి ప్రధానమైన 10 ప్రజారోగ్య సమస్యల్లో యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఎఎంఆర్) లేదా యాంటీమైక్రోబియల్ నిరోధకతను ఒకటి గా గుర్తించడంతో 2005 నుంచి ఐరాస ప్రతి ఏట 1824 నవంబర్ రోజుల్లో వరల్డ్ యాంటీమైక్రోబియల్ అవేర్‌నెస్ వీక్ లేదా ప్రపంచ యాంటీమైక్రోబియల్ అవగాహన వారం పాటించుట ఆనవాయితీగా మారింది. బాక్టీరియా, వైరస్, ఫంగీ, పరాన్నజీవులు లాంటి సూక్ష్మ జీవులు కలిగించే సాంక్రమిక వ్యాధులను త్వరగా, సమర్థవంతంగా నయం చేయడానికి యాంటీమైక్రోబియల్ ఔషధాలను వాడుట అలవాటు అయ్యింది. కాలానుగుణంగా సూక్ష్మ జీవుల్లో వస్తున్న మార్పులతో యాంటీమైక్రోబియల్ డ్రగ్స్‌పట్ల సూక్ష్మ జీవులు నిరోధకతను పెంచుకొని, ఆ ఔషధాలకు రోగ కారక సూక్ష్మ జీవులు లొంగకుండా మొండికేయడంతో అంటువ్యాధుల చికిత్సలకు అవాంతరాలు ఏర్పడి ప్రాణాంతక స్థితులకు చేరడంతో పాటు మరో నిశ్శబ్ద విపత్తు ఏర్పడుతున్నదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ ప్రమాదకర విపత్తు వల్ల ఏడాదికి 70లక్షల మంది ప్రాణాలు కోల్పోవడం, ఈ సంఖ్య 2050 వరకు 10 మిలియన్లకు చేరవచ్చని హెచ్చరిస్తున్నారు. ప్రపంచ ఎఎంఆర్ సమస్య ఆసియా, ఆఫ్రికా దేశాల్లోనే 90 శాతం వరకు విస్తరించిందని నిర్ధారణ అవుతున్నది.




ఎఎంఆర్ పెరగడానికి ప్రధాన కారణాలుగా విచక్షణారహితంగా అధిక మోతాదులో ఆంటీమైక్రోబియల్ డ్రగ్స్ వాడడం, సురక్షిత నీటి కొరత, పారిశుద్ధ్యం సమస్యలు, వ్యక్తిగత పరిశుభ్రత లాంటి అవలక్షణాలతో మానవాళే కాకుండా జంతువులు, వ్యవసాయ పంటలు ప్రమాదంలో పడుతున్నాయి. 2000–15 మధ్యకాలంలో ఆంటీమైక్రోబియల్ డ్రగ్స్ వాడకం 65 శాతం వరకు పెరుగగా, 2030 నాటికి 200 శాతం పెరగవచ్చని అంచనా వేస్తున్నారు. అలాగే 2017–30న మధ్య జంతు చికిత్సలకు వాడే యాంటీబయోటిక్స్ 12 శాతం పెరగవచ్చనే అశుభ వార్తలు వింటున్నాం.

ప్రపంచ యాంటీమైక్రోబియల్ అవగాహన వారం–2025 థీమ్‌గా ఇప్పుడే నడుం బిగిద్దాం: వర్తమానాన్ని పరిరక్షించుకుందాం, భవిష్యత్తును భద్రపరుద్దాం (ఆక్ట్‌నౌ : ప్రొటెక్ట్ అవర్ ప్రజెంట్, సెక్యూర్ అవర్ ఫ్యూచర్) అన బడే అంశాన్ని తీసుకొని అవగాహన కల్పిస్తున్నారు. ఎఎంఆర్ పట్ల అవగాహన కల్పించడానికి పౌరసమాజం, ప్రభుత్వ యంత్రాంగం, వెటర్నరీ విభాగం, రైతులు, ఫార్మసిస్టులు, విద్యావేత్తలు, యువజన సంఘాలు, సీనియర్ సిటిజన్స్, వ్యవసాయ శాఖల సమన్వయంతో కృషి చేయాల్సి ఉంది. కరోనా విపత్తు సమయంలో అధిక శాతం రోగులకు యాంటీబయాటిక్ ఔషధాలను విచక్షణారహితంగా, అధిక మోతాదులో వాడడంతో నేడు దాని దుష్ప్రభావాలు నేడు తీవ్రరూపం దాల్చడం, తీవ్ర అనారోగ్యాలు కలగడంతో పాటు ప్రాణాలు సైతం పోవడం చూస్తున్నాం. గత ఎనిమిది దశాబ్దాలుగా యాంటీమైక్రోబియల్ ఔషధాలను విరివిగా వాడి రోగాలను నయం చేసే ప్రయత్నాలు చేయడంతో ఆ డ్రగ్స్ పట్ల నిరోధకత పెరిగి వాటి ప్రభావం పూర్తిగా తగ్గడం గమనిస్తున్నాం. ఎఎంఆర్ ఫలితంగా సూక్ష్మ జీవుల కారణ సాంక్రమిక వ్యాధులకు చికిత్స కష్టం అవుతున్నది.

రానున్న రోజుల్లో యాంటీబాక్టీరియల్, యాంటీబయాటిక్, యాంటీవైరల్, యాంటీఫంగల్, యాంటీపారాసైటిక్స్ లాంటి ఔషధాలు పని చేయక పోవడంతో, వ్యాధుల కట్టడి వైద్యులకు కష్టం కావడంతో మరో ప్రమాదకర సంక్షోభానికి లేదా విపత్తుకు తలుపులు తెరుచుకుంటున్నాయి. యాంటీమైక్రోబియల్ డ్రగ్స్ పని చేయని యెడల రోగులు/జంతువులు/పంటలు కూడా ప్రభావితం కావడం, పలు సంబంధిత సమస్యలకు దారి తీస్తున్నాయి. వైద్యుల సలహాలు తీసుకోకుండా యాంటీమైక్రోబియల్ డ్రగ్స్ వాడరాదు. యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్‌ను అదుపు చేయడానికి చేతులు శుభ్రంగా కడుక్కోవడం, వ్యక్తిగత శుభ్రత పాటించడం, సురక్షిత నీరు తాగడం, పరిశుద్ధ ఆహారం తీసుకోవడం, టీకాలు తీసుకోవడం, పరిసరాల పరిశుభ్రత, వ్యాధిగ్రస్తులకు దూరంగా ఉండడం, సురక్షిత లైంగిక సంబంధాలు కలిగి ఉండడం లాంటి తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

ఎఎంఆర్ ప్రతికూల ప్రభావంతో ప్రజలు, పశుసంపద, మత్స్యసంపద, పాడి పరిశ్రమ, ఆక్వాకల్చర్, హార్టీకల్చర్, పండ్ల తోటలు, పర్యావరణ వ్యవస్థలు దెబ్బతినే ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి.

యాంటీమైక్రోబియల్ ఔషధాలను వైద్యులు సూచించినట్లుగా విచక్షణతో వాడడం, మోతాదు మించకపోవడం, ఇతర జాగ్రత్తలను తు.చ. తప్పకుండా పాటించడం వల్ల ఎఎంఆర్ అదుపు చేయబడి మానవాళి, జంతువులు, పంటల ఆరోగ్యాలు వర్ధిల్లుతాయి.

(18–24 నవంబర్ : ప్రపంచ 'యాంటీ–మైక్రోబియల్ నిరోధకత'అవగాహన వారం )

## ఆర్థికవృద్ధికి చిరునామాలు... పారిశ్రామికవేత్తలు

ఆర్థిక వృద్ధి, ఉద్యోగ కల్పన, సాంకేతిక ఆవిష్కరణల పురోగతి వెనుక ఉన్న చోదక శక్తి పారిశ్రామికవేత్తలు అని గుర్తించాలి. భారతదేశంలో పారిశ్రామికవేత్తల లేదా వ్యవస్థాపకుల లేదా వ్యాపారవేత్తల లేదా ఎంటర్ప్రూనర్స్ ఆవిష్కరణలు, వారు ప్రదర్శించే మానసిక ధైర్యం, దేశ ఆర్థికాభివృద్ధిలో వారి భాగస్వామ్యం, తమ ఉత్పత్తులతో ప్రజల జీవనశైలిని సులభతరం చేయడం లాంటి ప్రధాన బాధ్యతలను నిర్వహిస్తున్నారు. నూతనంగా స్టార్టప్‌లను స్థాపించి, బాలారిష్టాలను అధిగమించి, సవాళ్లకు సవాళ్లు విసిరి తమదైన శైలిలో పరిశ్రమలను గాడిలో పెట్టి, వందల కుటుంబాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా జీవనోపాధిని కల్పించి, దేశ సుస్థిరాభివృద్ధిలో పాలు పంచుకుంటున్న పారిశ్రామికవేత్తలు దేశానికి వ్యవసాయం తర్వాత స్థానాన్ని ఆక్రమించి, గౌరవ ప్రదంగా సమాజంలో గుర్తింపు పొంది మనకు ఆదర్శంగా నిలుస్తున్నారు. దేశాభివృద్ధిలో పారిశ్రామికవేత్తల పాత్రను గుర్తించిన పౌర సమాజం ప్రతి ఏట 18 నవంబర్ రోజు జాతీయ పారిశ్రామికవేత్త ల దినోత్సవం (నేషనల్ ఎంటర్ప్రూనర్స్ డే) పాటించడం 2010 నుంచి ఆనవాయితీగా మారింది. చిన్న మొత్తంలో పరిశ్రమలను స్థాపించి, వ్యాపారాలను పెంచుకుంటూ, మార్పులకు అనుగుణంగా తాము మారుతూ, భవిష్యత్తు నాయకులకు స్ఫూర్తినిస్తూ, నూతన ఆవిష్కరణలకు పెద్దపీట వేస్తూ, ఆర్థిక సామాజిక ప్రగతిలో మద్దతునిస్తూ ఎంటర్ప్రూనర్స్ శక్తివంతమైన స్థాయికి చేరుతూ, దేశాన్ని అగ్రభాగాన నిలుపుతూ ఎంతో మేలును చేస్తున్నారు.

**శూన్యం నుంచి ఒక సామ్రాజ్య నిర్మాతలు : పారిశ్రామికవేత్తలు:** శూన్యం నుంచి ఒక సామ్రాజ్యాన్ని నిర్మించిన వ్యక్తులు సామాన్యులు కాదు, అసాధారణ ఘనులు అని అభివర్ణించాలి. చిన్న వ్యాపార యజమానుల నుంచి టెక్ స్టార్టప్ వ్యవస్థాపకుల వరకు అందరూ తమ మేధస్సుకు పనిపెట్టి పౌర సమాజ ఆలోచనలకు అనుగుణంగా తమ ఉత్పత్తులను రూపొందిస్తూ మన జీవితాలను సులభతరం చేస్తున్నారు. పారిశ్రామికవేత్తల కీలక సహకారాల్లో ఉద్యోగ ఉపాధుల కల్పన, ఆధునిక సాంకేతిక ఆవిష్కరణలు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థను బలపరచడం, పోటీతత్వాన్ని పెంచడం, పురోగతిలో భాగం కావడం లాంటివి ప్రధాన అంశాలుగా పేర్కొనబడ్డాయి.

**ప్రముఖ పారిశ్రామికవేత్తలు:** ప్రపంచ స్థాయిలో అత్యుత్తమ ఎంటర్ప్రూనర్స్ జాబితాలో థామస్ ఎడిసన్, హెన్రీ ఫోర్డ్, ఓప్రా విన్ఫ్రే, సామ్ వాల్టన్, స్టీవ్ జాబ్స్, బిల్ గేట్స్ లాంటి ఎందరో మహామహులు ఉన్నారు.

భారత్‌లో అత్యుత్తమ పారిశ్రామికవేత్తల జాబితాలో రితేశ్ అగర్వాల్, ఫాల్గుని నాయర్, కిరణ్ మజుందార్, ధీరూభాయ్/ముఖేశ్ అంబానీ, సచిన్ బన్సల్, అజీమ్ ప్రేమ్ జీ, కునాల్ షా, నారాయణ మూర్తి, రతన్ టాటా, ఆనంద్ మహీంద్రా, దీపిందర్ గోయల్, లక్ష్మీమిట్టల్ లాంటి ప్రముఖులు ఉన్నారు. జాతీయ పారిశ్రామికవేత్తల దినోత్సవం వేదికగా కార్యశాలల నిర్వహణ, వ్యాపారవేత్తలకు మద్దతు, విజయగాథలను చర్చించడం, ఎంటర్ప్రూనర్ విద్యను ప్రోత్సహించడం, సోషల్ మీడియాల్లో ప్రచారం రూపంలో పాల్గొనడం, మహిళా పారిశ్రామితవేత్తలకు చేయూత ఇవ్వడం లాంటి పలు కార్యక్రమాలను నిర్వహించవచ్చు.

ఇన్ఫోసిస్ అధినేత నారాయణ మూర్తి ప్రారంభంలో వారి సతీమణి ఇచ్చిన పది వేల రూపాయల పెట్టుబడితో ఒక రూపంలో ప్రారంభించిన టెక్ కంపెనీ నేడు 3.23లక్షల ఉద్యోగులతో 1.63 లక్షల కోట్ల టర్నోవర్‌తో ప్రపంచస్థాయిలో అగ్రభాగాన నిలవడం చూస్తున్నాం.

(18 నవంబర్ జాతీయ పారిశ్రామికవేత్తల దినోత్సవం సందర్భంగా)

## ప్రజావాణికి 80 దరఖాస్తులు : అదనపు కలెక్టర్



ప్రజాపక్షం/వికారాబాద్: ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణికి వివిధ ప్రాంతాలనుండి వచ్చిన ప్రజల నుండి 80 దరఖాస్తులు స్వీకరించడం జరిగింది అని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో ప్రజావాణి దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలని సంబంధిత అధికారులకు తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, డిఆర్ఓ మంగీలాల్, ఆర్‌డిఒ వాసు చంద్ర,తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఎమ్మెల్యే నవీన్ యాదవ్ జన్మదిన వేడుకలు



ప్రజాపక్షం/ఘట్‌కేసర్ : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ జన్మదిన వేడుకలను ఘట్‌కేసర్‌కు చెందిన మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మామిండ్ల ముత్యాలు యాదవ్, ప్రధాన కార్యదర్శి బర్ల రాధాకృష్ణ ముదిరాజ్, ఎస్సీసెల్ అధ్యక్షులు ఎం. శ్రీనివాస్, సేవాదళ్ అధ్యక్షులు రాజారత్నం జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి నవీన్ యాదవ్‌కు శాలువతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



## గ్లోబల్ సమ్మిట్ నిర్వహణకు స్థల పరిశీలన చేసిన ఉపముఖ్య మంత్రి

ప్రజాపక్షం/దుండిగల్ : డిసెంబర్, 2025 లో జరిగే గ్లోబల్ సమ్మిట్ నిర్వహణ లో భాగంగా వేదికను ఎంచుకోవడానికి దుండిగల్ మండలం లో ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 453 454 లను ఉపముఖ్య మంత్రి భట్టి విక్రమార్క స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ ఐఏఎస్ కలెక్టర్ మను చౌదరి, ఐఏఎస్ నర్సింహా రెడ్డి లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ, తెలంగాణ రైసింగ్ విజన్ 2047 అభివృద్ధి లో భాగంగా ప్రభుత్వం తెలంగాణ ప్రజలను మాత్రమే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పెట్టుబడిదారులను కూడా ఆహ్వానం పలుకుతోందని హైదరాబాద్ అనుకూలమైన వాతావరణం మరియు అత్యంత నైపుణ్యం తో కూడిన మానవ వనరులు కలిగి ఉన్నందున పెట్టుబడిదారుల ను మరింతగా ఆకర్షిస్తోందన్నారు జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, ఆర్డీవో టీ.శ్యామ్ ప్రకాష్ కమిషనర్ ఇన్ వెంకటేశ్వర్ నాయక్,సీఐ సతీష్ కుమార్, గ్రంథాలయ చైర్మన్ బి.శ్రీనివాస్ రెడ్డి, నాయకులు బొంగునూరి కిషోర్ రెడ్డి,మాజీ సర్పంచ్ కావాలి గణేష్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## స్ట్రీట్ లైట్ ఏర్పాటుకు ప్రజావాణిలో వినతి

ప్రజాపక్షం /కుత్బుల్లాపూర్ : గాజులరామారం సర్కిల్ లెనిన్ నగర్ సి బ్లాక్ చౌరస్తాలో వీధి దీపాలు లేకపోవడం వల్ల రాత్రి సమయంలో మహిళలు అక్కడి నుండి వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నారని, పోకిరీలు గంజాయి, మందు సేవించి అర్థరాత్రి సమయంలో గొడవలు అల్లర్లు చేస్తూ భయాన్ని సృష్టిస్తున్నారని అన్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం అక్కడ స్ట్రీట్ లైట్స్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, మండల కార్యదర్శి స్వామి, ఎఐటియుసి కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి సదానంద్, సాయిలు, కుమార్, సత్యం, రవి, మధు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.





## ప్రజావాణి అర్జీల సత్వర పరిష్కారానికి ఆదేశం

ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణిలో స్వీకరించిన అర్జీలను సంబంధిత అధికారులు సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా ఆదేశించారు. సోమవారం ఎప్పటిలాగే కలెక్టరేట్ కార్యాలయంలో వివిధ ప్రభుత్వ అధికారులతో కల్సి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డిఆర్ఓ హరిప్రియలతో కల్సి 109 ధరఖాస్తులను స్వీకరించారు. అనంతరం ఆమె అధికారులనుద్దేశించి మాట్లాడుతూ కిందిస్థాయిలో పరిష్కారానికి నోచుకోని బాధిత ప్రజలు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి గంపెడాశతో ఎలాగైనా తమ సమస్యలు ఓ కొలిక్కి వస్తాయని వ్యయప్రయాసలకోర్చి వస్తుంటారని, వారి నమ్మకాలను వమ్ము చేయకుండా పరిష్కరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్క అధికారిపై ఉందని అన్నారు. అదే విధంగా అర్జీలను తిరస్కరించాల్సి వస్తే వాటికి గల కారణాలను వివరంగా ధరఖాస్తుదారులకు తెలియచేయాలని, అర్జీలపై తీసుకొన్న చర్యల విషయాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో వెంటవెంటనే నమోదు చేయాలని ఆదేశించారు.


## విజయ్ డెయిరీ ఉత్పత్తులు వాడాలి

### చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి

ప్రజాపక్షం/ఘట్‌కేసర్ : విజయ డైరీ పాల ఉత్పత్తుల కోల్డ్ సోరేజ్ మున్సిపల్ పరిధిలో ఎన్ఎఫ్‌సి నగర్‌లో 5వేల లీటర్ల కెపాసిటీని విజయ డైరీ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయ డైరీ సంస్థ చైర్మన్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిసర ప్రాంతాల ప్రజల కొరకు నాణ్యమై న విజయ ఉత్పత్తులను అందించే ఉద్దేశంతో మావద్ద కోల్డ్ సోరేజ్‌ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. మావద్ద ఎటువంటి కల్తీ లేని విజయ ఉత్పత్తులను వినియోగించుకొని పాడిరైతుల ఆర్థిక అభివృద్ధికి తోడ్పడుటకు ఉపయోగపడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ జిఎం కామేష్, ధనరాజ్,రంగారెడ్డి జిల్లా విజయ డైరీ డైరెక్టర్ మోహన్ మురళి, నల్లగొండ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ జయ ప్రదీప్ కుమార్, వాకిటి మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




## అయ్యప్ప స్వామి పడిపూజలో ఈటల



ప్రజాపక్షం/నాగారం:అయ్యప్ప స్వామి కృపా కటాక్షాలు మనందరిపై మెండుగా ఉండాలని మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్, మేడ్చల్ నియోజకవర్గం ఎమ్మె ల్యే చామకూర మల్లారెడ్డిలు అన్నారు. నాగారం మున్సిపాలిటీ పరిధిలోని ఓ ఫంక్షన్ హాలులో మాదిరెడ్డి భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన మాదిరెడ్డి మహిపాల్‌రెడ్డి 18వ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి మహా పడిపూజలో రాజేందర్, మల్లారెడ్డిలతో పాటు మాజీ ఎంఎల్‌ఏలు మైనంపల్లి హనుమంతురెడ్డి, మలిపెద్ది సుధీర్‌రెడ్డిలు హాజరై తీర్థ ప్రసాదాలు తీసుకుని భగవంతుని ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు హరివర్ధన్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి, మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# హైడ్రా దూకుడు



* గచ్చిబౌలిలో అక్రమ కట్టడాల కూల్చివేతలు
* హైకోర్టు ఆదేశాల మేరకు రహదారుల పునరుద్ధరణ
* ప్లాట్ యజమానుల హర్షం

ప్రజాపక్షం/హైదరాబాద్ : హైదరాబాద్ మహానగరంలో అక్రమ నిర్మాణాలపై హైడ్రా అధికారులు ఉక్కుపాదం మోపారు. గచ్చిబౌలి ప్రాంతంలోని ఎఫ్‌సిఐ లేఔట్‌లో రహదారులు, పార్కుల ను ఆక్రమించి నిర్మించిన భవనాలను సోమవా రం భారీ ఎత్తున కూల్చివేశారు. హైకోర్టు ఆదేశా ల మేరకు చేపట్టిన ఈ డ్రైవ్‌లో 40 ఫీట్ల రహదారిపై అడ్డంగా నిర్మించిన సంధ్యా కన్వెన్షన్ భవనం, పలు ఫుడ్ కోర్టులు, కంటైనర్లు, పెట్రోల్ బంక్‌లో భాగం, ఆసుపత్రి ర్యాంపులు తదితర నిర్మాణాలు నేలమట్టం అయ్యాయి. ఎఫ్‌సిఐ ఎంప్లాయీస్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ పరిధిలోని 20 ఎకరాల లేఔట్‌లో రహదారులు, పార్కులను పట్టించుకోకుండా సంధ్యా శ్రీధరరావు పలు నిర్మాణాలు చేపట్టారని ప్లాట్ యజమానులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దీనిపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెంటనే రహదారులను పునరుద్ధరించాలని ఆదేశించింది. కోర్టు ఆదేశాల నేపథ్యంలో హైడ్రా అధికారులు అక్రమాలపై దూకుడుతో ముందుకు సాగారు. హైడ్రా అధికారులు తమకు అండగా నిలవడంతో బాధితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కూల్చివేతలో తొలగించినవి..

* 40 అడుగుల రహదారిపై ఐరన్ ఫ్రేమ్‌తో నిర్మించిన 5 అంతస్తుల భవనం
* మ్యాంగో ఫుడ్ కోర్టు * యూనో ఫుడ్ కోర్టు
* 40కి పైగా ఏర్పాటు చేసిన ఫుడ్ కంటైనర్లు, చైనా ఫుడ్ స్టాళ్లు
* రహదారిని ఆక్రమించి నిర్మించిన పెట్రోల్ బంక్ భాగం
* రహదారి మీదకి విస్తరించిన ఆసుపత్రి సెల్లార్ ర్యాంపులు
* మొత్తం 7 చోట్ల రహదారి ఆక్రమణలు తొలగించారు.

**హైకోర్టు ఆదేశాలతో కదిలిన హైడ్రా..**

ఎఫ్‌సిఐ లేఔట్‌లో మొత్తం 162 ప్లాట్లు ఉండగా వాటిలో మెజార్టీ తనవేనని చెప్పుకుం టూ రహదారులు, పార్కులు ఆక్రమించడం హై కోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. లేఔట్ ఒక్కసారి ఆమోదిస్తే అది శాశ్వతంగా యజమానులు మారినా హద్దులు మారవని స్పష్టం చేసింది. చాలా మంది ఫిర్యాదుదారు లు ఏం అడిగినా తమపైనే దాడులు చేశారు, పలువురు మోసాల భరించలేక ఆత్మహత్యలు కూడా చేసుకున్నారని కోర్టుకు తెలిపారు.

గతంలోనే కొంత మేరకు ఆక్రమణలు తొలగించిన హైడ్రా, నిర్మాణాలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈసారి పూర్తిస్థాయి చర్యలు తీసుకుంది. హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ ఆదేశాల మేరకు అధికారుల బృందం రహదారులను పూర్తిగా క్లియర్ చేసి హద్దులను నిర్ధారించింది. రహదారుల పునరుద్ధరణతో ప్లాట్ యజమానులు ఊపిరి పీల్చుకున్నారు. ఎన్నో సంవత్సరాలుగా తాము అన్యాయాన్ని ఎదుర్కొన్నామని, హైడ్రా చర్యలు తమకు న్యాయం చేశాయని వారు హర్షం వ్యక్తం చేశారు.

## హైడ్రాకు పోటెత్తిన కబ్జా ఫిర్యాదులు




ప్రజాపక్షం/హైదరాబాద్:నగరంలోని పలుచోట్ల ఇష్టారాజ్యంగా జరుగుతున్న ఆక్రమణలు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. డెడ్‌ఎండ్ కాలనీల్లో రహదారులు కబ్జా, పాత లేఔట్లలో పార్కులు, ప్రజావసరాల కోసం కేటాయించిన స్థలాలు, ఆలయాల భూములు విచక్షణారహితంగా ఆక్రమణలు జరుగుతున్నాయని నగర నలుమూలల నుంచి సోమవారం హైడ్రా ప్రజావాణికి వచ్చిన 52 ఫిర్యాదులు చెబుతున్నాయి. జగద్గిరిగుట్టలోని శ్రీ గోవిందరాజు స్వామి దేవస్థానం ప్రతినిధులు ఆలయ భూమిని, పుణ్యస్నానాల కోసం ఉద్దేశించిన కోనేరును కబ్జా చేస్తున్నారంటూ ఫిర్యాదు చేశారు. కూకట్‌పల్లి ఎల్లమ్మబండ వద్ద ఉన్న ఎల్లమ్మకుంటలోకి ప్రగతినగర్ కాలువ మురుగుకాలుష్యం చేరి కాలుష్యాన్ని పెంచుతోందని, కుంటలో జరుగుతున్న ఆక్రమణలను తొలగించాల్సిందిగా స్థానికులు కోరారు. శంషాబాద్ గ్రామం, ఆర్‌ఆర్ నగర్ అయ్యప్ప కాలనీలో సర్వే నెంబర్లు 748, 749లో పార్కు సహా ప్రజావసరాల కోసం కేటాయించిన 4,794 గజాల స్థలం కబ్జాకు గురైందని, అక్కడి సంక్షేమ సంఘం తెలిపింది.ఈ ఫిర్యాదులన్నింటిని హైడ్రా కమిషనర్ ఏ.వి.రంగనాథ్ స్వయంగా పరిశీలించి, సంబంధిత అధికారులు తక్షణం క్షేత్రస్థాయి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు.

**ప్రగతినగర్ చెరువు సరిహద్దులపై వివాదం..**

ప్రగతినగర్ లేక్వ్యూ కాలనీ ప్రతినిధులు చెరువు సరిహద్దులను అధికారికంగా హైడ్రా నిర్ధారించాలని కోరారు. ప్రైవేట్ వ్యక్తులు తమ ఇష్టానుసారం సర్వేలు చేసి హద్దులు మార్చేందుకు ప్రయత్నిస్తున్నారని, ఆ ప్రశ్నిస్తే తమపై కేసులు నమోదు చేస్తున్నారని వాపోయారు. హైడ్రా అధికారికంగా హద్దులు నిర్ధారిస్తే వివాదాలు నివారించవచ్చని కోరారు.

**సిలికాన్ కంట్రీలో రహదారి కుందింపు, భూముల కబ్జా..**

శేరిలింగంపల్లి మండలం సిలికాన్ కంట్రీలో 162 ప్లాట్లు ఉన్నాయి. ఇక్కడ 24 అడుగుల రోడ్డు బిల్డర్ అనుమతులివ్వడంతో 16 అడుగులకు తగ్గిపోయిందని ఓనర్స్ అసోసియేషన్ తెలిపింది. అదనంగా క్లబ్‌హౌస్ నిర్మాణం పేరుతో అపార్ట్‌మెంట్ నిర్మాణంతో పాటు ప్రభుత్వ భూమి 3,320 గజాల మేర కబ్జా చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

**అంబర్‌పేట్, గోల్నాకలో రహదారులే మూసివేత..**

శ్రీ వేంకటేశ్వర నగర్ బస్తీలో రహదారిపై బారికేడ్లు ఏర్పాటు చేసి ప్రజల రాకపోకలను అడ్డుకుంటున్నారని స్థానికులు తెలిపారు. నివాస ప్రాంతాల్లో అనుమతి లేని వ్యాపారాలు పెరగడంతో అసౌకర్యం మరింతగా పెరిగిందని, రహదారి మీద ఉన్న బారికేడ్లను వెంటనే తొలగించాలని కోరారు.

**ఓల్డ్ అల్వాల్‌లో పార్కు భూమికి రక్షణ కావాలి..**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని ఓల్డ్ అల్వాల్ జొన్నబండ గ్రామం సర్వే నెంబర్లు 21పి, 576పి, 577లో 'గంగా అవెన్యూ'లో పార్కు, ప్రజావసరాల కోసం కేటాయించిన 2,292 గజాల స్థలంపై జరిగిన ఆక్రమణలను హైడ్రా ఇప్పటికే తొలగించింది. అయితే మళ్లీ కబ్జా జరగకుండా వెంటనే ఫెన్సింగ్ వేసి, ఇది పార్కు భూమి అని బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు ప్రజావాణిలో అభ్యర్థించారు. అదే ప్రాంతంలో అరవింద్ ఎన్‌క్లేవ్‌కు వెళ్లే రహదారి నెంబరు 4ను కబ్జా చేసి గోడ వేసినందున దానిని కూడా తొలగించాలని కోరారు.

## నాణ్యమైన భోజనం అందేలా ప్రభుత్వం చర్యలు : ఎంపిడిఒ అనురాధ



ప్రజాపక్షం/నవాబుపేట: విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని నవాబుపేట్ ఎంపిడిఒ అనురాధ అన్నారు. సోమవారం నవాబుపేట్ మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కెజిబివి)ని ఎంపిడిఒ అనురాధ, ఎంఈఒ అబ్దుల్ రెహమాన్ తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను, స్టోర్ రూమ్ నీ పరిశీలించి, పాఠశాల ప్రత్యేకాధికారికి పలు సూచనలు చేశారు. విద్య బోధన, భోజన సదుపాయం ఇతర మౌలిక వసతులు ఎలా ఉన్నాయి? ఏమైనా ఇబ్బందులు ఉన్నాయనే విషయాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..ప్రభుత్వం అన్ని పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం సకల సదుపాయాలు కల్పించి మంచి అనుభవం కలిగిన ఉపాధ్యాయులచే నాణ్యమైన విద్య అందిస్తుందని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన రుచి, శుచి గల ఆహారాన్ని అందించాలన్నారు. ఆహారం తయారీలో తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యావసరసరకులను వినియోగించాలని, శుద్ధమైన తాగునీటిని అందించాలని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్య బోధన చేయాలన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, వర్చువల్ రియాలిటీ పద్ధతిలో విద్యార్థులకు బోధించాలని తెలిపారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వసతి గృహంలో విద్యార్థులకు సోలార్ ప్లాంట్ చెడిపోయి ఉండటంతో ఉదయం విద్యార్థులకు ఇబ్బందిగా ఉందని తెలుసుకొని త్వరిత గతిన సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువు కుని, ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ లక్ష్మీదేవి, మండల వ్యవసాయధికారి జ్యోతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్ల సమస్యపై వామపక్షాల ఆధ్వర్యంలో ఆర్‌ఆండ్‌బి కార్యాలయం ముట్టడి

ప్రజాపక్షం/వికారాబాద్: జిల్లా వ్యాప్తంగా రోడ్ల సమస్యను పరిష్కరించాలని వామపక్షాల ఆధ్వర్యంలో రోడ్లు, భవనాల కార్యాల యం ముట్టడించిన సిపిఐ జిల్లా నాయకులు గోపాల్ రెడ్డి, సిపిఎం జిల్లా కార్యాదర్శి మహిపాల్, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసి జిల్లా కార్యదర్శి మహేందర్ తో కలిసి ఆర్‌ఆండ్‌బి కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వికారాబాద్ జిల్లాలో అతి తీవ్రమైన రోడ్ల సమస్యను వెంటనే పరిష్కరించడంలో పాలకవర్గం విఫలమవుతున్నాయని అనునిత్యం రక్తపాతం అవుతున్న వికారాబాద్ జిల్లా రోడ్లను బాగు చేయాలని జిల్లా అనుసంధానం చేస్తు ఉన్నటువంటి ప్రధాన రహదారులను, గ్రామాలకు మండల కేంద్రాలకు వెళ్లే రోడ్లను బేషరతుగా మరమ్మతులు చేయాలని అన్నారు. రోడ్ల విషయంలో స్థాని క ఎంపి, మంత్రులు, ఎమ్మెల్యేలు కాలయాపన చేస్తూ ప్రజలను మభ్యపట్టడం కాదు తక్షణమే పరిష్కారం వెతకాలని,ముఖ్యమంత్రి నియోజకవర్గం అభివృద్ధి కోసం కడ జిల్లా మొత్తానికి విస్తరించేలా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి కొడంగల్ అభివృద్ధి కోసం నిధులు విడుదల చేయడం కాదు జిల్లా మొత్తం అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్,గ్రామ పంచాయతీ అభివృద్ధి కుంటుపడిందని అన్నారు. నూతన రోడ్లు నిర్మించాలని అన్నారు వికారాబాద్ జిల్లా అభివృద్ధి చెందడం లేదనడానికి వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్‌టిఆర్ చౌరస్తా, బిజెఆర్ చౌరస్తాలో మురికి నీరు ప్రవాహాన్ని చూస్తేనే తెలుస్తుంది అని అన్నా రు. ఈ కార్యక్రమంలో వై.గీత, మల్లేశం, సతీష్, అక్బర్,సుదర్శన్ , లాలయ్య, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.




## డయల్ యువర్ ఎస్‌పి కార్యక్రమం


ప్రజాపక్షం/వికారాబాద్: ప్రతి సోమవారం డైల్ యువర్ ఎస్‌పి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది అని జిల్లా ఎస్‌పి నారాయణరెడ్డి తెలిపారు. ఈ సందర్భం గా జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ వికారాబాద్ జిల్లా ప్రజలకు మరింత చేరువయ్యేందుకు,వారి సమస్యలను తక్షణమే పరిష్కరించే లక్ష్యంతో పనిచేయడానికి డైల్‌యువర్ ఎస్‌పి కార్యాక్రమం లాంఛనంగా ప్రారంభించిన మొదటి రోజే 26కాల్స్ వచ్చాని తెలిపా రు. ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదుల్లో మహిళల భద్రతకు సంబంధించిన సమస్యలు,మాడిఫైడ్ సైలెన్స్ ర్లతో కూడిన వాహనాల ద్వారా ఇబ్బందులు,అక్రమ ఇసుక రవాణా,అక్రమ ఎర్రమట్టి , భార్యభర్తాలమధ్య గొవడలు వ్యక్తిగత సమస్యలు ,పొలాలలోకి అక్రమంగా ప్రవేశించడం మండ ల కేంద్రాలలో ట్రాఫిక్ సమస్యలు మొదలగు అంశాలపై ఫిర్యాదు అందయని తెలిపారు. ప్రజలు తమ ఫిర్యాదులను నమోదు చేయాడనికి రావాల్సిన అవసరం అఏకుండా ఫోన్ ద్వారా నే అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం ప్రతి సోమవారం11గంటల నుండి 12గంటల వరకు జిల్లా ఎస్‌పి స్వయంగా ప్రజలతో మాట్లాడటం జరుగుతుందని , ఫోన్ నెంబర్ 08416 255601 ను సంప్రదించాలని దినిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌పి తెలిపారు.




## ప్రజల కోసం జీవితాన్ని త్యాగం చేసేది కమ్యూనిస్టులే

### సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్

ప్రజాపక్షం/కాప్రా: ప్రజల కోసం జీవితాన్ని త్యాగం చేసేది కమ్యూనిస్టులేనని సిపిఐ శత జయంతి వార్షికోత్సవాలను విజయవంతం చేయాలని సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ అన్నారు.సిపిఐ ఉప్పల్ మండల సవితి సమావేశంలో ఇసిఐఎల్‌లోని నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో రామ్ నారాయణ అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజా జీవితంలో ఉండే కమ్యూనిస్టులకు ఎలాంటి మచ్చ ఉండదని నిస్వార్థ పరులని అన్నారు. త్యాగాలకు పోరాటాలకు నిలయం కమ్యూనిస్టు పార్టీ అని, అందుకే వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్నా నేటికి ప్రజల గుండెల్లో నిలిచి ఉన్నారు. ఎన్నికలు ధన ప్రవాహంగా మారిపోయినా, మతోన్మాద శక్తులు ప్రజలను విభజిస్తున్నా వాటికి ఎదురొడ్డి సిపిఐ నిలబడిందన్నారు. నేడు బిజెపి ప్రభుత్వం రాజ్యాంగం నుండి సెక్యులర్, సోషలిజం పదాలను తొలగిస్తూ ఇసి, సిబిఐ లాంటి సంస్థలను తను గుపెట్లో పెట్టుకుని ప్రశ్నించే వారిని అణిచివేసే చర్యలు చేపడుతున్నదని అన్నారు. దేశంలో కమ్యూనిటీలందరూ ఏకం కావాలని ఎర్ర జెండాలన్నీ ఒకే జెండాగా మారాలని అందరూ కోరుకుంటున్నారు. డిసెంబర్ 25న ఖమ్మంలో జరిగే సిపిఐ శతాబ్ద ఉత్సవాలను జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జి దామోదర్‌రెడ్డి, సభ్యులు కె ధర్మేంద్ర, ఉప్పల్ కార్యదర్శి టి.సత్య ప్రసాద్, సహాయ కార్యదర్శి బషీర్, తదితరులు పాల్గొన్నారు.




## జగద్గిరిగుట్ట ఆలయ భూములు కాపాడండి

### ప్రజావాణిలో సిపిఐ నాయకుల వినతి

ప్రజాపక్షం /కుత్బుల్లాపూర్ : సర్వే నెంబర్ 348/1లో వెలిసిన శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయానికి చెందిన భూముల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని, ఆలయ భూములను కాపాడి ప్రజల సౌకర్యార్థం ఉపయోగించాలని మండల రెవెన్యూ అధికారి అశోక్‌కు వినతిపత్రం అందజేశారు. అదే విధంగా గతంలో హైడ్రా కూల్చిన పలు ప్రభుత్వ భూముల్లో మళ్లీ నిర్మాణాలు మొదలయ్యాయని, అట్టి నిర్మాణాలపై కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, మండల కార్యదర్శి స్వామి, సీనియర్ నాయకులు ఏసురత్నం, ఎఐటియుసి కార్యదర్శి శ్రీనివాస్, సిపిఐ మండల నాయకులు సదానంద్, సాయిలు, కుమార్, రవి, మధు తదితరులు పాల్గొన్నారు.



### అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోకపోవడంతో....

## కలెక్టర్ ఆఫీసులో ఫిర్యాదు

ప్రజాపక్షం/నాగారం: అక్రమ నిర్మాణం ఆపాలని హైకోర్టు ఆర్డర్ ఇచ్చిన మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ ఫిర్యాదు చేశారు. నాగారం మున్సిపల్ పరిధిలోని సర్వే నంబర్ 133 ప్లాట్ నంబర్ 5,6,7,8,9లలో గల 1601 గజాలలో అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాన్ని ఆపాలని స్థానిక కాలనీవాసులు నిరసన తెలిపిన చర్యలు తీసుకోకపోవడంతో మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి హైకోర్టును ఆశ్రయించి మున్సిపల్ అధికారులు, ఇతర అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడ లేదని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణిలో హైకోర్టు ఆర్డర్ కాపీని జతచేసి వినతి పత్రం అందజేశారు.



## మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం

### పాఠశాలల ఆకస్మిక తనిఖీలో కలెక్టర్

ప్రజాపక్షం/వికారాబాద్: మెనూ ప్రకారం, విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన మధ్యాహ్నం భోజనాన్ని అందించాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తలిపారు. సోమవారం వికారాబాద్ మున్సిపల్‌లోని గంగారం సాయి బాబా కాలనీలోని మండల పరిషత్ ప్రైమరీ స్కూల్, కొత్తగడి జిల్లా పరిషత్‌హై స్కులను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకి పెట్టే భోజనం వంట చేయడం జరిగిందా లేదా అని పరిశీలించారు. వంట కి ఉపయోగించే వంట సామగ్రిని కలెక్టర్ పరిశీలించారు. ప్రతిరోజూ మెను ప్రకారం రుచికరమైన భోజనం పెడుతున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఐఎఫ్‌టి ప్యానల్ పని విధానాన్ని పరిశీలించారు. స్టోర్ రూమ్, బియ్యం నాణ్యతను చెక్ చేశారు. తాజా కూరగాయలతో విద్యార్థులకు భోజనం పెట్టాలని అధికారులకు ఆదేశించారు. పాఠశాలలో మొత్తం విద్యార్థుల సంఖ్య ఎంతమంది అని, అందులో పదవ తరగతి చదివే విద్యార్థులు ఎంతమంది ఉన్నారని స్కూల్ ప్రిన్సిపల్ అడిగారు. ప్రతిరోజు సాయంత్రం స్పెషల్ క్లాస్ నిర్వహించాలని, పరీక్షలకు ఇప్పటినుండే సిద్ధం కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి రేణుకాదేవి, ఎంఇఓ బాబుసింగ్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మ ముహూర్తం నుంచే దర్శనాలు

ప్రజాపక్షం/శంకర్‌పల్లి: కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో రంగారెడ్డి జిల్లా శంకర్ పల్లి మండలం చందిప్ప మరకత శివాలయానికి భక్తులు పోటెత్తారు. శంకర్ పల్లి మండలం చందిప్ప గ్రామంలో 1000 సంవత్సరాల క్రితం క్రితం చాణుక్య రాజులు ప్రతిష్ఠించిన మరకత శివ లింగం దర్శనానికి భక్తులు పోటెత్తారు.కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా వేలాది మంది భక్తులు వివిధ ప్రాంతాల నుంచి శివాలయానికి చేరుకొని మరకత శివలింగాన్ని దర్శించుకున్నారు. దేవాలయ కమిటీ వారు భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగ కుండా తగు చర్యలు తీసుకున్నారు. ఉదయం బ్రహ్మ ముహూర్తం మూడు గంటల నుండి దర్శన సౌకర్యం భక్తు లకు దేవాలయ కమిటీ వారు కల్పిం చారు. భక్తులకు అన్నదాన వితరణ చేశారు.స్థానిక సిఐ శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వ హించారు.



## త్వరితగతిన ట్రంక్ లైన్ పనులు

ప్రజాపక్షం/హయత్‌నగర్: మన్సూరాబాద్ డివిజన్ చింతలకుంట ఆగ మయ్య కాలనీ లో నిర్మిస్తున్న వర్షపు నీరు పోయే ట్రంక్ లైన్ పనుల పురో గతిని పరిశీలించిన ఎల్ బి నగర్ ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి ఈ సందర్భముగా మాట్లాడుతూ ట్రంక్ లైన్ పనులలో తీవ్ర జాప్యం జరుగుతుంది అని దీనివ లన చుట్టుపక్క కాలనీ వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అని పనులు తొందరగా పూర్తి చేయాలనీ ఆదేశించారు మన్సూరాబాద్ పెద్ద చెర్వు లో కి వర్షపు నీరు చేరేవిధముగా చర్యలు చేపట్టాలి అధికారులను ఆదేశించారు ఈ కార్యక్రమములో మాజీ కార్పొరేటర్ కొప్పుల విట్టల్ రెడ్డి రఘు వీర్‌రెడ్డి, బాలరాజ్‌గౌడ్, అధికారులు స్థానిక ప్రజలు పా ల్గొన్నారు.



## రాజీవ్‌స్వగృహ ప్లాట్ల బహిరంగ వేలం

### తొర్రూర్‌లో మొదటిరోజు 59 ప్లాట్ల విక్రయం

### మంగళవారం మరో 104 ప్లాట్ల వేలం

ప్రజాపక్షం/హైదరాబాద్: రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వ హిస్తున్న ఓపెన్ ప్లాట్ల బహిరంగ వేలానికి మరోసారి మంచి స్పందన వచ్చిం దని అధికారులు తెలిపారు. నగర శివారులోని ఓఆర్ఆర్ సమీప ప్రాంతా లైన తొర్రూర్, కుర్మల్‌గూడ, బహదూర్‌పల్లి ప్రాంతాల్లో మొత్తం 163 ప్లాట్లను రెండు రోజుల పాటు వేలం వేయాలని అధికారులు నిర్ణయించారు. మొదటి రోజు సోమవారం తొర్రూర్‌లో 59ప్లాట్లను వేలం వేశారు. ఈ వేలంలో చదరపు గజానికి గరిష్ఠంగా రూ.39 వేల వరకు ధర పలికింది. సగటు ధర రూ.28,700గా నమోదైంది. కనీస ధర చదరపు గజానికి రూ.25 వేలుగా నిర్ధారించినట్లు కార్పొరేషన్ అధికారులు చెప్పారు. ఈ విక్ర యాలద్వారాఒక్క రోజులోనేరూ.46 కోట్ల ఆదాయం లభించినట్లు స్వగృహ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వి.పి. గౌతమ్ వెల్లడించారు. మొత్తం 110 మంది బిడ్డర్లు వేలంలో పాల్గొన్నారని తెలిపారు. మంగళవారం తొర్రూర్‌లో మిగిలిన 65 ప్లాట్లు, కుర్మల్‌గూడలో 25 ప్లాట్లు, బహదూర్‌పల్లిలో 13 ప్లాట్లకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

## బిసిల హక్కుల సాధనకు కృషి




ప్రజాపక్షం/షాద్‌నగర్: బీసి జనసేన జాతీయ అధ్యక్షుడిగా కత్తి చంద్రశే ఖర్ అప్పను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం హైద్రాబాద్‌లో బీసి సంక్షేమసంఘం వ్యవస్థాపన అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అధ్యక్షతన సమావే శంలో జాతీయ అధ్యక్షుడిగా కత్తిచంద్రశేఖర్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. హైద్రాబాద్‌లోని విద్యానగర్‌లో బీసి సంక్షేమ సంఘం అధ్య క్షుడు ఆర్.కృష్ణయ్య, బీసి యువనాయకుడు డాక్టర్ అరుణ్‌బాబు బీసి జన సేన సంఘాన్ని అధికారికంగా ప్రకటించారు. కత్తి చంద్రశేఖర్ అప్ప మాట్లా డుతూ దేశ వ్యాప్తంగా బీసిల హక్కుల సాధనకు కృషి చేయడంతోపాటు సమస్య పరిష్కారందిశగాముందుకు వెళ్లనున్నట్లు తెలిపారు. బీసిల హక్కుల కోసం న్యాయపోరాటం కోసం నిరంతరం శ్రమించనున్నట్లు పేర్కొన్నారు. బీసి జనసేన నేతలు జమాల్పూర్ చందులాల్, గడ్డమీది రమేష్, జువ్వ సుధా కర్, తంగడపల్లి శంకర్, మేకల వెంకటేష్, జూపల్లి చంద్రశేఖర్, ఆవుల ఆంజనేయులు, , తోట మహేందర్, జక్కుల జలజ, స్రవంతి పాల్గొన్నారు.

## వసతిగృహాల నిర్వహణ ప్రతి ఒక్కరి బాధ్యత



ప్రజాపక్షం/రంగారెడ్డి: వసతి గృహాల నిర్వహణ ప్రతి ఒక్కరు బాధ్యతగా పని చేయాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కె శ్రీనివాస్ ఆదేశించారు. సోమవారం వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలో నిర్వహణపై జిల్లా లోని ఎస్. సి,ఎస్.టి,బిసి,మైనారిటీ సంక్షేమశాఖలకు చెందిన అధికా రులు,గురుకులాల ఆర్ సి ఒ లు, డిసిఒ లు, స్పెషల్ అధికారులతో ఫుడ్ సేఫ్టీ, విద్యా విధానం బోధనలు, న్యూట్రిషన్,సానిటేషన్, ఎడ్యుకేషన్, హెల్త్, అదనపు ప్రత్యేక అధికారులతో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ కలె క్టరేట్ లోని సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. అద నపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక అధికారులు వారికి కేటాయించిన మండ లాలలోని వసతి గృహాలలో హెల్త్, ఎడ్యుకేషన్,న్యూట్రిషన్, సానిటేషన్, డ్రగ్స్ పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. వసతి గృహాల నిర్వ హణలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుం దని ఆయన హెచ్చరించారు. సమావేశంలో ఎస్‌సి వెల్ఫేర్ అధికారి రామ రావు,బి.బిసి సంక్షేమ శాఖ అధికారి కేషు రామ్,మైనారిటీ సంక్షేమ అధి కారి కోట్ల నవీన్ కుమార్,సంబంధిత ఆర్సీఓలు, సంబంధిత ప్రత్యేక అధికా రులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమాలు అరికట్టాలి



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్: ఇంటి టాక్స్ రివైజ్ ట్యాక్సుల పేరుతో జరుగు తున్న అక్రమాలను వెంటనే అరికట్టాలని జిహెచ్‌ఎంసి ఎల్‌బి నగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ ను వారి కార్యాలయంలో సోమవారం బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి వినతి పత్రం సమ ర్పించారు. మొద్దు లచ్చిరెడ్డి మాట్లాడుతూ హౌజ్ ట్యాక్స్ రివైజ్ పేరుతో బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్స్పెక్టర్లు ప్రజలను ఇబ్బందులు పెడుతూ భయభ్రాంతు లకు గురి చేస్తున్నారని ఆయన ఆరోపించారు. రివైజ్ ట్యాక్స్ పేరుతో అడ్డ గోలు రెసిడెన్షియల్ ట్యాక్సులు పెంచడాన్ని ప్రజలు ఆర్థికపరమైన ఇబ్బం దులు పడుతున్నారని, దీనిపై సరైన పరిశీలనా యంత్రాంగం లేకుండానే అధిక ట్యాక్సులు వేస్తున్నారని ఆరోపించారు. కార్పొరేటర్లు కొప్పుల నరసిం హారెడ్డి, కళ్లెం నవజీవన్‌రెడ్డి, చింతల అరుణ సురేందర్ యాదవ్, నాయి కోటి పవన్ కుమార్ తదితరులు ఉన్నారు.

## కవల శిశువులతో గర్భిణి మృతి

ప్రజాపక్షం/శంషాబాద్: కవల శిశువులతో గర్భిణీ మృతి చెందడంతో భావోద్వేగంతో భర్త ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన రంగా రెడ్డి జిల్లా శంషాబాద్ సామా ఎన్‌క్లేవ్‌లో చోటు చేసుకుంది. ఎనిమిది నెలల గర్భిణి శ్రావ్య (40)కడుపులోనే కవల పిల్లలు చనిపోయిన దిగులు తట్టుకో లేక ఆమె ఆస్పత్రిలోనే ప్రాణాలు విడిచింది. భర్త ముత్యాల విజయ్ (45) ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.శంషాబాద్ సామా ఎన్‌క్లేవ్‌లో ఒక్కసారిగా నలుగురు మరణంతో కుటుంబం విషా దంలో మునిగింది.బెంగళూరు నుంచి వలస వచ్చిన ఈ దంపతులు శంషా బాద్‌లో స్థిరపడ్డారు. ఆర్‌జిఐఎ పోలీస్ స్టేషన్ పరిధిలో కేసు నమోదైంది. దర్యాప్తు కొనసాగుతోంది.

# నియోపోలిస్ ఫేజ్3 ప్రీబిడ్‌కు అపూర్వ స్పందన

ప్రజాపక్షం/హైదరాబాద్ : హెచ్‌ఎండిఎ త్వరలో నిర్వ హించనున్న నియోపోలిస్ ఫేజ్ 3 ఇవేలం పాట్లకు విశేష స్పందన లభించిందని అధికారులు చెప్పారు. కోకాపేట లోని గోల్డెన్ మైల్ రోడ్‌లో ఉన్న కీలకమైన ప్లాట్‌తో సహా, ఇతర ప్లాట్ల వేలానికి సంబంధించిన ప్రీబిడ్ సమావేశా నికి రియల్ ఎస్టేట్ వర్గాలు భారీగా తరలివచ్చాయి. ఐకా నిక్ టిహబ్‌లో సోమవారం జరిగిన ఈ కార్యక్రమానికి 100 మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యారు. ఈ ప్రీ బిడ్ సమావేశానికి హెచ్‌ఎండిఎ మెట్రోపాలిటన్ కమిష నర్ సర్ఫరాజ్ అహ్మద్, జాయింట్ మెట్రోపాలిటన్ కమి షనర్ ఆర్. ఉపేందర్ రెడ్డి, చీఫ్ ఇంజనీర్ రవీందర్, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ రవీందర్ రెడ్డి, డిప్యూటీ కలెక్టర్ సుద ర్శన్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. వారు నిబంధనలు, జోనింగ్, చెల్లింపులు, ఇతర రెగ్యులేటరీ అంశాలపై అవగాహన కల్పించారు. పారదర్శకమైన, సమగ్రమైన ప్రక్రియకు హెచ్‌ఎండిఎ కట్టుబడి ఉందని అధికారులు హామీనిచ్చారు. హెచ్‌ఎండిఎ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ ప్రసంగంతో సమావేశం ప్రారంభ మైంది. వేగంగా అభివృద్ధి చెందుతున్న కాస్మోపాలిటన్ నగరంగా హైదరాబాద్‌కు ఉన్న ప్రత్యేక ప్రయోజనా



లను, బలమైన మౌలిక సదుపాయాలపై ఆయన వివరిం చారు. స్థిరమైన పరిస్థితులు పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని కల్పిస్తాయని తెలిపారు. అనంతరం, కుష్‌మన్, వేక్‌ఫీల్డ్ సంస్థ ప్రతినిధులు ప్లాట్ల వివరాలు, మార్కెట్ అవకాశాలు, నియోపోలీస్ విలువ ఆధారిత సామర్థ్యంపై వివరణాత్మక ప్రదర్శన ఇచ్చారు. ఆ తర్వాత, ఎంఎస్‌టిసి లిమిటెడ్ ప్రతినిధులు ఇవేలం రిజి స్ట్రేషన్ దశలు, ప్రక్రియ, ఇతర అంశాలను వివరిం చారు. ఎంఎస్‌టిసి సీనియర్ ఆఫీసర్, జోనల్ మేనేజర్ జమిల్ అక్తర్ ఆన్‌లైన్ వేలం ప్రక్రియ, పోర్టల్ ఉప యోగం, పారదర్శకంగా బిడ్ చేసే విధానంపై అవగా హన కల్పించారు. అనంతరం జరిగిన ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో, మెట్రోపాలిటన్ కమిషనర్ అర్హత, కాల పరిమితులు, ఇతర అంశాలపై అడిగిన ప్రశ్నలకు సమా ధానమిచ్చారు. గతంలో కూడా ఇలాంటి వేలంపాటలను విజయవంతంగా నిర్వహించామని, ఈ ప్రక్రియ కూడా సజావుగా సాగుతుందని ఆయన హామీ ఇచ్చారు. సుమారు రెండు గంటల పాటు సాగిన ఈ సమావేశం, హాజరైన వారిలో ఆసక్తిని, విశ్వాసాన్ని పెంచిందని అధి కారులు చెప్పారు. త్వరలో జరగనున్న నాలుగు రోజుల వేలం (రోజుకు రెండు ప్లాట్లు) కోసం చాలా మంది తమ బిడ్డింగ్ వ్యూహాలను ప్రణాళికలు రూపొందించుకుంటు న్నారు. గోద్రెజ్, సత్వ, మై హోమ్, బ్రిగేడ్ జిహెచ్‌ఆర్, మేఘా ఇంజనీరింగ్, ఎంఎస్‌ఎన్ వంటి ప్రముఖ జాతీయ, ప్రాంతీయ డెవలపర్లు, పెట్టుబడిదారులు, ఫార్మా కంపెనీలతో సహా అనేక ఇతర ప్రముఖ సంస్థల ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

### నియోపోలిస్ ఫేజ్ 3 ప్రీ-బిడ్ మీట్‌కు అనూహ్య స్పందన..

– నిబంధనలు, చెల్లింపులపై స్పష్టత ఇచ్చిన హెచ్‌ఎం డిఏ మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్.
– హైదరాబాద్ అభివృద్ధి, నియోపోలిస్ వ్యూహాత్మక విలువను వివరించిన కుష్‌మన్, వేక్‌ఫీల్డ్ ఆన్‌లైన్ వేలం ప్రక్రియను వివరించిన ఎంఎస్‌టిసి.
– గోద్రెజ్, సత్వ, మై హోమ్, బ్రిగేడ్ మేఘా ఇంజనీ రింగ్, ఎంఎస్‌ఎన్ వంటి అగ్రశ్రేణి సంస్థలు ఆసక్తి కనబ రిచాయి.

## సమర్థవంతంగా ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ

ప్రజాపక్షం/రంగారెడ్డి:స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్ ను ముందస్తుగా ప్రక్రి యను సమర్థవంతంగా చేపట్టాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి చెప్పారు.సోమవారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో ఆర్ డిఒ లు, తహాసిల్దార్ లతో స్పెషల్ ఇంటెన్సీవ్ రీవిజన్ ను ముందస్తుగా సిద్ధం చేయలని, వివిధ విభాగాలకు చెందిన జిల్లా అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నారాయణ రెడ్డి మాట్లాడుతూ 2002లో గల ఓటర్ల జాబితా ఆధారంగా నియోజకవ ర్గాల వారీగా ఇప్పుడున్న 2002లో గల జాబితాలో ఎంతమంది చనిపో యారు,ఇంకా ఎంతమంది ఇతర ప్రాంతాలకు వెళ్లారో తగిన విధంగా ఇఆర్ఒ లు, ఎ విఆర్ఒ లు,బిఎల్ ఒ లు తమ పరిధిలోని ఓటర్ల జాబి తాను సిద్ధం చేయాలని ఆదేశించారు.ప్రతి పోలింగ్ స్టేషన్ వారిగా ఈ ప్రక్రియను బిఎల్‌ఓ సూపర్వైజర్లు,ఎవిఆర్‌ఓలు స్వీయ పర్యవేక్షణ జరిపి సరియగు జాబితాను సిద్ధం చేయాలని తెలిపారు. ఎన్నికల సంఘం నిర్దే శించిన విధంగా 2002లో ఓటర్ల ప్రస్తుత 2025 ఓటర్ల జాబితాలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ విధులకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, ఈఆర్వో లకు ఎఇఒ లకు, బిఎల్‌ఓలకు తగిన ఆదేశంలు ఇవ్వాలని ఆయన తెలి పారు.ఈ ప్రక్రియలో పంచాయతీ కార్యదర్శులను, అంగన్ వాడి వాలంటీ ర్లను భాగస్వాములు చేయాలని ఆదేశించారు. డిఆర్ఓ సంగీత పిడి డిఆర్ డిఒ పిడి ఎల్ శ్రీలత,డిపిఒ వి సురేష్ మోహన్,ఆర్డీవోలు పాల్గొన్నారు.

## బాల్యవివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం

### రంగారెడ్డి కలెక్టర్ సి.నారాయణరెడ్డి

ప్రజాపక్షం/రంగారెడ్డి: జిల్లాను బాల్యవివాహ రహిత జిల్లాగా రూపుదిద్దడం మనందరి సామూ హిక బాధ్యత అని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారా యణ రెడ్డి అన్నారు. ఎక్కడా బాల్యవివాహాలు జర గకుండా కఠినమైన పర్యవేక్షణతో పాటు,బాధ్యు లపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. బాల్యవివాహాల దుష్పరిణామాలు, పిల్లల భవిష్య త్తుపై వాటి ప్రతికూల ప్రభావాలపై ప్రజల్లో అవగా హన కల్పించేందుకు ప్రత్యేకంగా సిద్ధం చేసిన ప్రచార రథాన్ని సోమవారం ఉదయం రంగారెడ్డి జిల్లా కలక్టరేట్ కార్యాలయం ప్రాంగణంలో రిబ్బన్ కట్ చేసి, జెండా ఆవిష్కరించి ప్రారంభిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ "బా ల్యవివాహ్ ముక్త్ భారత్ కార్యక్రమం కింద జిల్లా లోని అన్ని గ్రామాలు, మండలాలు, ప్రతి పాఠ శాల,ప్రతి కళాశాలలో నిరంతర అవగాహన కార్య క్రమాలు నిర్వహించడం అత్యం అవసరం. ప్రతి పిల్లవాడి భద్రత,ఆరోగ్యం,విద్యమనమందరం




రక్షించాల్సిన బాధ్యత అని పేర్కొన్నారు. కార్యక్ర మానికి అడిషనల్ కలెక్టర్ (ఎల్ బి) కె శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై,బాల్యవివాహ నిర్మూల నలో ప్రతి లైన్ డిపార్ట్మెంట్ సమన్వయం అత్యంత అవసరమని తెలిపారు.

### ప్రజల్లో అవగాహన కల్పించాలి

జిల్లా సంక్షేమ శాఖ అధికారి శ్రీలత మాట్లాడుతూ ఈ ప్రచార రథం జిల్లాలోని ప్రతి గ్రామంలో తిరు గుతూ ప్రజల్లో అవగాహన కల్పిస్తుందని, ముఖ్య ంగా ఎడ్యుకేషన్, రెవెన్యూ,హెల్త్, మహిళా, శిశు సంక్షేమ శాఖ, ఇతర లైన్ డిపార్ట్మెంట్ల అధికారులు చురుకుగా పాల్గొంటారని చెప్పారు. జిల్లా బాలల సంక్షేమ అధికారి ప్రవీణ్ కుమార్,మహిళా సాధి కార కేంద్రం అధికారి నర్సగళ్ల శ్రీకాంత్ ఐసిపి ఎస్,ఐసిడిఎస్ శాఖల అధికారులు,జిల్లా సంక్షేమ శాఖ అధికారి సిబ్బంది, డిస్ట్రిక్ట్‌రూరల్‌డెవల ప్మెంట్‌అథారిటీసిబ్బంది ఉన్నారు.

## మహిళలకు ప్రాధాన్యత కల్పించేందుకే ఇందిరమ్మ ఇళ్లు

### షాద్‌నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్



ప్రజాపక్షం/కేశంపేట: మహిళలకు ప్రాధాన్యత కల్పించేందుకే ఇంది రమ్మ ఇండ్లను అందిస్తున్నామని షాద్‌నగర్ మార్కెట్ కమిటి డైరెక్టర్ కరుణాకర్ వివరించారు. సోమవారం మండల పరిధిలోని కొండారెడ్డి పల్లి గ్రామంలో పెబ్బె గాయత్రి, జహారాబీలకు మంజూరైన ఇంది రమ్మ ఇండ్ల నిర్మాణాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ కరుణాకర్ మాట్లాడుతూ మహిళలను ఆర్థికాభివృద్ధి చేయాలనే లక్ష్యం తోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనేక పథకాలను మహిళల పేర్లపై తీసుకువస్తున్నారని వివరించారు. ఏ పథకం ప్రవేశపెట్టిన అందులో మొదటి ప్రాధాన్యత మహిళలకు ఉంటుందని గుర్తు చేశారు. ఇండ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలనే ఉద్దేశంతోనే అర్హులైన ప్రతి ఒక్కరికి అందిస్తున్నామని పేర్కొన్నారు. నిర్మించుకున్న లబ్దిదారు లకు దశల వారిగా బిల్లులు వస్తున్నాయని, ఇందులో ఎవరు ఆశ్చర్య పోవాల్సిన పని లేదని అన్నారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో మరిన్ని ఇండ్లు లబ్దిదారులకు ఇచ్చే అవకాశాలు ఉన్నా యని, వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచిం చారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులు కాంగ్రెస్ ప్రభుత్వాని ప్రత్యే కంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటి అధ్యక్షుడు త్రిప్పిశెట్టి సుదర్శన్, గ్రామస్తులు బాలేశ్వర్, మాజీ ఉప సర్పంచ్ శివకుమార్, ఏర్పుల లింగం, వట్టెల లింగం, మల్లేష్, మల్లేష్ గౌడ్, తుమ్మల గోపాల్, పంచాయతీ కార్యదర్శి స్వరూప్‌కుమా ర్‌లు పాల్గొన్నారు.

## నెంబర్‌ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే సీజ్

### నందిగామ సిఐ ప్రసాద్



ప్రజాపక్షం/కొత్తూరు: వాహనాలకు నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలను నడిపిస్తే సీజ్ చేస్తామని నందిగామ సిఐ ప్రసాద్ తెలిపారు. సోమవారం సాయంత్రం 44వ జాతీయ రహదారి మేకగూడ బైపాస్‌పై వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిఐ ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి వాహనదారుడు విధిగా నంబర్ ప్లేట్‌ను పెట్టుకొని, వాహనాలను సంబంధించిన పత్రాలను అందుబాటులో పెట్టుకొవాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లి తండ్రులపై కేసులు నమోదు చేయడంతోపాటు వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని వివరించారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించి వాహనాలను నడిపించాలని, పెండింగ్ ఛాలన్లను తక్షణమే చెల్లించా లని సూచించారు. రోడ్డు నిబంధనలు ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదని, రోడ్డు భద్రతలను విధిగా పాటిస్తూ వాహనాలను నడిపించాలని పేర్కొన్నారు. ఎస్ ఐలు దేవరాజ్, యాదయ్య, పోలీస్ సిబ్బంది శ్రీరాములు, ముఖీద్, బాలకృష్ణ, రమేష్, రాములునాయక్‌లు ఉన్నారు.

## కార్తీకంలో వనభోజనం పూర్వజన్మ సుకృతం

ప్రజాపక్షం/కొత్తూరు: కార్తీక మాసంలో వనభోజనాలు చేయడం పూర్వ జన్మసుకృతం గా భావిస్తున్నట్లు షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతా ప్‌రెడ్డి తెలిపారు. సోమవారం



కొత్తూరు మండల పరిధిలోని పెంజర్లలో ఉన్న ఆనంతపద్మనాభ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి కార్తీక వనభోజనంలో పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ కార్తీక మాసం శివుడికి ఎంతో పరమ పవిత్రమైన మాసమని, ప్రతి భక్తుడు పూజలు చేసేందుకు ఇష్ట పడుతారని వివరించారు కార్తీక మాసంలో ఉసిరి చెట్టుకు పూజలు చేసి కార్తీక దీపం వెలిగించి వన భోజనాలు చేయడం పూర్వ జన్మ సుకృతంగానే భావించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. మాజీ జడ్పిటిసి సభ్యుడు మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, నియోజకవర్గ రెడ్డి సేవా అధ్యక్షుడు, గ్రంథాలయ కమిటి చైర్మెన్ మదన్‌మోహన్‌రెడ్డి, కేశంపేట మాజీ జడ్పిటిసి సభ్యురాలు తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, చెంది మహేందర్‌రెడ్డి, మహిళా అధ్య క్షురాలు అరుంధతి, మానస, సరితా, మంజుల పాల్గొన్నారు.

## కోటి దీపాల కాంతుల్లో కార్తీక శోభ

ప్రజాపక్షం/షాద్‌నగర్: కోటి దీపాల కాంతుల్లో కార్తీక శోభ అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి షాద్‌నగర్ పట్టణ సమాపంలోని హాజీపల్లి రోడ్డులో ఆకుల మాణయ్య ఛత్రపతి శివాజీ సంస్కృతిక సామాజిక సేవా సంస్థ నిర్వ హించిన కోటి దీపోత్సవ కార్యక్రమాలను మూడు రోజుల పాటు కన్నుల పండువగా నిర్వహించారు. స్థానిక శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్ హాజరై శివ పార్వతులకు ప్రత్యేక పూజలు చేశారు. వేద పండి తుల ఆశీర్వచనాలు అందుకున్నారు. మాజీ శాసన సభ్యులు ఎల్గనమోని అంజయ్య యాదవ్,



ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి, మున్సి పల్ మాజీ చైర్మెన్ కొందూటి నరేందర్, విశ్వం, బిజెపి నేతలు శ్రీవర్ధన్‌రెడ్డి, పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డిలు హాజరై స్వామివారి కృపకు పాత్రుల య్యారు. వేలాది మంది భక్తుల శివనామస్మరణతో ఉత్సవ ప్రాంగణం ఒక్కసారిగా మారుమ్రోగిపో యింది. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ కార్తీక మాసం పరమశివుడికి ఎంతో ప్రీతి అని, ప్రతి ఒక్క భక్తుడు కార్తీక మాసంలో శివారాధన చేయడం జరుగుతుందని వివరించారు. ఈశ్వరానుగ్రహం లేనిదే చీమైన కుట్టదని, అలాంటి ఈశ్వరుడికి కార్తీక మాసంలో పూజలు చేయడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్లు తెలిపారు. కార్తీక మాసంలో పెద్ద ఎత్తును భక్తులు పాల్గొని దీపోత్సవం నిర్వహించడం చూస్తుంటే మనస్సుకు ఎంతో ప్రశాంతత ఉందని, దీని ద్వారా మన సంస్కృతి, సాంప్రదాయాలను భావి తరలకు అందించేం దుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. రాజ కీయ పార్టీలకు అతీతంగా భక్తకోటి కార్తీక దీపోత్స వంలో పాల్గొనడం చూస్తుంటే ఐక్యతను స్పష్టం చేసిందని తెలిపారు. వచ్చిన భక్తులకు సౌకర్యా లను కల్పించిన నిర్వాహకులను ప్రత్యేకంగా అభి నందించారు.

## నిందితులను కఠినంగా శిక్షించాలి

### కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోవిందు



ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్: కుల దురహంకార హత్య చేసిన నింధితులకు కఠి నంగా శిక్షించేందుకు ప్ర భుత్వం ఎల్లంపల్లి గ్రా మంలో ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఏర్పాటు చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోవిందు డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని ఎల్లంపల్లి గ్రామంలో కుల దుర హంకార హత్యకు గురైన రాజశేఖర్ మృతదేశానికి నివాళ్ళు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి అంతిమయాత్రలో పాల్గొన్నారు. గోవింద్ మాట్లాడుతూ ఎస్సీ కులానికి చెందిన వ్యక్తులు ఇతర కులాలకు చెందిన మహిళలకు పెళ్ళిళ్లు చేసుకొద్దని చట్టాలు ఏమైనా ఉన్నాయా అని ప్రశ్నించారు. తమ్ముడు చంద్రశేఖర్ యాదవ కులానికి చెందిన అమ్మా యిని ప్రేమించి పెళ్ళి చేసుకుంటే అన్న రాజశేఖర్‌ను అమ్మాయి తండ్రి కిడ్నప్ చేసి చిత్రహింసలు పెట్టి హత్య చేయడం ఎంతవరకు సమంజస మని ప్రశ్నించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసులనుసస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా ఎల్లంపల్లి లో రాజశేఖర్ అంత్యక్రియలు పోలీసులు బందోబస్తు మధ్య జరిగాయి.

# ఆయిల్‌పామ్ సాగుతోనే అధిక లాభాలు

### సహకారసంఘం జిల్లా అసిస్టెంట్ రిజిస్ట్రార్ రవికుమార్

ప్రజాపక్షం/యాచారం : ఆయిల్ ఫాం సాగులో రైతులు మేళకువలు పాటించి అధిక దిగుబడులు పొందాలని సహకార సంఘం రంగారెడ్డి జిల్లా అసిస్టేంట్ రిజిస్ట్రార్ యం. రవికుమార్ కొరారు. సోమవారం యాచారం మండల కేంద్రంలో ప్రాథ మిక వ్యవసాయ సహకార సంఘంలో ఉద్యాన, పట్టుపరిశ్రమ ...వాల్యు ఆయిల్ గ్యాస్ సర్వీసేస్ ప్రైవేటు లిమిటేడ్ అధ్యర్యంలో రైతులకు అవగా హన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా రవి కుమార్ మాట్లాడుతూ ఆయిల్ ఫాం సాగు పై 1993 చట్టం ప్రకారం ప్రభుత్వం బరోసా ఇస్తుం దన్నారు. యాచారం మండల సహకార సంఘం ద్వారా యాచారం మండలంలో 100 ఎకరాలు ఆయిల్ ఫాం సాగుకోసం ప్రభుత్వం అనుమతి నిచ్చిందన్నారు.ఎకరాకు పెట్టుబడి కింద 4 వేల 200 రూపాయలు అంద జెస్తుందన్నారు. రైతులు ఒక చెట్టుకు 20 రూపాయలు చేల్లించాలన్నారు.



ఎకరం పోలంలో 50 చేట్లు వేయడానికి విలుటుం దని తెలిపారు.డ్రిప్ పెట్టుకునే రైతులకు 90 శాతం సబ్సిడి ఇస్తుందన్నారు. బోరు తప్పకుండా ఉండా లన్నారు. మూడు సంవత్సరాలు రైతులు కష్టపడి సాగు చేసుకోవాలన్నారు.ఎప్పుడు పోలాన్ని తడిగా ఉంచుకోవాలన్నారు.రైతులు అయిల్ ఫాం సాగుపై దృష్టి సారించాలన్నారు.సాగు విధానం తెలియక రైతులు ఇబ్బందులు ఎదురుకుంటున్నా రని తెలిపారు. ప్రభుత్వం అయిల్ ఫాం సాగు చేసే రైతులకు అన్ని రకాల సదుపాయలు కల్పిస్తుంద న్నారు. సబ్సిడిలు కూడా అంద జేస్తుందని తెలి పారు.ఎకరా ఆయిల్ ఫాం సాగు చేస్తే 80 వేల రూపాయల నుండి లక్షరూపాయల వరకు అదాయం వస్తుందన్నారు.పంట కలుపు తదితర పనులను హర్టికల్చర్ అధికారులు ఎప్పటి కప్పుడు పర్యవేక్షణ చేస్తారన్నారు. ఎలాంటి సమస్యలున్న తమ దృష్టికి తెస్తే పరిష్కరించడానికి కృషి చేస్తా మని తెలిపారు. రైతులు ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలని కొరారు. సహకారసంఘం జూని యర్ ఇన్స్‌పెక్టర్ కె. మనోజ్‌రెడ్డి,సహకారసంఘం సిఈఒ నాగరాజు,వ్యవసాయాధికారి అర్ రవి నాథ్, కంపేని వైస్ ప్రేసిడేంట్ యం. రామోహన్ రావు,హర్టికల్చర్ అధికారి వేణ్‌గోపాల్,ఎరియా మేనేజర్ ప్రమోద్‌కుమార్ రైతులు పాల్గోన్నారు.

# క్రీడ

## జనవరి 7 నుంచి నాలుగో సీజన్




మహిళల క్రికెట్‌ను కొత్త పుంతలు తొక్కించిన మహిళల ప్రీమియర్ లీగ్ మరో ఎడిషన్‌కు సిద్ధమవుతోంది. మూడు సీజన్లుగా అభిమానులను స్టేడియాలకు రప్పించిన ఈ మెగా టోర్నీ నాలుగో సీజన్ జనవరిలోనే ప్రారంభం కానుంది. ఐదు ఫ్రాంచైజీలు రీటెన్షన్ జాబితాను సమర్పించడంతో వేలానికి సన్నాహకాలు చేస్తున్న నిర్వాహకులు.. టోర్నీ తేదీలను కూడా ఖరారు చేసే పనిలో ఉన్నారు. క్రిక్‌బజ్ కథనం ప్రకారం జనవరి 7 నుంచి ఫిబ్రవరి 3 వరకూ నాలుగో సీజన్ జరుగనుందని సమాచారం. వచ్చే ఏడాది భారత్, శ్రీలంక సంయుకంగా పురుషుల టీ20 వరల్డ్‌కప్ పోటీలకు ఆతిథ్యమిస్తున్నాయి. ఫిబ్రవరి మొదటి వారంలోనే ప్రపంచ కప్ జరుగనున్న నేపథ్యంలో డబ్ల్యుపిఎల్ షెడ్యూల్‌ను ముందుకు జరిపారు నిర్వాహకులు. అందుకే.. ఫిబ్రవరిలో ప్రారంభం కావాల్సిన టోర్నీ ఈసారి జనవరిలోనే షురూ కానుంది. అంతేకాదు మూడో సీజన్ మాదిరిగా కాకుండా డబ్ల్యుపిఎల్ నాలుగో సీజన్ మ్యాచ్‌లను రెండు నగరాల్లో నిర్వహించే అవకాశముంది.

### ఈ రెండు నగరాల్లోనే మ్యాచ్‌లు...

రెండు విడతలుగా సాగే ఈ మెగా ఈవెంట్‌కు ముంబై, బరోడాలను వేదికలుగా ఎంపిక చేసినట్టు విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. తొలిదశ మ్యాచ్‌లు నవీ ముంబైలోని డీవై పాటిల్ స్టేడియంలో.. రెండో దశ మ్యాచ్‌లు బరోడాలోని కోటంబి మైదానంలో డబ్ల్యుపిఎల్ మ్యాచ్‌లు ఆడించనున్నారు. జనవరి 16 నుంచి.. ఫిబ్రవరి 3న ఫైనల్ వరకూ బరోడానే వేదిక కానుందని టాక్. అయితే.. టోర్నీ ఆరంభ తేదీ, వేదికలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

### మంధానకు రికార్డు ధర

మహిళల ప్రీమియర్ లీగ్ నాలుగో సీజన్ కోసం భారత క్రికెటర్లను ఫ్రాంచైజీలు భారీ ధరకు రీటైన్ చేసుకున్నాయి. విశ్వవిజేతగా అవతరించిన టీమిండియాలోని సభ్యులైన స్మృతి మంధాన, జెమీమా రోడ్రిగ్స్, రీచా ఘోష్‌ల బ్యాండు వాల్యూ పెరగడమే కాదు రీటైన్ ధర కూడా కోట్లకు చేరింది. స్వదేశంలో ముగిసిన వరల్డ్ కప్‌లో చెలరేగి ఆడిన మంధానను రూ.3.50 కోట్ల రికార్డు ధరకు ఆర్సీబీ రీటైన్ చేసుకుంది. వరల్డ్ కప్‌లో ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా ఎంపికైన దీప్తి శర్మను యూపీ వారియర్స్ వదిలేసింది.

డబ్ల్యూపీఎల్ నాలుగో సీజన్ వేలంలో ఫ్రాంచైజీలు రూ.15 కోట్లు ఖర్చు చేయనున్నాయి. స్లాబ్స్ విషయానికొస్తే.. ఒక క్రికెటర్‌కు మాత్రమే రూ.3.5 కోట్లు చెల్లించే అవకాశముంది. రెండో ప్లేయర్‌కు రూ.2.5 కోట్లు, మూడో ప్లేయర్‌కు రూ.1.75కోట్లు, నాలుగో బ్యాటర్‌కు రూ.1 కోటి.. ఐదుగురు ప్లేయర్లకు రూ.50 లక్షలు వేలం పాట పాడాల్సి ఉంటుంది. ఒక ఫ్రాంచైజీ ఐదుగురిని అట్టిపెట్టుకుంటే వాళ్ల పర్స్ నుంచి రూ.9.75 ను తొలగిస్తారు. ఒకవేళ నలుగురిని రీటైన్ చేసుకుంటే.. రూ.8.75 కోట్లు.. ముగ్గురికి రూ.7.75 కోట్లు, ఇద్దరిని రీటైన్ చేసుకుంటే రూ.6 కోట్లు కట్ చేస్తారు.

**ముంబై ఇండియన్స్ :** నాట్ సీవర్ బ్రంట్ (రూ.3.5 కోట్లు), హర్మన్‌ప్రీత్ కౌర్ (రూ.2.5 కోట్లు), హేలీ మాథ్యూస్(రూ.1.7కోట్లు), అమన్‌జోత్ కౌర్(రూ.1.0కోట్లు), జి. కమలిని(రూ.50 లక్షలు). ప్రస్తుతం ముంబై పర్స్‌లో 5.75 కోట్లు ఉన్నాయంతే.

**ఢిల్లీ క్యాపిటల్స్ :** జెమీమా రోడ్రిగ్స్,(రూ.2.2 కోట్లు) షఫాలీ వర్మ(రూ.2.2 కోట్లు), మరిసేన్ కాప్(రూ.2.2 కోట్లు), అనాబెల్ సథర్‌లాండ్‌రూ.2.2 కోట్లు), నిక్కీ ప్రసాద్ అన్‌క్యాప్డ్‌రూ.50 లక్షలు). ఢిల్లీ పర్స్‌లో రూ.6.75 కోట్లు ఉన్నాయి.

**యూపీ వారియర్స్ :** శ్వేతా షెరావత్ (రూ.50 లక్షలు). పర్స్‌లో 14.5 కోట్లు ఉన్నాయి.

**ఆర్సీబీ :** స్మృతి మంధాన(రూ.3.5 కోట్లు), రీచా ఘోష్ (రూ.2.75కోట్లు), ఎలీసా పెర్రీ(రూ.2 కోట్లు), శ్రేయాంక పాటిల్(రూ.60లక్షలు)లను మాత్రమే రీటైన్ చేసుకుంది. పర్స్‌లో 6.15 కోట్లు ఉన్నాయి.

**గుజరాత్ జెయింట్స్ :** బేత్ మూనీ (రూ.3.5కోట్లు), అష్ గార్డ్‌నర్(రూ.2.5కోట్లు). పర్స్‌లో రూ.9 కోట్లు ఉన్నాయి.

## పిచ్ కాదు బ్యాటర్లే ముంచేశారు..

### టెక్నిక్‌తో ఆడితే గెలిచేవాళ్లం!

సునీల్ గవాస్కర్



స్వదేశంలో టెస్టు మ్యాచ్ ఓడిపోవడం ఏ జట్టుకైనా జీర్ణించుకోలేని విషయం. టర్నింగ్ పిచ్‌తో ప్రత్యర్థిని బోల్తా కొట్టించాలనుకున్న టీమిండియా ఇప్పుడు ఇదే పరిస్థితిలో ఉంది. నెలకు ముందే వెస్టిండీస్‌ను వైట్‌వాష్ చేసిన భారత్.. అనూహ్యంగా దక్షిణాఫ్రికాకు తలొగ్గడం అందర్నీ ఆగ్రహానికి గురి చేస్తోంది. ఈడెన్ గార్డెన్స్‌లో రెండు రోజులు ఆధిపత్యం చెలాయించి.. మూడోరోజు చేజేతులా మ్యాచ్‌ను సఫారీలకు అప్పగించడంపై మాజీల నుంచి తీవ్రమైన విమర్శలు వస్తున్నాయి. గెలవాల్సిన మ్యాచ్‌లో ఓటమికి కారణం పిచ్ కాదని, బ్యాటర్ల వైఫల్యమే ముంచిందని సునీల్ గవాస్కర్ అంటున్నాడు. ఈడెన్ గార్డెన్స్‌లో రెండో రోజు దక్షిణాఫ్రికా ఏడు వికెట్లు తీసి విజయం వాకిట నిలిచిన భారత జట్టు అనూహ్యంగా కంగుతిన్నది. 124 పరుగుల లక్ష్య ఛేదనలో ఒక్కరూ క్రీజులో నిలవక పోవడంతో 93కే కుప్పకూలింది. ఈ దారుణ ఓటమితో భారత కోచ్ గౌతం గంభీర్, సెలెక్టర్లు తీవ్ర విమర్శల దాడికి గురవుతున్నారు. టీమిండియా ఓటమిని విశ్లేషించిన గవాస్కర్ బ్యాటర్లదే తప్పని తేల్చాడు. 'క్రికెట్ ఫ్యాన్స్ ఎవరైనా సరే ఐదు రోజుల టెస్ట్ మ్యాచ్‌నే కోరుకుంటారు. అసలు ఆ ఫార్మాట్ ప్రత్యేకత అదే. అలాఅని ఈడెన్ గార్డెన్స్‌లో భారత జట్టు ఓటమికి పిచ్‌ను నిందించలేం. బ్యాటర్ల వైఫల్యమే పరాజయానికి కారణం. అందరూ స్టార్ ఆటగాళ్లే కానీ ఒక్కరు కూడా టెక్నిక్‌తో ఆడలేదు. షాట్ సెలెక్షన్ కూడా అధ్వానంగా ఉంది. స్పిన్నర్లను దీటుగా ఎదుర్కోలేకపోయారు అని. ఇక పిచ్ గురించిన వివాదం విషయానికొస్తే ఎవరూ జోక్యం చేసుకోవద్దు. క్యూరేటర్‌కే పిచ్ తయారీని వదిలేయాలి. అంతేతప్ప ఫలానా వికెట్ కావాలి? టర్న్ ఉండాలి? అని ఆదేశాలు ఇవ్వడం సరికాదు' అని గవాస్కర్ వెల్లడించాడు.

# యువతరంగం


## ఫోకస్

## నేర్చుకోవాల్సిన నైపుణ్య కళలు



శాశ్వతంగా ప్రయోజనం చేకూర్చే నైపుణ్యాలు లేదా కళలను నేర్చుకోవడం ప్రతి ఒక్కరికీ అవసరం. ప్రత్యేకించి యువతకు అత్యవసరం. ఎవరికి వారు తమకు ఏ రంగం ఇష్టమైనదో లేదా ఏ రంగంలోనైతే తాము రాణిస్తామో తెలుసుకోవాలి. అప్పుడే కొత్త నైపుణ్యాలను త్వరగా, సమర్థంగా నేర్చుకోవచ్చు లేదా మెరుగుపరచుకోవచ్చు. 'అడాప్ట్, ఇంప్రోవైజ్, ఓవర్‌కమ్' అనమే లక్షణాలను నిపుణులు తరచు చెప్తుంటారు. సవాళ్లు ఎదురైనప్పుడు, వాటికి అనువయ్యే విధంగా ప్రవర్తించడమే అడాప్టబిలిటీ, సమస్యలకు పరిష్కారాలను కనుగొనే క్రమంలో, కొత్తగా నేర్చుకున్న అంశాలకు లేదా తమకు ఇది వరకే తెలిసిన విషయాలకు మరింత మెరుగులు దిద్దుకోవాలి. దీనిని ఇంప్రొవైజేషన్‌గా పేర్కొంటారు. ఇక మూడోది ఓవర్‌కమింగ్.. అంటే, ఎదురయ్యే సమస్యల నుంచి సమర్థంగా బయటపడే లక్షణాన్ని అలవరచుకోవడం. వీటికి తోడు మెదడును ఎప్పుడు స్వచ్ఛంగా ఉంచుకోవాలి. అప్పుడే మనస్సు శాంతిగా, స్పష్టంగా ఉంటుంది. ఉత్తమ నిర్ణయాలు తీసుకోవడానికి దోహదం చేస్తుంది. నైపుణ్యాలతోపాటు వ్యక్తీకరణ నైపుణ్యం కూడా అత్యవసరం. మీ భావాలను, అవసరాలను స్పష్టంగా వ్యక్తీకరించడానికి ఈ అలవాటు సహాయపడుతుంది. మనో బలాన్ని పెంచుతుంది. ఆలోచనలు పంచుకోవడం.. చర్చించడం వల్ల ప్రగతికి మార్గాలు నిర్మించుకోవచ్చు. మీరు ఎవరితోనైనా ఒప్పందాలు కుదుర్చుకోవాలన్నా, లావాదేవీలు జరపాలన్నా విశ్వసనీయత కీలకం. స్పష్టత అనేది విశ్వసనీయతకు మార్గం. మీ విద్య, ఉద్యోగ, వ్యక్తిగత జీవితం కార్యకలాపాల్లో ఇది అత్యంత కీలకమై పాత్ర పోషిస్తుంది. అదే విధంగా, శ్రద్ధగా వినడం, నేర్చుకోవడం కూడా అవసరమే. వినడం ద్వారా, ఇతరులను అర్థం చేసుకోవచ్చు. స్వయంగా కొత్త విషయాలను తెలుసుకోవచ్చు. స్వయంకృతంగా పురోగతి సాధించడానికి, బలహీనతలను అధిగమించడానికి ఈ లక్షణం ఉండాలి.ప్రతి సమస్యను చిన్న చిన్న భాగాలుగా విభజించి, వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించడాన్ని అలవాటు చేసుకోవాలి. ఆత్మ పరిశీలన అనేది ఎదుగుదలకు నిచ్చన. మీ బలహీనతలు, లక్ష్యాలు, పురోగతిని తెలుసుకోవడానికి ఈ స్వభావం ఉపయోగపడుతుంది. భావజాల నైపుణ్యాలను పెంచుకునే క్రమంలో, ఇతరులను అర్థం చేసుకోవడం, వారికి సహానుభూతిని ప్రదర్శించడం ఒక అలవాటుగా మారాలి. మీ విలువలను మీరు తెలుసుకోవడం, పరిస్థితులు కఠినంగా ఉన్నా నిబద్ధత చూపడం, ఎదురయ్యే ప్రమాదాలను స్వీకరించి వాటిని సమర్థంగా ఎదుర్కోవడం తదితర లక్షణాలు ఆత్మబలాన్ని పెంచుతాయి. జీవితం మొత్తం రిస్క్‌లతో కూడుకున్న ప్రయాణం. అందుకే, రిస్క్ చేయడానికి వెనుకడుగు వేయకూడదు. రిస్క్ తీసుకోవడం ద్వారా అభివృద్ధి సాధించవచ్చు. అవిశ్రాంతమైన జీనన విధానాలతో తలమునకలై ఉన్నప్పటికీ, ఎప్పుకో ఒకప్పుడు.. ఎంతోకొంత విశ్రాంతి తీసుకోవడం అవసరం. శరీరాన్ని, మనసును ఆరోగ్యంగా ఉంచుకోవాలంటే, విశ్రాంతి కావాలి. చదవడం, అర్థం చేసుకోవడం ద్వారా, వివిధ విషయాలలో అవగాహన పెరుగుతుంది. ఈ నైపుణ్యాలు ఏ రంగంలో అయినా, జీవితంలో నీటిని, అభివృద్ధిని తీసుకురాగలిగేవే కాబట్టి, వీటిని వంటబట్టించుకోవడం అవసరం.

## స్మార్ట్‌ఫోన్ ధరకే డయాలిసిస్ యంత్రం!



వినడానికే ఆశ్చర్యం కలిగించే ఈ అసాధ్యాన్ని సుసాధ్యం చేసింది అన్యా పోఘురియన్. కెనడాకు చెందిన ఈ 17 ఏళ్ల విద్యార్థిని చేసిన ఈ అసాధారణ ఆవిష్కరణ ప్రపంచ ఆరోగ్య సేవల రంగాన్ని, ముఖ్యంగా తక్కువ ఆదాయం ఉన్న ప్రాంతాల్లో కిడ్నీ వ్యాధితో బాధపడే వారికి, పూర్తిగా మార్చివేస్తుందనడంలో ఆశ్చర్యం లేదు. ప్రపంచ వ్యాప్తంగా వేలాది మంది కిడ్నీ బాధితులు ఖరీదైన చికిత్సలు అందుబాటులో లేక ప్రాణాలు కోల్పోతున్న తరుణంలో అన్యా చేసిన ప్రయోగం హర్షణీయం. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో కూడా వేలాది మంది డయాలిసిస్ సౌకర్యం లేక జీవనమరణ స్థితిలో పడుతున్నారన్న సమాచారం ఆమెను ఆలోచింప చేసింది. ఈ సమస్యకు తెరదించాలన్న పట్టుదల పెరిగింది. అధిక ఖర్చులు, సదుపాయాల కొరత వంటి సమస్యలు ప్రజలను ఎలా బాధిస్తున్నాయో తెలుసుకున్న ఆమె, మార్పును తీసుకురావాలని నిర్ణయించుకుంది. సాధారణ భాగాలు, ఓపెన్ సోర్స్ ఇంజనీరింగ్ ఆధారంగా తక్కువ ఖర్చుతో సరికొత్త పరిష్కారం సిద్ధం చేయడానికి ఎన్నో రాత్రులు కష్టపడింది. గొప్ప ఫలితాన్ని సాధించింది. ఆసుపత్రుల్లో ఉపయోగించే యంత్రాల్లాగే ప్రధాన సేవలను అందించే, తీసుకెళ్లడానికి సౌకర్యమైన, తక్కువ ధరలో లభించే డయాలిసిస్ యంత్రాన్ని ఆమె రూపొందించింది. రోగుల రక్తంలో ఉన్న విష పదార్థాలు, అదనపు ద్రవాన్ని ఈ యంత్రం తొలగిస్తుంది. సాధారణ చికిత్సలు అందుబాటులో లేని పరిస్థితుల్లో ప్రాణాలను నిలబెడుతుంది. 500 డాలర్ల కన్నా తక్కువ ఖర్చుతో ఈ యంత్రం అందుబాటులోకి రావడం వల్ల, ఇంతకు ముందు ఆశ కోల్పోయిన లక్షలాది మంది ఇప్పుడు చికిత్సపై ఆశ పెంచుకుంటున్నారు. వైద్య నిపుణులు ఇప్పటికే దీనిపై దృష్టి సారించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థలు కూడా ఈ యంత్రాన్ని పల్లెటూర్ల ఆసుపత్రుల్లో, మొబైల్ వైద్య కేంద్రాల్లో ఉపయోగించే అవకాశాలపై పరిశీలిస్తున్నాయి. ఈ టీనేజర్ పని వయస్సు, ధనం వంటి అవరోధాలను దాటిపోయే 'ఆవిష్కరణ'కు అసలు అర్థాన్ని చూపించింది. నిజమైన శక్తి ఉద్దేశ్యంలోనూ, అభిరుచిలోనూ ఉంటుందని నిరూపించింది. సవాళ్లతో నిండిన ఈ ప్రపంచంలో, ఒక ఆలోచన ఎంతటి ప్రాణాలను కాపాడగలదో గుర్తు చేస్తుంది. కొన్నిసార్లు వైద్య రంగం భవిష్యత్తు పెద్ద పరిశోధనా కేంద్రాల్లో కాదు, పట్టుదలతో ముందుకు సాగే ఒక చిన్న మనసులోంచే వెలుస్తుంది. గొప్ప ఆవిష్కరణతో అన్యా యూత్ ఐకాన్‌గా మారింది.

### యూత్ ఐకాన్స్

ఎంతో మంది యువతీయువకులు దేశ కీర్తిప్రతిష లను ఇనుమడింప చేశారు. చిన్న వయసులోనే అత్యున్నత శిఖరాలను అధిరోహించారు. యువతకు మార్గదర్శకులుగా నిలిచారు. అలాంటి అద్వితీయ ప్రతిభావంతుల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం..

## నేటి నుండి 'హనుమకొండ'లో సిపిఐ బస్సు ప్రచార జాతా

### సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి




**ప్రజాపక్షం/హనుమకొండ :** భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సిపిఐ రాష్ట్ర బస్సు జాత హనుమకొండ జిల్లాలో ఈ నెల 18, 19 తేదీలలో భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ లో, ఎలకతుర్తి, హసన్ పర్తి, హనుమకొండ, దామర, శాయంపేట మండలాల మీదగా కొనసాగుతూ పరకాలలో ముగింపు చేసుకొని జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు వెళ్లనున్నట్టు సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి తెలిపారు. కార్యకర్తలు, నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జాతను విజయవంతం చేయగలరని కోరారు. కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తల త్యాగాలు, అమరవీరుల రక్తతర్పణంతో సిపిఐకి ఈ దేశంలో ఒక స్థానం ఉందని తెలిపారు.నేటి పాలకులు ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ ధ్వంసం చేస్తూ ప్రైవేట్ పెట్టుబడిదారులకు కార్పొరేట్ సంస్థలకు దక్కే విధంగా లక్షల కోట్ల రూపాయల విలువైన సంస్థలను కట్టబెడుతున్నారని విమర్శించారు. సిపిఐ రాష్ట్ర బస్సు జాతకు నాయకత్వం సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడా వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేణి శంకర్, సిపిఐ రాష్ట్ర నాయకులు మారూపాక అనిల్, మణికంఠ రెడ్డి లతో పాటు ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు పాల్గొంటున్నారని భిక్షపతి తెలిపారు.

### 20న ములుగులో..



**ప్రజాపక్షం/ములుగు:** సిపిఐ ఆవిర్భవించి 100 సంవత్సరాలు నిండిన సందర్భంగా శత జయంతి ఉత్సవాల పేరుతో జరుగుతున్న ప్రచారంలో భాగంగా ములుగు వ్యవసాయ మార్కెట్‌లోని మార్కెట్ హమాలీలు, సివిల్ సప్లయి హమాలీ కార్మికుల సంయుక్త సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్ మాట్లాడారు. పార్టీ ఆవిర్భవించిన నాటి నుండి కార్మికుల చట్టాల కోసం కార్మికుల హక్కుల కోసం కనీస వేతనాల కోసం రైతులకు గిట్టుబాటు ధర కోసం ఉపాధి హామీ చట్టం కోసం, సమాచార హక్కు చట్టం కోసం, అటవీ హక్కుల చట్టం కోసం సబ్బండ వర్గాలకు అవసరమైన అనేక చట్టాలను సాధించడం కోసం జరిగిన పోరాటాలు చేసిన పార్టీ సిపిఐ పార్టీ అన్నారు. ఈ నెల 20న ములుగు జిల్లా కేంద్రంలోని సిపిఐ బస్సు జాత ప్రవేశిస్తున్నందున ఆ జాతకు నాయకత్వం వహిస్తున్న సిపిఐ మాజీ కార్యదర్శి మాజీ ఎంఎల్‌ఏ చాడ వెంకట్‌రెడ్డి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్ళపల్లి శ్రీనివాసరావు తదితర నాయకులు హాజరవుతున్నారు.ములుగు జిల్లా కేంద్రంలోకి ఉదయం 11 గంటలకు చేరుకొని జాతా కార్యక్రమాలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండి అంజద్ పాషా, నాయకులు రామన్న, వాంకుడోత్ వీరన్న, రొంటాల రమేష్, యాటల పైడి, బిక్షపతి, కుమార్ పాల్గొన్నారు.

## దళారులను నమ్మొద్దు.. కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మాలి

### చాతకొండ, సోములగూడెంలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన కూనంనేని సాంబశివరావు





**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** రైతులు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు చేసే విధంగా అధికారులు ఏర్పాట్లు చేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా సహించేది లేదని కొత్తగూడెం ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోని చాతకొండ గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, కొత్తగూడెం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. రైతు సభలో కూనంనేని మాట్లాడుతూ రైతులు దళారులను ఆశ్రయించకుండా సహకార సంఘాల ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ధాన్యం కొనుగోలు విషయంలో అధికారులు ఎటువంటి అలసత్వం వహించకుండా, నాణ్యతా ప్రమాణాలు పేరుతో రైతులకు ఇబ్బంది పెట్టకుండా, తరుగుపేరుతో కోతవిధించకుండా సత్వరమే ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో కొనుగోలు కేంద్రాల నిర్వహణలో ఏమైనా సమస్యలు తలెత్తితే తమ దృష్టికి తీసుకురావాలని, తక్షణమే పరిష్కరిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. సంఘం అధ్యక్షులు మండే వీరహనుమంతరావు, ఉపాధ్యక్షులు కూచిపూడి జగన్, డైరెక్టర్ చంద్రగిరి శ్రీనివాసరావు, తహశీల్దార్ శిరీష, ఎంపిడిఓ రాకేష్, సివిల్ సప్లై డిటి మహేష్, విద్యుత్ శాఖ ఏఇ రాఘవయ్య హౌసింగ్ ఏఇ డేవిడ్, అర్‌ఐ శివకృష్ణ, సిపిఐ నాయకులు దీటి లక్ష్మీ పతి, నూనావత్ గోవిందు, మంద గ్రాబ్రియేల్, కోడి లింగయ్య, పర్స లక్ష్మయ్య, మాధవరావు, మంకెన ప్రసాద్, క్రాంతి భూషణ్, ఏఇఓలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

### గోనె సంచులు అందుబాటులో ఉంచాలి

**పాల్వంచ :** రైతులకు గిట్టుబాటు ధర కావాలంటే ప్రభుత్వం ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించి మద్దతు ధర పొందాలని ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. మండల పరిధి సోములగూడెంలో దాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు.సభలో కూనంనేని మాట్లాడుతూ ఆరుగాల కష్టించి పండించిన పంటను త్వరగా అమ్ముకోవాలనే ఆతృతతో దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని హెచ్చరించారు. నియోజకవర్గ వ్యాప్తంగా సహకార సంఘాల ఆధ్వర్యంలో దాన్యం కొనుగోలు కేంద్రాలను ఏ ర్పా టు చేయటం జరుగుతుందన్నారు. ప్రభుత్వ కేంద్రాలలో విక్రయించి మ ద్దతు ధరతో పాటుగా బో న స్‌ను పొంది ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నారు. రైతులు తీసుకొచ్చిన దాన్యాన్ని జాప్యం చేయకుండాకొనుగోలు చేయాలని, గోనె సంచుల కొరత లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. డిసిఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి శంభో శంకర్, సొసైటీ ఉపాధ్యక్షులు కాంపల్లి కనకేష్, తహశీల్దార్ దారా ప్రసాద్, ఎంపిడిఓ విజయ భాస్కర్ రెడ్డి, సొసైటీ డైరెక్టర్లు, సిపిఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, జిల్లా కమిటి సభ్యులు ఉప్పుశెట్టి రాహుల్, నాయకులు అన్నారపు వెంకటేశ్వర్లు, ఇట్టి వెంకటరావు, నిమ్మల రాంబాబు, రంజిత్, రైతులున్నారు.

## పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

### సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం) :** పత్తి కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి పత్తి కొనుగోలు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి ప్రభుత్వాని కోరారు. సోమవారం మండల కేంద్రంలో జరిగిన సిపిఐ పార్టీ కౌన్సిలింగ్ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో ఆవిర్భవించిన భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) భారత గడ్డపై వందేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఖమ్మంలో డిసెంబర్ 26న భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని ఈ భారీ బహిరంగ సభను జయప్రదం చేయడానికి రాష్ట్ర పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బస్సు జాత ఈనెల 20, 21, 22 తేదీలలో జిల్లాలో అన్ని మండలాలు తిరుగుతుందని బస్సు జాతను డప్పులు, కళాకారులతో ఘన స్వాగతం పలికి సభలు నిర్వహించి సిపిఐ పోరాట చరిత్రను ప్రజలకు వివరించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దామోదర్ రెడ్డి పిలుపునిచ్చారు. పత్తి కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి రైతులు ఇబ్బందులు తొలగించాలని, స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చిన సిపిఐ సిద్ధంగా ఉందని అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఎన్నో నిర్బంధాలను ఎదుర్కొని స్వాతంత్ర ఉద్యమంలో అగ్ర బాగాన నిలబడి పోరాటం చేసిందనీ, భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి నుండి విముక్తి కోసం పోరాటాలు నిర్వహించిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీదని 4వేల కమ్యూనిస్టుల బలిదానం తో 10 లక్షల ఎకరాల భూమిని పేద ప్రజలకు పంచిన చరిత్ర అని గుర్తు చేశారు. దేశంలో ఎదుర్కొంటున్న కార్మిక కర్షక విద్యార్థి నిరుద్యోగ సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ పోరాటాలు చేస్తున్నదని అయన అన్నారు. సిపిఐ శతజయంతి ఉత్సవాల ముగింపు బహిరంగ డిసెంబర్ 26న ఖమ్మంలో నిర్వహిస్తున్న బహిరంగసబకు యాదాద్రి భువనగిరి జిల్లా నుండి పార్టీ కార్యకర్తలు, సానుభూతి పరులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మరుపాక వెంకటేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పల ముత్యాలు, ఎండీ ఇమ్రాన్, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశికంటి లక్ష్మి నర్సయ్య, మండల సహాయ కార్యదర్శి ఎండీ నయీమ్, రైతు సంఘం జిల్లా నాయకులు జక్క దయాకర్ రెడ్డి, చేనేత సంఘం జిల్లా నాయకులు జెల్ది రాములు, నాయకులు సుల్తాన్ పూరషోతం, యాస బుచ్చి రెడ్డి, ఆంబోజి రాములు, దుర్గాపతి నర్సయ్య, మరుపాక అంజయ్య, సోమనబోయిన నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

## అన్ని వర్గాల కోసం నిరంతర పోరాటం

### సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/తుంగతుర్తి(తిరుమలగిరి):** ఖమ్మంలో డిసెంబర్ 26న భారత కమ్యూనిస్టు పార్టీ 100 వసంతాల ముగింపు ఉత్సవాలను జయప్రదం కోసం నవంబర్ 15న బాసరలో ప్రారంభమై తుంగతుర్తి నియోజక వర్గ తిరిమలగిరికి చేరుకొని నాగారం, తుంగతుర్తి, మద్దిరాల, నూతనకల్ మండలాల్లో జరుగు జాతను జయప్రదం చేయాలని సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పార్టీ శ్రేణులను కోరారు. సోమవారం మల్లీశ్వరి థియేటర్‌లో నియోజక వర్గ ఇంచార్జి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్లంల యాదగిరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఈ జాతలో జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలి ఉల్లా ఖాద్రీ, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కోశాధికారి డిజి నరేంద్రప్రసాద్ రానున్నారని తెలిపారు. వారికి ఘనమైన స్వాగతం పలికి జయప్రదం చేయాలన్నారు. తిరుమలగిరి, నూతనకల్, తుంగతుర్తి మండలాల కార్యదర్శులు ఎస్‌డి ఫయాజ్, తొట్ల ప్రభాకర్, పాల్వాయి పున్నయ్య, ఏఐటియుసి జిల్లా నాయకులు రాజారామ్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు జంపాల మల్లయ్య, కె రామస్వామి, తిపిరాల శ్రీకాంత్, ఎండి ఏక్‌బాల్, యానాల వెంకట్, పురుషోత్తం, నాగులగాని మల్లయ్య పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## ఘనంగా అభిషేక పూజలు



ప్రజాపక్షం/వీపనగండ్ల : వీపనగండ్ల మండలంలోని పలు శివాలయాల్లో కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా భక్తులు భక్తి శ్రద్ధలతో అభిషేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున నుంచే దేవాలయాల్లో భక్తుల రద్దీ పెరిగి, శివాలయ పరిసరాలు ఓం నమశ్శివాయ నాదంతో మర్మోగాయి. మండలంలోని కల్వరాల్లో ఉన్న పురాతన శివాలయంలో ప్రత్యేకంగా రుద్రాభిషేకం నిర్వహించగా, వీపనగండ్ల ఎస్సై కె.రాణి దంపతులు స్వయంగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పంచామృతాలు, పవిత్ర జలాలతో అభిషేకాలు నిర్వహించడంతో ఆలయం ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయింది. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై శివార్చలు చేసుకొన్నారు. కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో శివాలయాన్ని శివ నామస్మరణతో మార్మోగాయి.

## కూలీలను తరలిస్తున్న బోలెరో వాహనం పట్టివేత

ప్రజాపక్షం/కొత్తపల్లి : కొత్తపల్లి మండల కేంద్రంలో సోమవారం రోజు నిబంధనలకు విరుద్ధంగా బోలెరో వాహనంలో కూలీలను తరలిస్తున్న గూడ్స్ వాహనాన్ని మద్దూర్ పోలీసులు పట్టుకున్నారు. అనంతరం గూడ్స్ వాహనాన్ని మద్దూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్సై విజయ్‌కుమార్ మాట్లాడుతూ డ్రైవర్, ఓనర్లకు అవగాహన కల్పిస్తూ మొదటిసారి గూడ్స్ వాహనాల్లో కూలీలను తరలిస్తే డ్రైవర్, ఓనర్‌లపై ఫైన్ విధిస్తామన్నారు. రెండవసారి పట్టుబడితే డ్రైవర్, ఓనర్‌లపై రోడ్డు భద్రత చట్టం ప్రకారం కేసు నమోదు చేసి ఆర్‌టిఓ అధికారికి పంపిస్తామని డ్రైవర్, ఓనర్‌లను ఎస్సైహెచ్చరించారు.

## మహిళలకు ఉద్యోగ అవకాశాలు



ప్రజాపక్షం/కల్వకుర్తి : నియోజకవర్గ మహిళలకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని ఐక్యతఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సిఓఓ సుంకిరెడ్డిరాఘవేందర్‌రెడ్డి అన్నారు. 3వేలమంది మహిళలకు ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు. ఇటీవల జరిగిన ఇంటర్వ్యూల ప్రక్రియద్వారా 71మంది మహిళలు ఉద్యోగంలో చేరారన్నారు. తుక్కుగూడలోని ప్రముఖ ఎలక్ట్రానిక్స్ కంపెనీలో మహిళలు ఉద్యోగాల్లో చేరుతున్న సందర్భంగా కంపెనిని సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఉద్యోగాలు చేయడం వలన కుటుంబ ఆర్థికస్థితి మెరుగై, పిల్లలచదువు వైద్య, గృహ అవసరాలపై భారం తగ్గుతుందన్నారు. ఆత్మవిశ్వాసంపెరిగి, కుటుంబ పరిస్థితులను నిర్ణయించడంలో మహిళలు కీలకపాత్ర పోషించగలుగుతున్నారని అన్నారు. సమాజంలో మరింత గౌరవం, గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ కంపెని ప్రతినిధులు, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు శేఖర్, శ్రీపతి, కల్యాణ్ పాల్గొన్నారు.

## పత్తి కొనుగోలు వెంటనే చేపట్టాలి

ప్రజాపక్షం/ఉట్కూర్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జిన్నింగ్ మిల్లర్ల సమస్యలు పరిష్కారం చేసి వెంటనే సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు చేపట్టాలని సామాజిక కార్యకర్త హెచ్.నర్సింహా ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. సీసీఐ వారు పూటకో నిబంధన పెట్టడం వలన అటు రైతులు, ఇటు జిన్నింగ్ మిల్లుల వారు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సోమవారం నుండి పత్తి కొనుగోలు నిలిచిపోవడం వలన పత్తి రైతులు ఆందోళనకు గురి అవుతున్నారని తెలిపారు. చలి ప్రభావం ఎక్కువ ఉండడం వలన పత్తి ఎండకు ఆరబెట్టిన కూడా స్లాట్ బుక్ చేసుకునే మిల్లుకు తీసుకొని పోయిన తర్వాత తేమ శాతం 12 కంటే ఎక్కువ వస్తుందని అన్నారు. 20 శాతం వరకు తేమ ఉన్న పత్తిని కూడా సీసీఐ ద్వారా కొనే విధంగా సంబంధిత అధికారులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. ఏడు క్వింటాళ్ల నిబంధన ఎత్తివేసి ఎకరాకు 12 క్వింటాళ్ల పత్తి కొనాలను డిమాండ్ చేశారు. అధిక వర్షాల కారణంగా పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయారు కావున ఎకరాకు 25 వేల నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి అని కోరారు.

## ప్రజలు సోదరాభావంతో మెలగాలి



ఎస్సై విజయ్‌కుమార్

ప్రజాపక్షం/కొత్తపల్లి : మండల కేంద్రాన్ని సోమవారం రోజు మద్దూర్ ఎస్సై విజయ్‌కుమార్ సందర్శించారు. గ్రామంలో ప్రజలతో మాట్లాడి వారి స్థితిగతులను, స్థానిక సమస్యలను ,భద్రత అంశాలను అడిగి తెలుసుకున్నారు. రాబోయో పంచాయతి ఎన్నికలు శాంతియుతంగా నిష్పక్షపాతంగా జరిగేందుకు అందరు సహకరించాలని సూచించారు.స్థానిక సంస్థల ఎన్నికల సమయంలోలాంటి వివాదాలు, అక్రమాలు, బెదిరింపుల చర్యలను గమనించిన వెంటనే పోలిసులకు సమాచారం ఇవ్వాలని అవగాహన కల్పించారు. అలాగే గ్రామాలలో మత్తు పదార్థలకు దూరంగా ఉండాలని, ప్రజలంతా కలిసి మెలిసి సోదరా భావంతొ మెలగాలని కోరారు. గ్రామ ప్రజలకు సమస్యలుంటే ఆయా అధికారులతో చర్చించి పరిష్కరించడం జరుగుతుందని ఎస్సై తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలిసు సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గోన్నారు.

## అన్నదాతకు అడుగడుగునా అవస్థలే

వరి కొనుగోలు చేయాలని రైతులకు మద్దతుగా జాతీయ రహదారిపై రాస్తారోకోలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం



ప్రజాపక్షం/మాగనూర్ : ఆరుగాలం కష్టపడి చెమటోడ్చి పండించిన పత్తి పంటను ప్రభుత్వం కొనలేక రైతన్నలు ఇబ్బందుల పాలు చేయడంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతన్నలకు అన్ని కష్టాలే మిగిలాయని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి అన్నారు. సోమవారం మక్తల్ నియోజకవర్గంలోని మాగనూరు మండలం వడ్వాట్ రోడ్‌లో ఉన్నటువంటి పత్తి మిల్లులో రైతుల వద్ద పత్తి కొనుగోలు నిలిపివేయడంతో, ఆగ్రహించిన రైతన్నలు పత్తిని వెంటనే కొనుగోలు చేయాలని జాతీయ రహదారిపై నిరసన కార్యక్రమానికి దిగారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి హుటాహుటిన అక్కడికి చేరుకొని రైతుల పక్షాన ధర్నా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ రైతుల పండించిన పంటను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం కొరవీలు పెడుతూ ఉందని, రైతన్నలు పొలంలో పండించిన పంటను మాత్రమే కొనుగోలు కేంద్రాలకు ఇస్తున్నా తప్ప, ఇతర పంటను తీసుకురావడం లేదని అన్నారు. ఎకరాకు 12 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేయాల్సిన ప్రభుత్వం, ఏడు క్వింటాల్లు కొంటామని కొరవీలు పెట్టి, ఏడు క్వింటాలు సైతం కొనుగోలు చేయకుండా, రైతులను ఇబ్బంది పాలు చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే రాష్ట్రానికి కష్టాలతో పాటు, రైతన్నలకు కష్టాలు తప్పడం లేదని మాజీ ఎమ్మెల్యే చిట్టెం అన్నారు.

# మెరుగైన రవాణా సౌకర్యానికే నూతన బస్సులు

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



ప్రజాపక్షం/కల్వకుర్తి : మెరుగైన రవాణా సౌకర్యం కోసమే నూతనంగా బస్సులను ప్రారంభించినట్లు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఆర్‌టిసి బస్టాండు ఆవరణలో గచ్చిబౌలి, శ్రీశైలం డీలక్స్, ఎక్స్‌ప్రెస్ బస్సుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ఆర్‌ఎం, డిఎం ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి, బాలాజిసింగ్‌కు పుష్పగుచ్చం అందజేసి స్వాగతం పలికారు. ఈసందర్భంగా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ బాలాజిసింగ్, మహబూబ్‌నగర్ రీజినల్ మేనేజర్ సంతోష్ కుమార్, డిపోమేనేజర్ సుభాషిని, అసిస్టెంట్ మేనేజర్ శ్వేత, స్థానిక నాయకులతోకలిసి ఎమ్మెల్యే జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. కల్వకుర్తి నుండి గచ్చిబౌలికి వెళ్లే సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు ప్రయాణం ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ఆర్‌టిసి అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. ప్రయాణికులకోసం మెరుగైన రవాణ సౌకర్యం కల్పించడమే లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో కమీషనర్ మహ్మద్‌షేక్, ఎఈ షబ్బీర్‌అహ్మద్, నాయకులు ఆనంద్‌కుమార్, విజయ్‌కుమార్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, జిల్లెల రాములు, భూపతిరెడ్డి, సంజీవ్‌యాదవ్, గోరేటిశ్రీనివాసులు, ఎజాస్, సతీష్‌కుమార్, సంతుయాదవ్, పాండురంగారెడ్డి, రామరాజు, రాకేష్‌కుమార్, నానియాదవ్, శ్రీకాంత్, దున్నసురేష్, ఆరిఫ్, జంగయ్య, శేఖర్, రవి, వీరేష్, ముత్యాలు, జగదీష్, మల్లయ్య, ఆర్‌టిసి సిబ్బంది, ప్రయాణికులు పాల్గొన్నారు.

**గచ్చుబావి పురాతన శివాలయ అభివృద్ధికి కృషిచేస్తా**

కల్వకుర్తి పట్టణంలోని గచ్చుబావి పురాతన శివాలయం అభివృద్ధికి కృషిచేస్తానని ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి అన్నారు. సోమవారం ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి, స్థానిక నాయకులు అధికారులతో కలిసి గచ్చుబావి శివాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో చేపట్టిన శ్రమదానంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురాతన శివాలయంను ఉపయోగంలోకి తీసుకువచ్చేందుకు సిఎం రేవంత్‌రెడ్డి , మంత్రి జూపల్లికృష్ణారావులతో గచ్చుబావి శివాలయం అభివృద్ధికి కృషిచేస్తానని తెలిపారు.

# ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన కలెక్టర్



ప్రజాపక్షం/నారాయణపేట : కొడంగల్ నియోజకవర్గం గుండుమల్ గ్రామంలో నిర్మాణం పూర్తయిన ఇందిరమ్మ ఇండ్లను కడ ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పైలట్ గ్రామమైన ముదిరెడ్డిపల్లికి మొత్తం 104 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడం జరిగిందని, అందులో సోమవారం ఆరు ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. లబ్దిదారులు కూడా ఆనందం వ్యక్తం చేశారని ఆమె తెలిపారు. గ్రామంలో ఇంకా 91 ఇండ్ల నిర్మాణాలు రూఫ్ లెవెల్, స్లాబ్ లెవెల్, బేస్‌మెంట్ లెవల్ లలో కొనసాగుతున్నాయన్నారు. వాటిని కూడా పూర్తి చేసుకునేలా లబ్దిదారులకు మోటివేట్ చేస్తున్నామని, నిర్మాణాలు పూర్తి చేసేందుకు ఇదే సరైన సమయం అని, ప్రతి సోమవారం లబ్దిదారుల ఖాతాలో డబ్బులు జమ అవుతున్నాయని కలెక్టర్ తెలిపారు. నిజానికి 5 లక్షలు రావడం దేశంలో ఎక్కడా లేదని ఇందిరమ్మ ఇండ్లకు మన రాష్ట్రంలో ప్రభుత్వం ఇస్తుందని, 5 లక్షలను సక్రమంగా వినియోగించుకోవాలని లబ్దిదారులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. అదే విధంగా ఎవరెవరికైతే ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయో వారికి మహిళా సంఘాల ద్వారా రుణాలు, అలాగే శ్రీనిధి బ్యాంకు ద్వారా రూ.50 వేలు ఇచ్చేందుకు ముందుకు వచ్చారని తెలిపారు. ఏది ఏమైనా, ఎలాంటి సమస్య ఉన్నా నారాయణపేట జిల్లా కొడంగల్ నియోజకవర్గంలో ఇందిరమ్మ లబ్దిదారులందరికి వాళ్ల ఇండ్లను నిర్మించుకునేందుకు తోడ్పాటు అందిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ శంకర్, గుండుమల్ తాహసీల్దార్, ఎంపీడీవో, హౌసింగ్ ఏఈ, రెవెన్యూ అధికారులు, పంచాయితీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా వ్యతిరేక విధానాలపై సమరం





ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

సిపిఐ బస్సు ప్రచార జాతలో ప్రభుత్వంపై ధ్వజం

జడ్చర్లకు చేరిన సిపిఐ ప్రచార జాతాకు ఘనంగా స్వాగతం

ప్రజాపక్షం/జడ్చర్ల/అచ్చంపేట: ప్రజాస్వామ్య వ్యవస్థకు మూల స్తంభమైన భారత రాజ్యాంగ పీఠికకు కేంద్రంలోని నరేంద్ర మోడీ సర్కార్ ఉరితాళ్లు పేనుతుందని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ధ్వజమెత్తారు. సోమవారం భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ శతాబ్ది ముగింపు ఉత్సవాల నేపథ్యంలో డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభ సందర్భంగా చేపట్టిన రాష్ట్ర వ్యాప్త బస్సు జాత జడ్చర్ల పట్టణానికి చేరుకుంది. ఈ ప్రచార జాతకు సిపిఐ శ్రేణులు ప్రజాసంఘాల నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ప్రజానాట్యమండలి కళాకారుల ఆటపాటలతో సభాస్థలం మారుమోగింది. ఈ సందర్భంగా జరిగిన సిపిఐ ప్రచార సభలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26న కాన్పూర్లో సంపూర్ణ స్వాతంత్ర రణ నినాదంతో సిపిఐ ఏర్పడిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాలనరసింహ, సిపిఐ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్ ప్రసంగించగా ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు కె.శ్రీనివాస్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బాగీ కృష్ణ యాదవ్, అల్వాల్ రెడ్డి, గోవర్ధన్ , పి.సురేష్, డి.రాము, కే.పద్మావతి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సి.రాజు, జడ్చర్ల పట్టణ కార్యదర్శి కలీం, సిపిఐ నాయకులు మన్సూర్, రాజశేఖర్, భాస్కర్‌రెడ్డి, జంగయ్య, వెంకటేశ్, రాష్ట్ర ప్రజానాట్య మండలి బృందం జగన్, గణేష్, ప్రవీణ్, వెంకన్న, భాస్కర్, జాను, లింగం పాల్గొన్నారు.

**చరిత్ర పునాదులతో అభివృద్ధిలో ముందుండాలి**

పార్టీ గతచరిత్రను నెమరువేసుకుంటూ ప్రస్తుత ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు శ్రమించడమే పార్టీ లక్ష్యమని సిపిఐపార్టీ జాతీయ కార్యవర్గసభ్యుడు బాల్‌నర్సింహ్మా, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. సోమవారం సాయంత్రం పట్టణంలో సిపిఐ బస్సుయాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా పట్టణంలోని బస్టాండులో సిపిఐ సమావేశం నిర్వహించారు. ముందుగా చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. జిల్లాకార్యదర్శి ఎస్‌ఎండి ఫయాజ్, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, రాష్ట్ర కమ్యూనిస్టు నాయకులు డాక్టర్ శ్రీనివాసులు, జిల్లానాయకులు పరుష రాములు, నరేష్, అచ్చంపేట నాయకులు పెరుమాలగోపాల్ పాల్గొన్నారు.

**సిపిఐకి కాంగ్రెస్‌పార్టీ మద్దతు**

బస్సుజాత సందర్భంగా అచ్చంపేటకు వచ్చిన సిపిఐ బస్సుబృందానికి అచ్చంపేట కాంగ్రెస్ నాయకులు కాశన్నయాదవ్ స్వాగతం పలికారు. సోమవారం పట్టణంలోఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంకు శాలువాతో సన్మానించారు. అనంతరం కాశన్నయాదవ్ మాట్లాడుతూ కష్టపడే పార్టీలకు శ్రామికులపార్టీలకు తమ మద్దతు ఉంటుందని, వచ్చే డిసెంబర్‌లో నిర్వహించబోయే కమ్యూనిస్టుపార్టీ శతాబ్ది ఉత్సవాలకు తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

# సీనియర్ సిటిజన్ యాక్ట్‌పై విస్తృత ప్రచారం



ప్రజాపక్షం/నారాయణపేట్ : సీనియర్ సిటిజన్స్ యాక్ట్‌పై అధికారులు క్షేత్రస్థాయిలో సంపూర్ణ అవగాహన కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, శ్రీను అన్నారు. వయోవృద్ధుల వారోత్సవాలలో భాగంగా సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని ప్రజావాణి హాల్‌లో అధికారులకు సీనియర్ సిటిజన్ యాక్ట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ.. 60 ఏళ్లు పైబడిన సీనియర్ సిటిజనులకు కొన్ని హక్కులు ఉన్నాయని, వాటిపై గ్రామ స్థాయిలో ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. వృద్ధులను పట్టించుకోకుండా, నిర్లక్ష్యం చేస్తే ఆర్డీఓకు ఫిర్యాదు చేయవచ్చని, అలా ఫిర్యాదు చేసిన మూడు నెలల్లో ఆయా వృద్ధులకు న్యాయం జరుగుతుందని వారు భరోసా ఇచ్చారు. దూర ప్రాంతాలకు చెందిన వృద్ధులు జిల్లా కేంద్రానికి వచ్చే అవసరం లేదని ఎల్డర్ లైన్ 14567 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలను చెప్పినా వారి ఫిర్యాదును పరిగణలోకి తీసుకుంటారన్నారు. తల్లిదండ్రులను పట్టించుకొని వారు ఒక వేళ తల్లిదండ్రి ఆస్తి గానీ, భూమి గాని అనుభవిస్తుంటె వారి ఆస్తి. భూమి హక్కులను రద్దు చేసి తిరిగి వృద్ధులైన తల్లిదండ్రుల పేరిట మళ్ళీ రిజిస్ట్రేషన్ చేయించే అధికారం కలెక్టర్‌కు ఉంటుందని ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు పేర్కొన్నారు. సీనియర్ సిటిజన్స్ యాక్ట్‌పై మారుమూల ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని వారు అధికారులను ఆదేశించారు. అలాగే మంగళవారం డ్రగ్స్ నిషేధంపై విద్యార్థులచే సామూహిక ప్రతిజ్ఞ చేయాలని అన్ని ప్రభుత్వ కార్యాలయాలలోనూ ప్రతిజ్ఞ చేసి ఫోటోలు పంపించాలని డిడబ్ల్యూవో కార్యాలయ ఉద్యోగి సాయి అధికారులను కోరారు. డిప్యూటీ కలెక్టర్ శ్రీరామ్ ప్రణీత్, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా సేవే మా లక్ష్యం...

ప్రజావాణిలో ప్రజలతో నేరుగా సంభాషించిన ఎస్పీ రావుల గిరిధర్



ప్రజాపక్షం/వనపర్తి : ప్రతి సోమవారం ప్రజావాణిలో భాగంగా వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిలో భాగంగా జిల్లాలో సోమవారం వివిధ ప్రాంతాల నుండి 10 మంది ఫిర్యాదు దారులు వివిధ సమస్యలపై నేరుగా జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఫిర్యాదులు అందించారు. ఫిర్యాదు చేసిన ప్రతి ఫిర్యాదుపై వనపర్తి ఎస్పీ స్పందించి స్వయంగా ఫిర్యాదును పరిశీలించి సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులకు తక్షణమే సదరు ఫిర్యాదులపై చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీనితో ఫిర్యాదు దారులకు న్యాయం జరుగుతందనే భరోసాను కలిగించే విధంగా జిల్లా ఎస్పీ చర్యలు తీసుకోవడంపై వచ్చిన ఫిర్యాదుదారులు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.



## ప్రజావాణికి 22 ఫిర్యాదులు

ప్రజాపక్షం/నారాయణపేట జిల్లా: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యత నిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ లోకల్ బాడీ సంచిత్ గంగ్వార్ అధికారులకు సూచించారు. ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 22 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్‌కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, ఫిర్యాదులను పెండింగులో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను, డిప్యూటీ కలెక్టర్ శ్రీరామ్, ప్రణీత్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే భరోసా



రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేత

ప్రజాపక్షం/పెబ్బేరు : పెబ్బేరు మండలం రంగాపురం గ్రామానికి చెందిన ఎద్దుల (బొగ్గు) రవి ఆదివారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని గ్రామ కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. ఈ విషయాన్ని గ్రామ కాంగ్రెస్ నాయకులు సోమవారం వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా మేఘారెడ్డి భరోసాగా మృతుడి కూతురు కు రూ.వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రా అధ్యక్షుడు కావలి బాలస్వామి (చిన్నోడు), సింగల్ విండో డైరెక్టర్ పెద్దింటి చంద్రయ్య, గొల్ల బొంగు చిన్న కిష్టన్న, పిట్ట నాగేంద్రం, గొడుగు పెద్ద ఎల్లస్వామి, దాది రాముడు, యుగంధర్, ఎద్దుల శివరాజు, మండ్ల నరేష్, బొగ్గ దామోదర్, బొగ్గ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఉమ్మడి జిల్లా కెప్టెన్‌గా గౌతమ్ చంద్ర





ప్రజాపక్షం/మక్తల్ : వచ్చే నెల డిసెంబర్‌లో భద్రాచలంలో జరిగే అండర్ 14 ఉమ్మడి జిల్లా కెప్టెన్‌గా మక్తల్ శ్రీ గీతం పాఠశాల విద్యార్థి గౌతమ్ చంద్రను ఎంపిక చేయడం జరిగింది. ఈ సందర్భంగా పెద్దలు సన్మానం చేస్తూ వెనుకబడిన పాలమూరు జిల్లా మక్తల్ ప్రాంతం నుండి గత కొన్ని నెలలుగా క్రికెట్‌లో అద్భుతమైన ప్రతిభ కనపరుస్తున్న గౌతమ్‌ను ఉమ్మడి జిల్లా కెప్టెన్‌గా నియమించడం సంతోషకరమని భవిష్యత్‌లో ఈ విద్యార్థి అనేక అంచలుగా ఎదిగి తాను చదువుతున్న పాఠశాలకు, ఈ ప్రాంతానికి మరింత పేరు తీసుకురావాలని ఆశా భావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెరాస నాయకులు శ్రీనివాస్ గుప్త, డివైఎస్‌వో వెంకటేష్, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ కోశాధికారి లక్ష్మి నారాయణ, ప్రైవేట్ పాఠశాలల జనరల్ సెక్రటరీ అంజి రెడ్డి, ట్రస్మా సభ్యులు రమేష్ రావ్, సత్యనారాయణ గౌడ్, గీతం పాఠశాల పోషక కమిటీ అధ్యక్షులు మణికంఠ, పాఠశాల ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

## టీచర్ సపోర్టివ్ గ్రూపు విద్యార్థుల సంఖ్య తగ్గించండి



ప్రజాపక్షం/కృష్ణ : మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ముడుమాలను ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసి నెలవారీ సందర్శనలో భాగంగా గుడెబల్లూర్ కాంప్లెక్స్ అధికారి గణేశ్ సింగ్ మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గది బోధన, మధ్యాహ్న భోజన రికార్డులు, ఏఐ కంప్యూటర్ ల్యాబ్ రికార్డులు, లైబ్రరీ పుస్తకాల వినియోగం రికార్డులు, విద్యార్థులు వివరాలు, ఉపాధ్యాయుల హాజరు వివరాలు తదితరాలు పరిశీలించారు. తదనంతరం 03 వ తరగతి పరిసరాల విజ్ఞానం లోని మన గ్రామం పాఠ్యాంశ బోధనను పరిశీలించి విద్యార్థుల చేత సరళ, సంయుక్త,చ సంశ్లేష్టాక్షర పదాలను బోర్డు పై రాసి చదివించి అభినందించి, టీచర్ సపోర్టివ్ గ్రూపు విద్యార్థుల సంఖ్యను క్రమక్రమంగా తగ్గించాలని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు దండు శేఖర్, ఉపాధ్యాయులు భారతి రవికుమార్, ఆస్మా నిషాత్, జ్యోతి, వాలంటీర్ శిరీష సర్వీస్ పర్సన్స్ సోఫీ శివమ్మ, ఆయా అంజమ్మ మధ్యాహ్న భోజన కార్మికులు, పద్మమ్మ, నర్సమ్మ, సురేఖ, హఫిజా పాల్గొన్నారు.

## భక్త జన సంద్రమైన కోటిలింగేశ్వర దేవస్థానం



ప్రజాపక్షం/కొత్తకోట : కొత్తకోట మండలం కానాయపల్లి స్టేజి దగ్గర గల సుప్రసిద్ధమైన శైవ క్షేత్రం శ్రీకోటిలింగేశ్వర దత్తదేవస్థానము సోమవారం భక్త జనంతో కిటకిటలాడింది. కార్తీక మాసం చివరి సోమవారం భక్తులు అధిక సంఖ్యలో దేవాలయానికి చేరుకొని భక్తిశ్రద్ధలతో శ్రీ కోటిలింగేశ్వర స్వామివారిని, నూతనంగా నిర్మించిన ధాన్యమందిరంలో ప్రతిష్ఠించి పాదరస సహిత నవరత్నాలంకృత స్వర్ణ కవచ పంచలోహ శివలింగాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు అభిషేకాలు చేసుకొన్నారు. ఆలయ కమిటీ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



# స్థానికం

REGIONAL NEWS

నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## రూ.25లక్షల విరాళం



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: చనిపోయిన మృతదేహాలను భద్రపరించేందుకు అవసరమైన బాడీ ఫ్రీజర్ల కోసం మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ తరుపు రూ.25లక్షల ఆర్థిక సహాయం చెక్కును సోమవారం మంత్రులు కోమటిరెడ్డి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌లకు అందచేశారు. ఈ నిధులతో నాలుగు ఫ్రీజర్లను కొనుగోలు చేసి ఏరియా ఆసుపత్రిలో అందుబాటులో ఉంచాలని మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్‌లు కోరారు. ఆర్థిక సహాయం అందించిన మిల్లర్స్‌కు మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి వెంకటరమణచౌదరి, ఉపాధ్యక్షుడు గోళ్ల రామశేఖర్, కార్యదర్శి2 పొలిశెట్టి ధనుంజయ, కోశాధికారి గందె రాము తదితరులు పాల్గొన్నారు.



## రైతులను ఇబ్బందులు పెడితే చర్యలు

### ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి: కలెక్టర్

ప్రజాపక్షం/యాదాద్రి : ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండల కేంద్రంలో మార్కెట్ యార్డులో ఉన్న ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు వేగంగా పూర్తి చేయాలన్నారు. ఇప్పటివరకు ఎంత ధాన్యం కొనుగోలు చేశారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు టాబ్ ఎంట్రీలు పూర్తి చేశారా అని అడిగి ఎప్పటికపుడు పూర్తి చేయాలన్నారు. కొనుగోలు చేసినంత వరకు రైతుల ఖాతాల్లో డబ్బులు పడ్డాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. మిల్లర్ల వద్ద లారీలు ఆగుతున్నాయని, లారీలు వచ్చిన వెంటనే అన్లోడ్ చేసి లారీలను కొనుగోలు కేంద్రాలకు పంపాలన్నారు. అవసరమైతే అదనంగా లారీలు పంపాలని తెలిపారు. కొనుగోలులో రైతులను ఇబ్బందులు పెడితే చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్ ఉండొద్దు

### రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి



ప్రజాపక్షం/యాదాద్రి : ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డి, స్థానిక సంస్థల ఆదనపు కలెక్టర్ భాస్కరరావు కలిసి వివిధ ప్రాంతాల ప్రజల నుండి 41 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 29, ఎస్సీ వెల్ఫేర్ 4, జిల్లా పంచాయతీ 2, ఎంప్లాయిమెంట్ టీమ్, మత్స్య శాఖ, మార్కెటింగ్, ఆర్.టి.సి, చీఫ్ ప్లానింగ్, పోలీస్ శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. వివిధ శాఖలకు వచ్చిన దరఖాస్తులను తక్షణమే పరిశీలించి ప్రజల సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ జయమ్మ, జడ్పీ సీఈవో శోభారాణి పాల్గొన్నారు.

## వాహనాల తనిఖీలలో అప్రమత్తం




ప్రజాపక్షం/అర్వపల్లి (నాగారం) : ప్రజల భద్రత రక్షణలో భాగంగా నాగారం పోలీస్ స్టేషన్ పరిధి నాగారం మండల కేంద్రంలో జనగామ రహదారిపై వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ కమలాకర్ రోడ్డు ప్రమాదంలో మరణించిన సంగతి తెలిసిందే. రోడ్డు ప్రమాదం జరిగిన స్థలాన్ని జిల్లా ఎస్‌పి కె నరసింహ సోమవారం సంబంధిత పోలీస్ అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో పోలీస్ సిబ్బంది అత్యంత అప్రమత్తంగా ఉండాలని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. తనిఖీలు నిర్వహించే చోట బారికెడ్స్ ఏర్పాటు చేసుకోవాలని, తనిఖీలు నిర్వహించే చోట ఎక్కువ లైటింగ్ ఉండేలా చూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట డిఎస్‌పి ప్రసన్నకుమార్, సిఐ నాగేశ్వరరావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, రోడ్డు సెఫ్టీ సిబ్బంది ఉన్నారు.

## కుటుంబ కలహాలతో భార్యను చంపిన భర్త



ప్రజాపక్షం/మోతె : కుటుంబ కలహాలతో భార్యను చంపిన భర్త సంఘటన ఆదివారం అర్ధరాత్రి మండల పరిధిలోని సిరికొండ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం కుటుంబ కలహాల నేపథ్యంలో భర్త కారింగుల వెంకన్న గౌడ్ తన భార్య కారింగుల పద్మ (45)ను రోకలిబండతో కొట్టి హతమార్చినట్లు చెప్పారు. హత్య చేసిన వెం టనే వెంకన్న స్వయంగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూ ర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. ఇద్దరి మధ్య సాగుతున్న దాంపత్య కలహాలే ఈ ఘటనకు కారణమని స్థానికులు చెబుతున్నారు. ఎస్‌ఐ అజయ్‌కుమార్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

## దాసయ్య మృతి సిపిఐకి తీరనిలోటు



ప్రజాపక్షం/చందంపేట : చందంపేట మండలంలోని పెద్దమూల గ్రామానికి చెందిన సిపిఐ మాజీ సర్పంచ్ గద్దల దాసయ్య మృతి బాధాకరం అని సోమవారం సిపిఐ చందంపేట మండల సమితి పక్షాన ప్రగాఢ సానుభూతి తెలిపి దాసయ్య పార్థివదేహంపై ఎర్ర జెండాను కప్పి నివాళులర్పించారు. 1984లో సిపిఐ పార్టీ నుండి సర్పంచ్‌గా పార్టీకి ప్రజలకు సేవలందించారని అన్నారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ చందంపేట మండల కార్యదర్శి ఉప్పునూతల వెంకటయ్య, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వెంగళయ్య, బిక్షమయ్య, పోలేపల్లి మాజీ ఎంపిటిసి లాలయ్యలు ఉన్నారు.

# ఉమ్మడి నల్లగొండను మోడల్‌గా తీర్చిదిద్దుతాం

### మిర్యాలగూడలో రూ.250కోట్లతో రోడ్ల నిర్మాణం
### స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి
### మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
### ప్రతి ధాన్యం గింజ కొనుగోలు
### పెండింగ్ ప్రాజెక్టులన్ని పూర్తి చేస్తాం ...
### మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ఆర్‌అండ్‌బీ రోడ్డు శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరారు. సోమవారం మిర్యాలగూడ మండలంలోని కాల్వపల్లి వద్ద రూ.74కోట్లతో చేపట్టే శెట్టిపాలెం అవంతీపురం నాలుగు లైన్ల రోడ్డు పనులకు ఆయన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో జరిగిన సభలో మంత్రి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధిలో ఉమ్మడి నల్లగొండ జిల్లాను మోడల్‌గా తీర్చిదిద్దుతామన్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో కొత్తగా రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. మిర్యాలగూడ పట్టణ, మండలంలో రూ.250కోట్లతో రోడ్ల నిర్మాణ పనులు చేపట్టేందుకు శంకుస్థాపన చేశామన్నారు. మిర్యాలగూడ నియోజకవర్గంలో అనేక కొత్త రోడ్లలో నిర్మించి మోడల్ మిర్యాలగూడ చేస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న మూడు ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను 15రోజుల్లో ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ధాన్యం గింజ కొనుగోలు చేస్తామని, 48గంటల్లో డబ్బులు రైతుల ఖాతాల్లో వేస్తామన్నారు. అన్నివర్గాల ప్రజలకు మేలు కోరే ప్రభుత్వం అన్నార. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎత్తిపోతల పథకాలు త్వరగా పూర్తి చేసి రైతులకు అందుబాటులో తీసుకొస్తామన్నారు. 200యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ అందిస్తున్నామని, దేశంలోని 29 రాష్ట్రాల్లో ఎక్కడ లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో ప్రతి వ్యక్తికి ఆరు కిలోల చొప్పున క్వాలిటి నెంబర్ 1 సన్నబియ్యం అందించడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆదరించాలని, ఆశీర్వదించాలని మంత్రి కోరారు. మిర్యాలగూడ పట్టణంలో రూ.75.25కోట్లతో రోడ్లు, డ్రైనేజీ, సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.

**అదనపు తరగతి గదులు ప్రారంభం...**

మిర్యాలగూడ పట్టణంలోని కేవీఎం డిగ్రీ కళాశాలలో కొత్తగా నిర్మించిన అదనపు తరగతి గదులను, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నూతనంగా నిర్మించిన కళాశాల భవనాన్ని మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌లు ప్రారంభించారు. ప్రభుత్వ కళాశాల గుర్తింపు పొందే విధంగా ఎంతో కృషి చేశామని, కళాశాలలో గ్రంధాలయం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. అవసరమైన సహకారాలు అందిస్తామన్నారు. విద్యార్థులకు నాణ్యమైన, గుణాత్మక విద్యను అందించాలన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, పబ్లిక్ హెల్త్ ఎస్‌ఈ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస్, ఎంపీడీవో శేషగిరిశర్మ, నాయకులు నూకల వేణుగోపాల్‌రెడ్డి, గాయం ఉపేందర్‌రెడ్డి, జొన్నలగడ్డ శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గుండు నరేందర్‌రెడ్డి, నరేందర్‌గౌడ్, పొదిల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజాస్వామ్య పరిరక్షణ సిపిఐ ధ్యేయం

ప్రజాపక్షం/చౌటుప్పల్ : యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండల కేంద్రంలో సీపీఐ బస్సు జాతా కరపత్రం ఆవిష్కరణ చేసి ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఫ్లోరైడ్, మూసి, కలుషిత జలాలతో పరిశ్రమలతో పరిశ్రమల రసాయనాల కాలుష్య ప్రాంతంగా మారడంతో పుట్టిన శిశువు నుండి అనేక వ్యాధుల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు అనేక గ్రామాలలో ఫ్లోరైడ్‌తో జీవచ్ఛవాలుగా బతికి ఉన్న శవాలుగా మారారని అన్నారు. సాగు, త్రాగు నీరుకై ప్రాజెక్టులు నిర్మించి ఈ ప్రాంతం సస్యశ్యామలం కోసం మూడు దశలుగాసీపీఐ పాదయాత్ర నిర్వహించి అప్పటి ముఖ్యమంత్రి కి కనువిప్పు కలిగేలా పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని ఉద్యమాలు చేపట్టిందని గుర్తు చేశారు. ఈ నెల 19న చౌటుప్పల్ పట్టణానికి విచ్చేస్తున్న బస్సు జాత బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి పగిళ్ల మోహన్ రెడ్డి, ఉడుత రామలింగం, పిల్లి శంకర్, కొండూరు విప్లవ్, బద్దుల సుధాకర్, టంగుటూరి రాములు,నీళ్ల బిక్షపతి, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ఆడబిడ్డ సంరక్షణ అందరి బాధ్యత

### నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి




ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్: ఇటీవల జిల్లాలో చోటు చేసుకున్న ఆడపిల్లల అక్రమ దత్తత, బాల్య వివాహాలు,లింగ నిర్ధారణ పరీక్షలు,బాల్య దశలోనే గర్భం దాల్చడం వంటి సంఘటనలను దృష్టిలో ఉంచుకుని ఆడబిడ్డను సంరక్షించుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సేవ్ ద చైల్డ్ జిల్లాస్థాయి కార్యచరణ ప్రణాళిక పై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇందుకు గాను గ్రామ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ (విసిపిసి) లో పంచాయతీ కార్యదర్శి ,అంగన్వాడీ టీచర్, గ్రామ పాలన అధికారులను చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులుగా ఏర్పాటు చేయాలని,ప్రతి గ్రామపంచాయతిలో విసిపిసి సమావేశాలను తప్పనిసరిగా నిర్వహించాలని,మారుమూల గిరిజన ప్రాంతాలలో లింగ నిర్ధారణ పరీక్షలు జరగకుండా పకడ్బంది తీసుకోవాలని,ఎవరైనా ఇలాంటి పరీక్షలు నిర్వహిస్తే వెంటనే సమాచారం తెలియజేసేందుకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేసి సమాచారం వచ్చే విధంగా చూడాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. ముఖ్యంగా సంఘటనలు ఎక్కువగా జరుగుతున్న పెద్దవూర,తిరుమలగిరి సాగర్,దామరచర్ల,పీఏ పల్లి వంటి మండలాలలో విస్తృతంగా అవగాహన కల్పించాలని చెప్పారు.జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ ఆడపిల్లల అక్రమ దత్తత, బాల్యవివాహాలు, చిన్న వయసులోనే గర్భం దాల్చడం, తదిత అంశాలపై అందరికీ అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని, ప్రత్యేకించి ఆడబిడ్డ సంరక్షణపై అవగాహన కల్పించాలని, ఇందుకు సంఘటనలు జరిగే ప్రాంతాలపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలని, బాలికల హాస్టళ్లు, పాఠశాలలతో పాటు, బాలుర హాస్టల్లో కూడా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు.జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ అధ్యక్షులు కృష్ణ, స్థానిక సంస్థల ఇంచార్జి అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, దేవరకొండ ఆర్డిఓ రమణారెడ్డి, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్ కుమార్, చారుమతి ఎన్జీవో అధ్యక్షులు నాగసేనారెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, డీఈవో బిక్షపతి,ఆర్‌డిఓ వై. అశోక్ రెడ్డి,సంక్షేమ శాఖల అధికారులు, ఆర్ సి ఓ లు పాల్గొన్నారు.



## రూ. 485 కోట్లతో కాలువల నిర్మాణం పూర్తి చేస్తాం : ఎమ్మెల్యే

ప్రజాపక్షం/భువనగిరి రూరల్ : యాదాద్రి భువనగిరి జిల్లాలోని బునాదిగాని, పిల్లాయిపల్లి, ధర్మారెడ్డి పల్లి కాల్వల నిర్మాణానికి 485 కోట్లు మంజూరైనట్లు మరో ఏడాదిన్నర కాలంలో పూర్తి చేయనున్నట్లు భువనగిరి ఎమ్మెల్యే కుంభ అనిల్ కుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం భువనగిరిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. పది సంవత్సరాలు పరిపాలించిన బిఆర్ఎస్ ప్రభుత్వం కాల్వల నిర్మాణం పూర్తి చేయడంలో పూర్తిగా నిర్లక్ష్యం వహించిందని ఎమ్మెల్యే అన్నారు. తిరిగి ప్రజా పాలన వచ్చిన ఏడాది కాలంలోనే ఈ కాలువల నిర్మాణానికి టెండర్లు పూర్తిచేసి 2025 ఏప్రిల్ లో పనులు ప్రారంభించడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు. వర్షా కాలానికి సమయం తక్కువ ఉన్నందున పనులు పూర్తిస్థాయిలో చేయలేకపోయామన్నారు. మిగతా పనులను తిరిగి ప్రారంభించడానికి ఇరిగేషన్ అధికారులు సమయతమవు తున్నారన్నారు. 2026 ఏప్రిల్ నుండి జూలై మాసం వరకు కాల్వలను పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. కాల్వల పనులు పూర్తి చేయడానికి క్రాప్ హాలిడే ప్రకటించాల్సి ఉండగా రైతులు నష్టపోతున్నారని పునాది గాని ఫిలాయిపల్లి కాలువలకు మినహాయింపు ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. ధర్మారెడ్డి పల్లి కాల్వకు పూర్తిగా క్రాప్ హాలిడే ప్రకటించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, పోత్నాక్ ప్రమోద్ కుమార్, నాయకులు, ఇరిగేషన్ అధికారులు మనోహర్, శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఎంప్లాయిస్ యూనియన్ రీజినల్ కౌన్సిల్ సమావేశం

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: టిజిఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ నల్లగొండ రీజినల్ కౌన్సిల్ సమావేశం మంగళవారం ఉదయం 11.00 గంటలకు స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయం మగ్దూమ్ భవన్ నందు ఏర్పాటు చేసినట్లు రీజినల్ కార్యదర్శి ఎన్ఆర్‌సి రాజు తెలిపారు.సమావేశానికి యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి పాటి అప్పారావుతో పాటు పలువురు రాష్ట్ర నాయకులు, జోనల్ నాయకులు విచ్చేయుచున్నారు.కావున నల్లగొండ రీజియన్‌లోని అన్ని డిపో కమిటీల అధ్యక్ష,కార్యదర్శులు, రాష్ట్ర,జోనల్, రీజినల్ నాయకులకు,ముఖ్య కార్యకర్తలు హాజరకావాలని కోరారు.సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు మ్యానిఫెస్టోలో పెట్టిన హామీలను అమలు పరచకుండా అనుసరిస్తున్న విధానాల పట్ల రాష్ట్ర వ్యాప్తంగా కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలపై యాజమాన్యం అనుసరిస్తున్న విధానాల పట్ల కార్యాచరణ రూపొందించుటకై,రీజియన్, డిపో స్థాయిలో పేరుకు పోయిన సమస్యల పరిష్కారానికై దిశా నిర్ధేశం చేయబడును.

# ధాన్యం డబ్బులు జమయ్యేలా చర్యలు తీసుకోవాలి

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



ప్రజాపక్షం/సూర్యాపేట (సూర్యాపేట రూరల్) : రైతుల అకౌంట్‌లో 48 గంటల్లో ధాన్యం డబ్బులు జమ అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. సోమవారం పిల్లలమర్రి పిఏసిఎస్ ఆధ్వర్యంలో గాంధీనగర్, యర్కారంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అలాగే ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాలెంల1 కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి తేమ శాతంను తేమ కొలిచే యంత్రం ద్వారా పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో సీరియల్ రిజిష్టర్‌ను తనిఖీ చేసి తేమ శాతం 17 వచ్చిన ధాన్యం సీరియల్ ప్రకారం ధాన్యం కాంటా వేసి మిల్లులకు తరలించాలని వెంటనే ట్రక్ షీట్, ట్యాబ్ ఎంట్రీ చేసి రైతులకు డబ్బులు జమ చేసేలా చూడాలని అధికారులకు సూచించారు. సరైన తేమ శాతం వచ్చిన ధాన్యం కాంటా విషయంలో జాప్యం చేస్తే నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. రైతులు ధాన్యమును సరైన తేమ శాతం వచ్చేంత వరకు ఆరబెట్టాలని అలాగే ధాన్యములో మట్టి, తాలు, దుమ్ము, గడ్డి లేకుండా శుభ్రం చేసి నాణ్యమైన ధాన్యంను కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్ధతు ధర పొందాలని సూచించారు. ఇప్పటి వరకు గాంధీనగర్‌లో 28 లారీలు, బాలెంలలో 34 లారీలు, యర్కారంలో 6 లారీలు ధాన్యంను మిల్లులకు తరలించటం జరిగిందని నిర్వాహకులు కలెక్టర్‌కు వివరించగా ఎక్కువ మంది హమాలీలను ఏర్పాటు చేసుకొని కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. డిఎస్‌ఓ మోహన్‌బాబు, డిఎం రాము, తహశీల్దార్ కృష్ణయ్య, ఏఓ సందీప్, ఏఈఓలు, ఏపియం, పిఏసిఎస్ కార్యదర్శులు నాగరాజు, వెంకటరెడ్డి, నిర్వాహకులు వెంకటమ్మ ఉన్నారు.

## పనులలో నిర్లక్ష్యం.. కాంట్రాక్టర్‌పై చర్యలకు డిమాండ్





ప్రజాపక్షం/భువనగిరి రూరల్ : భువనగిరి పట్టణంలోని హౌజింగ్ బోర్డ్ కాలనీ 10వ వార్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులలో నిర్లక్ష్యం చేస్తున్న కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండి.ఇమ్రాన్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల కోసం గల్లీలలో పైప్ లైన్ వేయడానికి తోవ్వడం జరిగింది. 10 రోజులు అవుతున్న నేటికి పనులు పూర్తి చేయలేదు. తవ్వి పైప్ లైన్ వేసినారు, మీకు ఇష్టముంటే పైప్ లైన్ కలుపుకోండి లేకుంటే లేదు అని చెప్పడంతో ఇంటి యజమానులు 3000 ఖర్చుపెట్టి పైప్ లైన్ డ్రైనేజీలో కలపడం జరిగింది, తవ్వినప్పుడు మున్సిపల్ నల్ల పైపులు కూడా డ్యామేజ్ అవ్వడంతో ప్రతి ఇంటికి 2000 ఖర్చు పెట్టి నల్ల కలెక్షన్లు సొంతంగానే తీసుకోవడం జరిగింది. తవ్విన మట్టి తీయకపోగా మ్యాన్ హోల్ పై కవర్ వేయకపోవడంతో విపరీతమైన దోమలు పెరిగిపోయినాయి. ఇంటి లోపలికి వెళ్లాలన్న వృద్ధులు చిన్నపిల్లలు ఇబ్బంది పడుతున్నారు. గల్లీలో చెత్త బండి రావడం లేదు త్రాగడానికి నీళ్ల సప్లై చేసే మినరల్ వాటర్ ఆటో రావడం లేదు మరియు వాహనాలు ఇంటి నుండి దూరంగా పెట్టి రావడంతో వాహనాలు పోతాయని భయం కూడా ఉంది. హౌసింగ్ బోర్డ్‌లో నిత్యం దొంగతనాలు జరుగుతూనే ఉంటాయి. దీనివల్ల గల్లీ వాసులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పనులలో ఆలసత్యం వహించి కాలనీవాసులను ఇబ్బందులకు గురిచేసిన కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని ఇమ్రాన్ డిమాండ్ చేశారు. ఇట్టి విషయాన్ని మున్సిపల్ కమిషనర్, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని అని తెలిపారు.

## యువ కౌలురైతు ఆత్మహత్య



ప్రజాపక్షం/మునుగోడు: కౌలు యువ రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. మండల కేంద్రానికి చెందిన కౌలు యువ రైతు పిట్టల సురేందర్(28) గత రెండు సంవత్సరాల నుండి 7 ఎకరాల భూమిని కౌలు తీసుకొని వ్యవసాయం చేసుకుంటూ దానితోపాటు ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. పండించిన పంటలో దిగుబడి రాక అప్పుల పాలయ్యాడు. ఈ సంవత్సరం కాలం అయితే అప్పులు తీరుతాయన్న ఆశతో లక్షల రూపాయలు అప్పులు తేచి పెట్టుబడి పెట్టి సాగు చేశాడు. కాలానుగుణంగా వర్షాలు పడక పంట తీసే సమయానికి అధిక వర్షాలు కురవడంతో పండించిన పంట పూర్తిగా ఆగం కావడంతో దానికి తోడు సమయానికి కూలీలు రాక పూర్తిగా దిగ్భ్రాంతిలోనై కౌలు తీసుకున్న పంట పొలంలోని పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు అప్పటికే మృతి చెందగా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.తండ్రి పిట్టల బుచ్చయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

**ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతును ఆదు-కోవాలి** వ్యవసాయం చేస్తే దండగ అనే రోజులలో యువకుడు వ్యవసాయాన్ని నమ్ముకొని భూములను కౌలుకు తీసుకొని పంటలు సాగుచేస్తే వచ్చిన నష్టాన్ని తట్టుకోలేక ఆత్మహత్య చేసుకోవడం దురదృష్టకరమని ఆత్మహత్య చేసుకున్న కౌలు యువ రైతు పిట్టల సురేందర్ కుటుంబని ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గురజా రామచంద్రం ప్రభుత్వాన్ని కోరారు. రైతులకు ఇస్తున్న రైతు బీమా పథకం, పెట్టుబడి సహాయం కౌలు రైతులకు కూడా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాని డిమాండ్ చేశారు.

# రీల్

## 'ఆపరేషన్ పద్మ' ట్రైలర్ విడుదల



నరేష్ మేడి, రాగ్, రజిత శాండీ, రణ ధీర్ బీసు, రాఘవ మండలపు, పెద్ది రాజ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా 'ఆపరేషన్ పద్మ'. ఈ చిత్రాన్ని క్రిషివ్ సినిమాస్, కేవీఎం ఆర్ట్స్ ఎల్ ఎల్పీ బ్యానర్స్‌పై ఘట్టమనేని అరవింద్ బాబు, రాఘవ మండలపు, రాంబాబు మండలపు నిర్మిస్తున్నారు. కార్తీక్ మండలపు కో ప్రొడ్యూసర్‌గా, కెటి మల్లికార్జున క్రియేటివ్ హెడ్‌గా వ్యవహ రిస్తున్నారు. కార్తికేయ.వి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా త్వరలో ప్రేక్ష కుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవు తోంది. 'ఆపరేషన్ పద్మ' సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను హైద రాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాటల రచయిత ప్రేమ్ రాజ్ ఎనుముల మాట్లాడుతూ మూడు సినిమాలకు నేను డైలాగ్స్ రాశాను. మంచి కంటెంట్‌తో వస్తున్న ఈ చిత్రాన్ని మీరంతా ఆదరిస్తారని కోరుకుంటున్నా అన్నారు. నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ ముత్యాల రాందాస్ మాట్లాడుతూ మనం ఎన్ని మాట్లాడుకున్నా చిన్న సినిమా అనాథే అని చెప్పారు. నిర్మాత, నటుడు డీఎస్ రావు మాట్లా డుతూ.. 'ఆపరేషన్ పద్మ' ట్రైలర్ బాగుంది. మంచి డైలాగ్స్ ఉన్నాయి. డైరెక్టర్ కార్తికేయ కొత్త నటీనటులను ఎంచుకుని వాళ్లతో ఇంట్రెస్టింగ్ మూవీస్ చేస్తుంటాడు. ఈ సినిమా కూడా ఈ టీమ్ అందరికీ సక్సెస్ ఇవ్వాలి అన్నారు. ఈ కార్యక్రమంలో నటుడు రణధీర్ బీసు, నటుడు నరేష్ మేడి, హీరోయిన్ రజిత శాండీ, ప్రొడ్యూసర్ రాఘవ మండలపు, డైరెక్టర్ కార్తికేయ.వి. పాల్గొన్నారు.

## 'పాంచ్ మినార్' ట్రైలర్ లాంచ్



రాజ్ తరుణ్ హీరోగా రామ్ కడుముల దర్శక త్వంలో రూపొందిన క్రైమ్ కామెడీ ఎంటర్ టైనర్ 'పాంచ్ మినార్'. రాశి సింగ్ హీరోయిన్‌గా నటి స్తున్నారు. గోవింద రాజు ప్రజెంట్ చేస్తున్న ఈ చిత్రాన్ని కనెక్ట్ మూవీస్ ఎల్ఎల్పి బ్యానర్‌పై మాధవి, ఎంఎస్ఎం రెడ్డి నిర్మిస్తున్నారు. ఇప్పటికే రిలీజైన సాంగ్స్, టీజర్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది. నవంబర్ 21న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా ట్రైలర్ రిలీజ్ చేశారు. డైరెక్టర్ సాయి రాజేష్ ట్రైలర్‌ని గ్రాండ్‌గా లాంచ్ చేశారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో రాజ్ తరుణ్ మాట్లాడుతూ ఇప్పుడు మా ట్రైలర్ రిలీజ్ చేశాం. కొంచెం ఓపెన్ మైండ్‌తో చూడమని కోరు కుంటున్నాను. చాలా మంచి ఎంటర్టైన్మెంట్ ఇది. అందరూ థియే టర్స్‌కి వచ్చి ఎంజాయ్ చేసి వెళ్లే సినిమా. మా ప్రొడ్యూసర్ మాధవి చాలా పాషన్‌తో తీశారు. గోవింద్ ఈ సినిమాని తన భుజాల మీద వేసుకుని నడిపిం చారు. మా సినిమా 21న థియేటర్లలో రిలీజ్ అవుతుంది. 19, 20 తేదీల్లో కూడా మళ్లీ ప్రీమియర్స్ వేయాలని నిర్మాతలు భావిస్తు న్నారు.

## జయకృష్ణ సరసన రషా తడాని



సూపర్ స్టార్ కృష్ణ మనవడు, దివంగత రమేష్ బాబు కుమారుడు, సూపర్ స్టార్ మహేష్ బాబు అన్న కొడుకు, జయ కృష్ణ ఘట్టమనేని హీరోగా సినీ అరంగేట్రం చేస్తున్నారు. ఆర్ఎక్స్ 100, మంగళ వారం వంటి బ్లాక్ బస్టర్ చిత్రాల విజనరీ ఫిల్మ్ మేకర్ అజయ్ భూపతి దర్శకత్వంలో జయ కృష్ణ వెండితెర అరంగేట్రం చేయబోతున్నారు. ఈ సినిమాను వైజయంతి మూవీస్ అశ్విని దత్ సమర్పి స్తున్నారు. చందమామ కథలు బ్యానర్‌పై పి.కిరణ్ నిర్మిస్తున్నారు. అద్భుతమైన కొండల మధ్య సాగే సినిమా మనసుకు హత్తుకునే ప్రేమకథ ప్రధా నంగా ఉంటుందని మేకర్స్ తెలిపారు. తాజాగా మరో ప్రకటన వచ్చింది. జయ కృష్ణ ఘట్టమనేని సరసన హీరోయిన్‌గా బాలీవుడ్ హీరోయిన్ రషా తడా నిని నటింప చేస్తున్నట్లు నిర్మాతలు తెలిపారు. హీరోయిన్ రవీనా టండన్, ప్రముఖ నార్త్ ఇండియన్ డిస్ట్రిబ్యూటర్, ఏఏ ఫిలింస్ ఇండియా యజమాని అనిల్ తడాని కుమార్తె రషా ఆజాద్ సినిమాతో సినీ రంగ ప్రవేశం చేసి, ఉయ్ అమ్మా పాటతో ఇంటర్నెట్‌ను షేక్ చేసింది. ఇప్పుడు జయ కృష్ణ సరసన తెలుగు సినిమా పరిశ్రమలోకి అడుగుపెడుతోంది. ఈ చిత్రంలో మహిళా పాత్రలకు బలమైన క్యారెక్టరైజేషన్ రాసే దర్శకుడు అజయ్ భూపతి, రషా కోసం ఇంటెన్స్ క్యారెక్ట ర్‌ని డిజైన్ చేశారు. ఈ నెల లోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. టైటి ల్‌తో పాటు మరిన్ని వివరాలు



## 18న 'జాజికాయ' పాట



నందమూరి బాలకృష్ణ, బ్లాక్ బస్టర్ దర్శకుడు బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వస్తున్న సినిమా 'అఖండ 2: తాండవం'. రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తు న్నారు. ఎం.తేజస్విని నందమూరి చిత్రాన్ని సమర్పిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, ఫస్ట్ సింగిల్ తాండవం అద్భుత మైన రెస్పాన్స్‌తో భారీ అంచనాలు సృష్టించాయి. అఖండ 2 సెకండ్ సింగిల్ 'జాజికాయ' నవంబర్ 18న గ్రాండ్‌గా లాంచ్ చేయనున్నారు. ఈ సాంగ్ అదిరిపోయే డ్యాన్స్ నెంబర్‌గా ఉండ బోతోంది. తమన్ థియేటర్స్ దద్దరిల్లే పాటని కంపోజ్ చేశారు. గ్రాండ్ సెట్‌లో షూట్ చేసిన ఈ సాంగ్‌లో బాలకృష్ణ మాస్ డ్యాన్స్ మూమెంట్స్ ఫ్యాన్స్‌ని అద్భుతంగా అలరించనున్నాయి. సాంగ్ అనౌన్స్మెంట్ పోస్టర్‌లో బాలయ్య ఎనర్జిటిక్ డ్యాన్స్ మూమెంట్ అందరినీ ఆకట్టుకుంది. వైజాగ్ జగదాంబ థియే టర్‌లో గ్రాండ్‌గా జరగనున్న సాంగ్ లాంచ్ ఈవెంట్‌కి బాల కృష్ణ తో పాటు చిత్ర యూనిట్ హాజరుకానున్నారు. ఈ చిత్రంలో ఆది పినిశెట్టి ఓ పవర్ ఫుల్ పాత్రలో నటిస్తున్నారు. హర్షాలి మల్హోత్రా కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రా నికి సి.రాంప్రసాద్, సంతోష్ సినిమాటోగ్రఫీని నిర్వహిస్తుండగా, తమ్మిరాజు ఎడిటర్. ఎఎస్ ప్రకాష్ ఆర్ట్ డైరెక్టర్. డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

## 'మఫ్టీ పోలీస్' 21న విడుదల



యాక్షన్ కింగ్ అర్జున్ సర్జ, ఐశ్వర్య రాజేష్‌ల పోలీస్ ఇన్వెస్టిగేటివ్ పర్స నల్ డ్రామా 'తీ యవర్ కుల్లై నడుంగ' తెలు గులో 'మఫ్టీ పోలీస్'గా ఈనెల 21న ప్రేక్షకుల ముందుకు రానుంది. దినేష్ లక్ష్మ ణన్ దర్శకత్వంలో జియస్టార్ ఆర్ట్స్ బ్యానర్‌పై జి.అరుల్ కుమార్ నిర్మించిన ఈ తమిళ చిత్రాన్ని.. తెలుగులో 'మఫ్టీ పోలీస్' పేరుతో ప్రముఖ నిర్మాత ఎ.ఎన్.బాలాజీ, శ్రీల క్ష్మి జ్యోతి క్రియేషన్స్ ద్వారా విడుదల చేస్తున్నారు. ఒక రచయిత హత్య నేపథ్యంలో పోలీస్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా ఈ చిత్రంలో పర్సనల్ డ్రామాకు పెద్ద పీట వేయడం విశేషం. అలాగే ఇటీవలకాలంలో పిల్లల పాలిట భూతంలా మారిన ఆటిజం వ్యాధి గురించి కూడా ఇందులో చర్చించి ఉండడం గమనార్హం. ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్న శ్రీలక్ష్మి జ్యోతి క్రియేషన్స్ అధినేత ఎ.ఎన్.బాలాజీ మాట్లాడుతూ... యాక్షన్ కింగ్ అర్జున్, ఐశ్వర్య రాజేష్ అలియాస్ భాగ్యంలకు తెలుగునాట ఉన్న క్రేజ్‌ని దృష్టిలో పెట్టుకుని అత్యధిక థియేటర్లలో 'మఫ్టీ పోలీస్' చిత్రాన్ని విడుదల చేస్తున్నాం. ఈ సినిమాలో యాక్షన్‌తోపాటు పర్సనల్ డ్రామా కూడా చాలా ఆసక్తికరంగా ఉంటుంది. తమిళంతోపాటు తెలుగు లోనూ అసాధారణ విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది. ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు అందించే అద్భుత అవకా శాన్ని నాకు అందించిన జి.అరుల్ కుమార్ గారికి, ఈ చిత్రాన్ని అత్యద్భుతంగా తీర్చిదిద్దిన దర్శకుడు దినేష్ లక్ష్మ ణన్ లకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు' అన్నారు.రామ్ కుమార్ గణేశన్, అభిరామి వెంకటా చలం, ప్రవీణ్ రాజా తదితరులు నటించారు.

## 'మై డియర్ సిస్టర్' ఫస్ట్ లుక్

అరుళ్ నిధిమమత మోహన్దాస్ ప్రధాన పాత్రల్లో 'మై డియర్ సిస్టర్' చిత్రాన్ని అద్భుతమైన విజువల్ ప్రోమోతో ప్రక టించారు. ఈ అన్‌స్క్రిప్టెడ్ టగ్ ఆఫ్ వార్ వీడియో ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తి స్తోంది. ప్యాషన్ స్టూడియోస్ ఎప్పటి లానే విభిన్న జానర్స్‌లో కుటుంబం మొత్తం చూడగలిగే నాణ్యమైన సినిమా లను అందిస్తూ తమ ప్రత్యేకతను మరొక సారి చాటుకుంది. అన్నాచెల్లెళ్ళ బంధం ఎన్నాళ్లుగానో ముఖ్యమైన భావోద్వేగ అంశం. పాసా మలర్ నుంచి వేదాళం వరకూ అన్నాచెల్లెల్ల అనుబంధం తరత రాలుగా ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తూనే ఉంది. ఇటీవల బైసన్‌తో సంగీత ప్రపంచంలో మంచి విజయాన్ని సొంతం చేసుకున్న నివాస్ ప్రసన్న ఈ చిత్రానికి సంగీత దర్శకుడు. 'మై డియర్ సిస్టర్'లో మొత్తం ఏడు పాటలు ఉన్నాయి. ప్రస్తుతం చిత్రానికి సంబం ధించిన పోస్ట్‌ప్రొడక్షన్ పనులు చివరి దశలో ఉన్నాయి. అరుళ్ నిధి, మమతా మోహన్దాస్, అరుణ్‌పాండియన్, మీనాక్షి గోవిందరాజన్ నటిస్తున్నారు.



## పిల్లలను అలరించే యానిమేషన్ కికీ అండ్ కోకో

ఇటీవల అనిమేషన్ చిత్రాలు ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానం ఆపాదిస్తున్నాయి. ప్రత్యే కంగా బాలల చిత్రాలు నిర్మించడానికి ఎవరు ముందుకు రావడంలేదు. ఈ నేపథ్యంలో బాలల హృదయాన్ని హత్తుకునే ఓ ఇండియన్ అనిమేషన్ సినిమా కికీ అండ్ కోకో త్వరలో విడుదల కాబోతుంది. ప్రపంచవ్యాప్తంగా ఎల్లలు దాటి, పలు భాషల్లో ఈ చిత్రం విడుదల కాబోతుంది. పూర్తిగా భారత సినీ ఇండస్ట్రీ



నుండి ఇక్కడి సాంకేతిక నిపుణులతో విభిన్న తరహాలో తొలి సారిగా పి.నారా యణన్ దర్శకత్వంలో రూపొందించిన అనిమేషన్ చిత్రం కికీ అండ్ కోకో. ఈ సందర్భంగా దర్శకుడు పి.నారాయణన్ మాట్లాడుతూ ఇది పిల్లలకే పరిమితం కాదు పెద్దల్లోనూ చిన్నప్పటి మధురానుభూతులు గుర్తు చేస్తుంది. నేటి బాలలను నిజంగా ప్రభావితం చేసే విద్యా కథలు చాలా అవసరం. కికీ అండ్ కోకో అనేది స్నేహం, ప్రేమ, ఒక పిల్లవాడు తన పెంపుడు జంతువు మధ్యున్న మాంత్రిక బంధం గురించి అందరి హృదయాలను హత్తుకునే కథ అన్నారు. ఇనికా ప్రొడక్షన్స్ క్రియేటివ్ ప్రొడ్యూసర్ జి.యం.కార్తికేయన్ మాట్లాడుతూ.. కికీ అండ్ కోకో ఒక సినిమా మాత్రమే కాదు. ఇది స్నేహం, ప్రేమ, కథల ద్వారా పిల్లలు నేర్చుకునే విలువైన పాఠాల వేదిక. ఈ మాంత్రిక ప్రయాణాన్ని అందరూ తమ హృదయాలతో స్వాగతించాలని ఆహ్వానం పలుకు తున్నాము. కికీ అండ్ కోకో చిత్ర థియేటర్లలో మాత్రమే చూసి ఆనందించాలని తెలి పారు. కికీ అనే కుక్క పాత్ర, కోకో అనే చిన్నారి పాత్ర కనిపిస్తాయి.



## కొమురవెల్లి జాతరను ఘనంగా నిర్వహించాలి

### అధికారులకు మంత్రి కొండా సురేఖ దిశానిర్దేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రం సిద్దిపేట జిల్లా చేర్యాలలోని శ్రీ కొమురవెల్లి మల్లన్న కల్యాణం, జాతరలను తెలంగాణ ఆధ్యాత్మిక సంస్కృతి, సంప్రదాయాలు ప్రతి బింబించేలా వైభవోపేతంగా నిర్వహించాలని దేవాదాయ ధర్మాదాయ, అటవీ, పర్యావ రణ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. వేలాదిగా జాతరకు తరలి వచ్చే భక్తులను దృష్టిలో పెట్టుకుని ఏ చిన్న పొరపాటు తలెత్తకుండా పటిష్టమైన కార్యాచర ణతో ఏర్పాట్లు చేయాలని మంత్రి అధికారులకు సూచించారు. సోమవారం డా.బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సెక్రటేరియట్ లోని దేవాదాయ ధర్మాదాయ మంత్రిత్వశాఖ కార్యా లయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో మంత్రి సురేఖ సిద్దిపేట జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశం కంటే ముందు మల్లన్న జాతర, కళ్యాణం పోస్ట రును మంత్రి సురేఖ రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనగాం ఎంఎల్ఏ పల్లా రాజేశ్వర్ రెడ్డి, దేవాదాయ శాఖ ప్రిన్స్ పల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, కమిషనర్ హరీష్, సిద్దిపేట కలెక్టర్ హైమావతితో పాటు తదితర శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు పాల్గొ న్నారు. సమీక్ష సమావేశంలో దేవాదాయ శాఖ మంత్రి సురేఖ మాట్లాడుతూ.., గత సంవ త్సరం కంటే మరింత వైభవోపేతంగా మల్లికార్జున స్వామివారి కల్యాణం, జాతరను నిర్వ హించనున్నట్లు తెలిపారు. గత సంవత్సరం జాతర, కల్యాణం నిర్వహించిన సమయంలో తలెత్తిన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఈ సారి అవి రాకుండా చూడాలని సూచిం చారు. డిసెంబర్ 14 ఉదయం 10.45 గంటలకు శ్రీమల్లికార్జునస్వామి వారి కల్యాణాన్ని, జనవరి 18 నుండి 10 వారాలపాటు మార్చి 16 వరకు జాతరను నిర్వహించేందుకు నిర్ణ యించినట్లు మంత్రి సురేఖ ప్రకటించారు. ఈ దిశగా భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేయా లని పోలీస్, విద్యుత్, వైద్యారోగ్యం, ఆర్టీసి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, ఆర్ అండ్ బి తదితర శాఖల అధికారులను మంత్రి సురేఖ ఆదేశించారు. కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, అమ్మ వార్లు బలిజ మేడలమ్మ, గొల్ల కేతమ్మలకు కిరీటాల తయారీ పనుల పై మంత్రి సురేఖ వివ రాలు పూర్తిగా తెలుసుకున్నారు. రాష్ట్రంతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు కల్యా ణోత్సవానికి, జాతరకు పెద్ద సంఖ్యలో తరలివచ్చే పరిస్థితులున్నందున ఈ దిశగా చర్యలు చేపట్టాలని సిద్దపేట డిపో మేనేజర్ కు మంత్రి సురేఖ సూచించారు. భక్తుల క్యూలైన్లు, బారికేడ్లు, ట్రాఫిక్ నియంత్రణ, బందోబస్తు, సిసి కెమరాల నిఘా, వివిఐపిలకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు, భక్తులకు దారులను తెలిపేలా సైన్ బోర్డులు, తాగునీటి సదుపాయం, మెడికల్ క్యాంపు, లాక్టేషన్ గదులు తదితర ఏర్పాట్లు చేయాలని మంత్రి సంబంధిత అధి కారులకు సూచించారు. జాతర సమయానికి వేసవి కాలం రానుండటంతో భక్తుల సౌక ర్యార్థం చలువ పందిళ్లు, నడిచే మార్గాల్లో మ్యాట్లు, వృద్ధులు, వికలాంగులు, గర్భిణులకు బ్యాటరీ వాహనాలు తదితర ఏర్పాట్లు చేయాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను సంపూ ర్ణంగా నిషేధించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. మల్లికార్జున స్వామివారి కల్యాణం, జాతరను విస్తృతంగా జనంలోకి వెళ్ళేలా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. భక్తులకు సాయపడేలా అవసరమైన చోట వాలంటీర్లు, ఆశా కార్యకర్తల సేవలను వినియోగించుకునేలా కార్యాచరణను రూపొందించాలని సూచించారు.

## 50 % కోటా దాటొద్దు

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించడానికి మేము అనుమతిస్తున్నాం' అని మహారాష్ట్ర సర్కార్‌కు సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. కాగా, కొన్ని సందర్భాల్లో మహారాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల్లో 70 శాతానికి మించి రిజర్వేషన్లు ఇచ్చారని పేర్కొంటూ దాఖలైన పిటిషన్లపై కూడా సుప్రీంకోర్టు నోటీ సులు జారీ చేసింది. అయితే స్థానిక సంస్థల ఎన్నికలకు నామినేషన్ దాఖలు సోమవా రంతో ముగిసిందని, సుప్రీంకోర్టు మే 6వ తేదీన ఇచ్చిన ఉత్తర్వును పరిగణనలోకి తీసు కునే ఈ ఎన్నికలు నిర్వహించడానికి మహారాష్ట్ర సర్కార్ సిద్ధమైందని తుషార్ మెహతా సుప్రీంకోర్టుకు తెలిపారు. దీనిపై స్పందించిన జస్టిస్ బాగ్చి కీలక వ్యాఖ్యలు చేశారు. 'మాకు పరిస్థితిపై పూర్తి అవగాహన ఉంది. బంథియా కమిటీ నివేదికకు ముందు ఉన్న పరిస్థితిలు కొనసాగవచ్చని మేము సూచన చేశాం. అయితే దీని అర్థం 27 శాతం రిజర్వే షన్లు అన్ని వర్గాలకు వర్తింపజేయాలనా? ఒక వేళ అదే జరిగితే, మేము ఇప్పుడు ఇచ్చిన ఆదేశాలు, గతంలో ఇదే కోర్టు ఇచ్చిన ఉత్తర్వులకు విరుద్ధం అవుతుంది' అని పేర్కొన్నారు.

## అనేక విజయాలు

(మొదటి పేజీ తరువాయి)









చేరుకుంది. తిమ్మాజిపేట, బిజినేపల్లి, తెలకపల్లి మండల కేం ద్రాలతోపాటు నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో బహిరంగసభను నిర్వహించారు. సభకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు ఎం.బాల్‌నర్సింహ్మలు నాయకత్వం వహించగా, నాగర్‌కర్నూల్ జిల్లా సిపిఐ కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ అధ్యక్షత వహిం చారు. పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ మతతత్వ పెట్టుబడి బిజెపిని తరిమి కొట్టేందుకు వామపక్షాలను బలోపేతం చేయాలని, ప్రజా సమస్యలు పరి ష్కారం కావాలంటే కమ్యూనిస్టు జెండాను ప్రతి ఒక్కరూ చేపట్టాలన్నారు. మావోయిస్టులు సైతం కమ్యూనిస్టులతో కలిసి రావాలని తద్వార కేంద్రం లోని ప్రజా వ్యతిరేక బిజెపికి అడ్డుకట్టవేయవచ్చునని అన్నారు. ఖమ్మంలో నిర్వహించే బహిరంగసభ దేశానికే ఒక మైలురాయిగా నిలుస్తుందని, దేశంలో, రాష్ట్రంలో సామాన్యప్రజలకు సంక్షేమ పథకాలు అందడానికి సిపిఐ పోరాటపటిమనేని వారు గుర్తుచేశారు. నేడు కేంద్రంలో అధికారం లోఉన్న బిజెపి ప్రభుత్వం బడాపెట్టుబడిదారులు, కార్పొరేట్ శక్తులతో చేతులుకలిపి ప్రజల భవిష్యత్తును అంధకారం చేస్తుంటే బిజెపికి వ్యతిరే కంగా వామపక్ష ప్రజాతంత్ర శక్తులను ఏకంచేసి పోరాటాలు నిర్వహిస్తు న్నదన్నారు. సిపిఐరాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు ఎం.బాల్‌నర్సింహ్మ మాట్లా డుతూ నేటితరానికి వాస్తవాలను వివరించడానికి ఖమ్మంలో బహిరంగస భను నిర్వహించడం జరుగుతుందని, రాష్ట్రంలో మూడు జిల్లా కేంద్రాల నుండి మూడు బస్సు ప్రచారజాతాలు బయలుదేరాయన్నారు. సిపిఐ నా యకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో తరలివచ్చి ఖమ్మం బహిరంగస భను విజయవంతం చేయాలని కోరారు. ఈ జాత కార్యక్రమంలో మహ బూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి బాలకిషన్, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్య క్షులు శ్రీనివాసులు, కంట్రోల్ కమిషన్‌సభ్యులు ఆనంద్‌జి, సిపిఐ రాష్ట్రస మితి సభ్యులు కేశవులుగౌడ్, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వెంకటమ్మ, సిపిఐ నాయకులు హుస్సేనయ్య, సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులు టి.నర్సిం హ్మ, పెబ్బేటి ఏవిజయుడు, జిల్లాసమితి సభ్యులు, వివిధ మండలాల కార్యదర్శులు, వివిధ గ్రామాల ప్రజలుఅధికసంఖ్యలో పాల్గొన్నారు.

### దేశ విముక్తికి రాజీలేని పోరాటాలు

అనంతరం నల్లగొండ జిల్లా డిండి మండలానికి చేరుకుంది. పార్టీ శ్రేణులు జాతాకు పెద్ద ఎత్తున స్వాగతం పలికి, జాతాకు నాయకత్వం వహిస్తున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాల నర్సింహా, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యంలను శాలువా, పూలమాలలతో సన్మానించారు. అనంతరం ర్యాలీ గా రాజీవ్ గాంధీ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సభకు తరలివెళ్లింది. సభల పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ భారత దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని మొట్టమొదటగా గర్జించిన పార్టీ సిపిఐ అని అన్నారు. బ్రిటిషీ యుల నుండి దేశ విముక్తికి రాజీలేని పోరాటాలు చేస్తున్నందుకే ఆనాడా పార్టీపై నిషేదం విధించారని అన్నారు. ఎన్ని నిర్భందాలు చేసిన జైలలో పెట్టిన అలుపెరుగకుండా కార్మిక విద్యార్థి, యువజన, రైతు, మహిళా ప్రజాసంఘాల నిర్మించి వెట్టిచాకిరి విముక్తి కోసం కార్మికులు, కర్షకులను దోపిడీ నుండి విముక్తి చేయడానికి రాజీలేని పోరాటాలు సిపిఐ నిర్వహిం చిందని ఆయన అన్నారు. నాగార్జునసాగర్, శ్రీరామ్ సాగర్, సీతారామ ప్రాజెక్ట్ లాంటి అనేక ప్రాజెక్టుల సాధనలో అలుపెరుగని పోరాటం సిపిఐ చేసిందని, తెలంగాణకు తలమానికమైన సింగరేణి సంస్థకు పరిరక్షించేం దుకు కార్మికుల సమస్యలపైన అలుపెరుగని పోరాటాలు నిర్వహించింది సిపిఐ అని అన్నారు. సహజ వనరులను కాపాడేందుకు బయ్యారం ప్రాంతంలో లక్షల కోట్ల విలువైన ఖనిజ సంపద ఐరన్ ఓర్‌ను కాపాడ డంలో శాసన సభలో వెలుపల విరోచిత పాత్ర సిపిఐ నిర్వహించిందని ఆయన అన్నారు.

### బాల నర్సింహా, నెల్లికంటి సత్యం మాట్లాడుతూ...

2014లో ప్రతి కుటుంబానికి 15లక్షలు ఇస్తామని రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని ధరలు తగ్గిస్తామని, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తా మని ప్రజాకర్షక నినాధాలతో అధికారంలోకి వచ్చిన బిజెపి అవేమీ అమ లు చేయలేదని, దేశంలో ప్రజల మధ్య మత విద్వేశాలు, భావోద్వేగాలు రెచ్చగొడుతూ వరుసగా అధికారం నిలబెట్టుకుంటుందని అన్నారు. రైతు లు కార్మికులను పెట్టుబడిదారులకు కట్టు బానిసలుగా మార్చే చట్టాలు బిజెపి తెచ్చిందని వీటి రద్దు కొరకు సిపిఐ నిరంతరం పోరాడాల్సిన అవ సరం ఎంతైనా ఉందని అన్నారు. దేశంలో కమ్యూనిస్టులు ఐక్యత వామ పక్ష ప్రజాతంత్ర శక్తుల ఐక్యత కోసం సిపిఐ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సిం హారెడ్డి, గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్యానాయక్, జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి, మాజీ ఎంపిపి వెంకటరమణ, మండల కార్యదర్శి కనకా చారి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మైనోద్దీన్, సహాయ కార్యదర్శి విజేం దర్‌రెడ్డి, మండల కార్యవర్గ సభ్యులు, జిల్లా సమితి సభ్యులు, ఎఐఎస్‌ఎఫ్, ఎఐవైఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 4 వారాలు గడువు

(మొదటి పేజీ తరువాయి)

బిఆర్ఎస్ ఎమ్మెల్యేలపై అనర్హతపై మూడు నెల ల్లో నిర్ణయం తీసుకోవాలని అసెంబ్లీ స్పీకర్‌ను ఆదేశించింది. భారత ప్రధాన న్యాయమూర్తి బి. ఆర్.గవాయ్ ధర్మాసనం తన మునుపటి ఆదేశా లను పాటించకపోవడాన్ని 'అత్యంత దారుణ మైన ధిక్కారం'గా అభివర్ణించింది. అయితే తదు పరి ఉత్తర్వులు వచ్చేంతవరకూ తెలంగాణ శాస నసభ స్పీకర్, ఇతరులను వ్యక్తిగత హాజరునుండి ధర్మాసనం మినహాయించింది.అనర్హత పిటిష న్లపై నిర్ణయం తీసుకోవడానికి మరో ఎనిమిది వారాల సమయం పొడిగించాలని కోరుతూ స్పీక ర్ తరపున దాఖలు చేసిన ప్రత్యేక పిటిషన్‌పై ధర్మాసనం నోటీసు జారీ చేసింది. తెలంగాణ శాసనసభ స్పీకర్ కార్యాలయ ం తరపున న్యాయ వాది శ్రవణ్‌కుమార్‌తో పాటు సీనియర్ న్యాయ వాదులు ముకుల్ రోహత్గి, అభిషేక్‌సింఘ్వీ హాజ రయ్యారు. వారు తమ వాదనలు వినిపిస్తూ బిఆ ర్ఎస్ ఎమ్మెల్యేల అనర్హతపై నిర్ణయం తీసుకునేం దుకు మరో 8 వారాల సమయం పొడిగించాలని కోరుతున్నారని స్పీకర్ తరపున తెలియజేశారు. నాలుగు అనర్హత పిటిషన్లపై విచారణ పూర్తి అయ్యిందని, మూడు కేసుల్లో సాక్ష్యాల నమోదు ముగిసిందని న్యాయవాదులలో ఒకరు తెలి పారు. 'దీనిని ముగించి ఉండాలి. ఇది అత్యంత దారుణమైన ధిక్కారం. కొత్త సంవత్సరాన్ని ఎక్క డ జరుపుకోవాలో ఆయనే నిర్ణయించుకోవాలి' అని సిజెఐ బి.ఆర్.గవాయ్ అన్నారు. కాగా బెంచ్ ఈ అంశాలపై తదుపరి విచారణను నాలు గు వారాల తర్వాతకు వాయిదా వేసింది.కోర్టు భావాలను తాను స్వయంగా స్పీకర్ కార్యాలయా నికి తెలియజేస్తానని, నాలుగు వారాలలో నిర్ణ యాలు తీసుకుంటారని ఆశిస్తున్నానని రోహత్గి ధర్మాసనానికి హామీఇచ్చారు.

కాగా ఇదిలాఉంటే నవంబరు 10న, నవంబరు 17న విచారణకు సుప్రీంకోర్టు అంగీక రించింది, తెలంగాణ స్పీకర్‌కు వ్యతిరేకంగా కోర్టు ధిక్కార చర్యలను కోరుతూ పిటిషన్ దాఖ లు చేశారు. బి.ఆర్.ఎస్ నాయకులు కె.టి.రామా రావు, పాడి కౌశిక్‌రెడ్డి, కె.వివేకానంద్ సుప్రీంకో ర్టులో బ్యాచ్ ఆఫ్ రిట్ పిటిషన్స్ దాఖలు చేశారు. జులై 31న ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గ వాయ్, జస్టిస్ ఏ.జి.మాసిహ్‌లతో కూడిన ధర్మా సనం వెలువరించిన తీర్పు నుంచి ఈ ధిక్కార పిటిషన్ వచ్చింది. రాజ్యాంగంలోని 10వ షె డ్యూల్ కింద అనర్హత పిటిషన్లను నిర్ణయించే ట్రైబ్యునల్‌గా స్పీకర్ వ్యవహరిస్తారని తత్ఫలి తంగా రాజ్యాంగ బలం అనుభవించలేరు అని సుప్రీంకోర్టు పునరుద్ఘాటించింది. 10వ షెడ్యూల్ ఫిరాయింపుల కారణాల వల్ల అనర్హత వేటు విధించే నిబంధనలను వివరిస్తుంది.

## కొట్టేసిన కేటుగాళ్లు

(మొదటి పేజీ తరువాయి)

నివసిస్తున్నారు. ఆమె ఓ ఐటి ఉద్యోగి. 2024 సెప్టెంబర్ 15న ఓ వ్యక్తి ఆమెకు ఫోన్ చేశాడు. తాను డిహెచ్ఎల్ కొరి యర్ కంపెనీ ప్రతినిధి అని చెప్పి, మీ పేరుతో 3 క్రెడిట్ కార్డులు, 4 పాస్‌పోర్టులు, నిషేధిత ఎండిఎం డ్రగ్స్ ఉన్న ప్యాకేజీ ముంబయిలోని అంధేరీ కొరియర్ సెంటర్‌కు వచ్చిందన్నాడు. దీంతో ఉమారాణి తాను బెంగళూరులో నివసిస్తున్నాని, ఆ ప్యాకేజీతో తనకు ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. అయితే ఆ వ్యక్తి, మీ ఫోన్ నంబర్‌తో ఆ ప్యాకేజ్ లింక్ చేయబడి ఉందని, అది సైబర్ నేరం కావ చ్చని పేర్కొన్నాడు. అంతేకాదు దానిపై సైబర్ క్రైమ్ సెల్‌కు ఫిర్యాదు చేయమని చెప్పాడు. దీనికి ఉమారాణి స్పందించే లోపు, అతనే ఓ వ్యక్తికి కాల్ చేసి అతను సిబిఐ అధికారి అని బాధితురాలికి తెలిపాడు. ఆ సైబర్ నేరగాడు సిబిఐ అధికారిలాగా నటిస్తూ, ఉమారాణి నుంచి పలు వివరాలు సేకరించాడు. ఆమెపై సిబిఐ నిఘా ఉంచిందని బెదిరిం చాడు. అంతేకాదు దీని గురించి స్థానిక పోలీసులకు చెప్ప వద్దని హెచ్చరించాడు. దీని గురించి ఎవరికైనా తెలియ జేస్తే, ఆమె కుటుంబం మొత్తాన్ని కేసులో ఇరికిస్తామని బెది రించాడు. దీనితో ఆమెకు ఏం చేయాలో తోచలేదు. పైగా తన కుమారుడి వివాహం దగ్గరలో ఉండడంతో, ఆ మోస గాళ్లు చెప్పినట్లే ఆమె చేసింది. అక్కడికి కొన్ని రోజుల తర్వాత, సిబిఐ అధికారినంటూ చెప్పుకున్న ఆ మోసగాడు మళ్లీ ఫోన్ చేశాడు. ఈసారి అతను వీడియో కాల్ చేసి, ఉమారాణిని డిజిటల్ అరెస్టు చేస్తామని బెదిరించాడు. ఆ తరువాత రాహుల్ యాదవ్ అనే మరో వ్యక్తిని వారం రోజుల పాటు ఆమెను పర్యవేక్షించడానికి నియమించాడు. వాస్తవానికి ఆ సమయంలో ఆమె వర్క్ ఫ్రం హోమ్ చేస్తు న్నారు. అదే విషయాన్ని మోసగాళ్లకు చెప్పారు. దీనితో సదరు మోసగాడు 2024 సెప్టెంబర్ 23న మళ్లీ ఫోన్ చేసి, అరెస్టు నుంచి తప్పించుకోవాలంటే, మీకున్న అన్ని ఆస్తు లను ఆర్‌బీఐకి చెందిన ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ యూనిట్ ముందు ప్రకటించాలని ఆదేశించాడు. ఇదంతా నిజమే అని నమ్మిన బాధితురాలు, ఆ మోసగాడు చెప్పినట్లే చేసింది. బాధితురాలు పూర్తిగా వారి ట్రాప్‌లో పడిపోవ డంతో, క్రమంగా ఆమె నుంచి డబ్బు గుంజారు. బాధితు రాలు తన ఎఫ్‌డీ డబ్బులను మినహాయించి, మిగతా సేవింగ్స్ ద్వారా, ఆస్తుల ద్వారా వచ్చిన ఆదాయం అంతా కలిపి రూ.31.83 కోట్లను దాదాపు 187 లావాదేవీల ద్వారా మోసగాళ్లకు బదిలీ చేసింది. ఇలా తమకు బదిలీ చేసిన డబ్బును 2025 ఫిబ్రవరి నాటికి ధ్రువీకరించి తిరిగి ఇస్తామని మోసగాళ్లు ఆమెను నమ్మించారు. చివరికి వారు సదరు మహిళకు క్లియరెన్స్ సర్టిఫికెట్ కూడా ఇచ్చారు. అయితే గడువు దాటిపోతున్నా కూడా తన డబ్బును తిరిగి ఇవ్వకపోవడంతో ఆమెకు అనుమానం వచ్చింది. తాను మోసపోయానని గ్రహించి, ఈనెల 14న బెంగళూరులోని తూర్పు డివిజన్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన కుమారుడి వివాహం, ఇతర కారణాల వల్ల ఫిర్యాదు చేయ డంలో చాలా ఆలస్యమైందని సదరు మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. దీనితో ఎఫ్ఐఆర్ నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించాం' అని పోలీసులు తెలిపారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com